సంపుటి: 24
సంచిక: 3

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు

అక్టోబరు, 1977

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. సీ. మోహన్నాథ్

తొలిమాట

నమస్కారము. ఈ సంచికలో మరో సరికొత్త క్రైమ్ సీరియల్ 'నరాంతకులు' ప్రారంభమవుతుంది. దీనిని మీ అభిమాన రచయిత్రి వసుంధరగారు వ్రాశారు. గతంలో పాఠకులను విశేషంగా ఆకర్షించి 'స్టంట్‌మాస్టర్' తర్వాత అటువంటి థ్రిల్లింగ్ నవల ఇది.

ఈ నెల 'హోమ్ డెలివరీ' సభ్యుల నెంబర్లలో మార్పు జరిగినది. కొత్త నెంబరు వారికి వచ్చే వి.పి. పాకెట్ మీద వుంటుంది. గమనించండి. సభ్యులు ఇకమీదట ఉత్తర ప్రత్యుత్తరాలలో, పోటీలలో తమ కొత్త నెంబరునే ఉదహరించాలి. ఏజెంట్ ద్వారా డెలివరీ అవుతున్న హోమ్ డెలివరీ సభ్యుల నెంబర్లలో మార్పులేదు.

చాలామంది పాఠకుల సూచన మీదట 'బ్యాలెట్' పత్రాన్ని సీరియల్ నవలకు ఆటంకం కల్గని విధంగా ప్రచురించాము. ఇది అందరికీ సంతోషాన్ని కలిగిస్తుందను కొంటాము.

'జీవిత చందా' 12 సులభ వాయిదాలలో కట్టే పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాము. అంతేకాదు, మొదటి వాయిదా సొమ్ము అందగానే, వారు కోరుకున్న రు. 30/లు విలువగల అపరాధ పరిశోధన, సప్లిమెంట్ — వానస్‌గా పంపుతాము. వివరాలకు చివరి పే

సెల—

ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. జాతకఫలం__కురుమద్దాలి విజయలక్ష్మి
18. హత్యాదృశ్యం__కొండలరావు.
34. ముష్టివాడు ఉలెన్ కోటు__లలితకుమారి.
48. మూడు అపూర్వ వస్తువులు__జొన్నలగడ్డ రామలక్ష్మి
65. దొంగ ఎవరు?__శశిభూషణ్.
82. లక్షకొక వెయ్యి__కె. బి. యస్. కుమార్.
96. ఆటకట్టు__ఎస్. గీతారాణి.
114. డబ్బుతో పేచీ__వసుంధర.
132. జరుగబోయే దారుణం__వాసవదత్త.
142. కలసిరాని గ్రహకూటమి__అజీజ్.
158. నరాంతకులు (సీరియల్)__వసుంధర.

నవలలు (సప్లిమెంట్)

3. నల్ల చిఱుతలు__లలితకుమారి.
48. లక్ష్మిచెర__వసుంధర.
88. మానవుడా? దానవుడా__అజీజ్.
119. రంగూన్ మిత్రుడు__కురుమద్దాలి విజయలక్ష్మి.
151. శాన్యోరా (సీరియల్)__ముద్దా సురేష్.

ఇవికాక__అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, పాఠకుల అభిప్రాయాలు, జోక్స్ చెప్తా వినండి, క్రైమ్‌లో తమాషాలు, మరెన్నో ఆకర్షణలు!!!

జాతక ఫలం!

కురుమద్దాలి విజయలక్ష్మి

బయట సన్నగా జల్లు వుండివుండి పడుతున్నది.

ఉరుములు మెరుపులు మాత్రం పోటీపడుతూ చకచక తమపని కానిస్తున్నాయి.

అక్టోబరు నెలలో కురుస్తున్న వర్షం యిది. అందువల్ల చలి దంచేస్తున్నది. భుజంమీదవున్న కంబళిని వీపు చుట్టూ తిప్పి కప్పుకుని బీడీ వెలిగించాను.

ఇప్పుడు కొద్దిగా వెచ్చగా, హాయిగా వుంది.

గోడకి చార్లగిలబడి నలువైపులా పరికించాను. చింకి దుప్పట్లు కప్పుకుని కొందరు, చివిగిన పేలికల్లాంటి గుడ్డ ముక్కలతో వళ్ళు దాచుకుని కొందరు నిద్రాదేవి వడిలో జోగుతున్నారు తలోవక్కన.

ఠాణాలో పదకొండు గంటలు కొట్టడం విన్నాను. చివరంటా కాలిన బీడిని ఆర్పి ఓ మూలగా విసిరేసి నేనూ ఆ సత్రంలో పడుకోటానికి పక్కపర్చుకున్నాను.

"బైరాగిబాబూ!" ఎవరో నా పక్కనే వచ్చికూర్చుని నెమ్మదిగా నన్ను తడుతూ పిలిచారు.

"ఎవరది!" అంటూ లేచి కూర్చున్నాను.

నేనున్న సత్రం పాతకాలంనాటిది. బిచ్చగాళ్ళకి నాలాంటి సన్యాసులకి నివాసంగల ఈ సత్రంలో లైటెక్కడి నుంచి వస్తుంది! వీధిలైటు కాంతి కొద్దిగా గదిలోపలిదాకా పడుతుంది అంతే. ఈ మాత్రంకాంతిలో మనిషి ఆడో మగో గుర్తుపట్టొచ్చుగాని ముఖకవళికలు చెప్పలేము.

నన్ను తట్టి పిలిచినతను మగమనిషి. స్వరాన్నిబట్టి రూపాన్నిబట్టి గుర్తించాను.

"నేను మీతో ఓ అవసరమైన పనివుండి వచ్చాను బైరాగిబాబూ! మనం అలా బైటికెళ్ళి అరుగుమీద కూర్చుని మాట్లాడుకుందాం."

"సరే" నంటూ లేచాను. పనిమాలి రాత్రి సమయంలో నా కోసం ఓ మనిషి వచ్చి బైటికి పిలిచాడంటే పెద్ద కారణమే వుండివుంటుంది.

ఇరువురం బైటికొచ్చి అరుగుమీద అనుకున్నంత దగ్గరగా కూర్చున్నాం.

"ఆ .... అవసరమేమిటో యిహ శలవివ్వండి" అన్నాను.

"మీరెవరో నాకు తెలుసు" అన్నాడు అతను.

గతుక్కుమన్నాను.

కొంపదీసి నేనెవరో వీడికి తెలియదుకదా!

మారువేషంలో సి. ఐ. డీ ఏమో!

నా నోట్లోంచి మాట రాకముందే ఆటంబాంబులా పేలినట్లు మరోమాట వదిలాడు.

"వారం రోజులబట్టీ మీ నీడనే కనిపెట్టి తిరుగుతున్నాను."

నా ప్రాణం ఓసారి షికారుగా అలా పైకెళ్ళి తిరిగొచ్చింది.

"నే చెప్పినట్లు నాకు సాయం చేస్తే తృణమో, పణమో నాకు తోచింది సాయం చేస్తాను. ఇటు మీకు, అటు నాకు అవసరం తీరిపోతుంది."

అమ్మయ్య వీడెవడో కొత్తబిచ్చగాడు. లేక ఏ ఘనాపాఠీయో అయివుంటాడు. నా సంగతి తెలిపి నా నీడన తిరిగేవాడికి నాతో అవసరం పడిందంటే ఏమనుకోవాలి!

"మీరేం చెప్పుతున్నారో నాకర్థంకావడం లేదు. అసలు విషయానికొచ్చి వివరంగా చెపితే ఏదయినా చేయగలను" రంగంలోకి దిగుతూ అన్నాను.

"మంచిది. నా పేరు గోపాలం. నా గురించి చెప్పాలంటే తల్లితండ్రిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడిని. మామయ్యదగ్గర పెరిగి పెద్దవాడినయాను. మామయ్యాకి ఆస్తివుంది. అందమైన ఒక అమ్మాయివుంది. పేరు రమ. నేను రమని ప్రేమించాను. నాకిచ్చి రమని వివాహం చేయటం మామయ్యకిష్టం లేదు.

ఎలా అయినా సరే రమ నా భార్యకావాలి. ఎన్ని విధాలనో ప్రయత్నించాను. ఏ ప్రయత్నము ఫలించలేదు. అందుకే ఓ ప్లాను వేశాను. ఇది లాస్ట్ అండ్ ఫైనల్. నా ప్లానుకి మీరు సహకరించి సాయంచేస్తే నా కోరిక తీరుతుంది. మీకు కొంత డబ్బు యివ్వగలను" అంటూ గోపాలం ఆగాడు నేనేమంటానో వినటానికి.

"ప్లాను ఏమిటి? మీకు సహకరిస్తానని ఎలా అను

కున్నారు! నేను ఒక సన్యాసిని....." అంటూ అర్ధోక్తిగా ఆగిపొయ్యాను.

"మీరు ఊ అంటే నా ప్లాన్ చెపుతాను. మీ వేష ధారణ సన్యాసి కావచ్చు కాని....మీరు చేసే పనివేరు. వారంరోజుల క్రితం బస్‌లో ఒకతని పర్స్ కొట్టేయటం చూశాను. అప్పుడే మెరుపులా నా మనసులో ఓ ప్లాన్ తట్టింది. మిమ్మల్ని నీడలా వెన్నాడి గ్రహించింది ఏమంటే బీడీ సిగరెట్టు తాగడం. మాంసాహారం తినటం. అప్పు డప్పుడు చెయ్యివాడితనం....నాకు కావలసింది మీ బోటి సన్యాసి. మీకు కావలసింది డబ్బు. నా మాట వింటే ఇరువురి కోరికలు తీరుతాయి."

తోడుదొంగలాంటి వాడివద్ద మనసు విప్పి మాట్లాడుటే మంచిది. కల్సివస్తుంది. సరేనంటే అతని ప్లాన్ చెపుతాడు. నాకు డబ్బు వస్తుంది.

"నా గురించి తెలుసుకున్నారు. బొంకటందేనికి. ఉన్న మాటే చెపుతాను. జేబులు కొడతాను. అలవాట్లకి బానిసని. హాయిగా అన్ని అనుభవించటం నా అభిమతం. చేతిలో డబ్బు మెదులుతుంటే సరే లేకపోతే నా సన్యాసివేషం వుంది కదా, అదే పొట్ట నింపుతుంటుంది. మీ ప్లాన్ చెప్పండి. నాకు అనుకూలంగా వుంటే మీకు సహకరించి మీరిచ్చేది పుచ్చుకుంటాను."

"మంచిది. మామయ్యకి జాతకాలపిచ్చి ఎక్కువ. ఏ విషయంలోను లొంగడు. ఓ పైసాకి రెండు పిల్లపైసా లను పుట్టించగల తెలివితేటలున్నాయి రమని నాకిచ్చి పెళ్ళి చేయటం యిష్టంలేదు. రమతో నా వివాహం జరగా లంటే మీరూ నేనూ కల్సి ఓ నాటకం ఆడితే చాలు."

"ఏ విధంగా?"

"మామయ్యకి ఉదయం పదిగంటలలోపల వరండాలో కుర్చీలో కూర్చోటం అలవాటు. ఆ సమయంలో మీరు మా యింటికి రండి. మామయ్య సన్యాసులని జాతకాలను నమ్ముతాడు కాబట్టి మీ తెలివితేటలు వుపయోగించి మామయ్య జాతకం చెప్పండి. మామయ్య జాతకం మొత్తం నే చెబుతానుగాబట్టి మీకు కష్టంలేదు. మామయ్యకి మీమీద గురి కుదురుతుంది. ఇంట్లో అందరి చేతులు చూపి జాతకం చెప్పమంటాడు. చెప్పండి. నా గురించి చెప్పే దాన్నిబట్టి మామయ్య మనసు మార్చుకుని రమని నాకిచ్చి వివాహం చేస్తాడు. ఈ ప్లాన్ ఫలిస్తే నేను దాచుకున్న రెండువేలు మీకు యిస్తాను."

"రెండువేలేనా?"

"అదయినా నా చేతిలోవున్న మొత్తం మీ చేతిలో పెట్టటం. రమతో నా వివాహం అయితే అప్పుడు మామయ్య మీద ఆధారపడి నే మనుగడ సాగించాల్సిందే. ఇంతకు మించి నా వద్ద పైసాలేదు. మీ యిష్టం" అన్నాడు గోపాలం.

రెండువేలు. అది తక్కువమొత్తమేమీ కాదు. ఈమధ్య జేబులు కొడితే, ఏ వెధవ జేబులోను వందమించి లేవు. నాలుగు నెలలకి నిండా అయిదు జేబులు కొట్టలేకపోయాను. జేబులో కాసీవున్న ప్రతివెధవాయి జాగ్రత్తపడేవాడే. గోపాలం చెప్పినపని చాలా తేలిక రెండువేలు ముడతాయి. ఆలోచించాను. దీనిలో రిస్క్ కనపడలేదు.

"మీకు సాయం చేయటానికి వప్పుకుంటున్నాను. నా ప్రశ్నలకి జవాబు చెప్పండి."

"సంతోషం. అడగండి" పొంగిపోతూ అన్నాడు గోపాలం.

"మీ ఇంట్లో జరిగిన కొన్ని ముఖ్యవిషయాలు. ఇంట్లో వారి గుణగుణాలు. శరీరంమీద పుట్టుమచ్చలు. ఎప్పుడయినా ఏ ప్రమాదమయినా తప్పాయా. ముందు మీ వివరాలన్నీ చెప్పండి. అవి నే మల్చుకునే విధంగా మల్చుకుంటాను. తర్వాత విషయం. ఈ నాటకంలో నా పాత్ర ముగియం గానే వెంటనే డబ్బుముట్టజెప్పాలి. అలా కాని పక్షంలో ఇది నాటకం అని మీ మామయ్యకి చెప్పేయటం నాకు తప్పదు. మీ పని ఫలించకపోగా కష్టాలపాలు కావటము మీకు తప్పదు."

"ఆ మాత్రం గ్రహించలేనివాడిని కాదు. వెంటనే డబ్బు ముట్టచెపుతాను. ప్లాన్ ఫలించే విధంగా చూడటం మీ పని. ఆ పని సఫలం కాకపోతే?"

"సఫలం అవుతుంది. ఉదయం జాతకం చెపుతాను సాయంత్రానికి ఫలితం తెల్సుకుని ఆనందంతో మీరే పరు గెత్తుకొస్తారు."

"మంచిది. వివరాలు చెపుతాను వినండి."

"చెప్పండి."

గోపాలం చెపుతుంటే జాగ్రత్తగా వింటూ వుండి పోయాను.

2

"హోయ్. రామ్‌రామ్ బాపూజీ! నమస్కారం నమ స్కారం" అన్నాను చేతులు జోడించకుండానే.

వరండాలో విశ్రాంతిగా ఈజీఛయిర్‌లో మేను వాల్చిన

రఘురామయ్యగారు నే అన్నది విని కుర్చీలో లేచికూర్చుని నన్ను ఎగాదిగా చూస్తూవుండిపోయారు.

గోపాలం మేనమామ అయిన రఘురామయ్య యింటి కెళ్ళేముందు నా వేషంలో చాలా మార్పుచేసుకున్నాను. వేషంలో నా వయసు నలభై దాటినట్లు కనపడితే అసలు వయసు ముప్పై. కృత్రిమ గడ్డం రెండుజానలున్నది తగిలించుకున్నాను.

సన్యాసులు ధరించేదే పొడుగాటి కాషాయరంగు సిల్కు అంగరఖ నా శరీరంమీద వుంది. ఈ వేషంలో నా ముఖం చూస్తే సామాన్యమైన సన్యాసి అనుకోరు కాస్ట్లీ సన్యాసి అనుకుంటారు. పెద్ద ఆశ్రమం నడుపుతున్న సాధుపుంగవుడు అనుకోవచ్చు.

"ఎవరు మీరు?" రఘురామయ్య అడిగాడు.

"నా పేరు సాధు సచ్చిదానందగురుగోవిందస్వామి" అన్నాను ఓ సారి కళ్ళుమూసి తెరిచి.

"ఎవరు కావాలి మీకు?"

"ఎవరూ అక్కరలేదు నాయనా! కాలినడకన దేశ పర్యటన చేస్తున్నాను. మధ్యలో ఓ గంట ఎక్కడయినా కూర్చుని విశ్రాంతి తీసుకుంటాను. ఈ వరండాలో కొద్ది సేపు కూర్చుని వెళదామని...."

"అయ్యో, దానికేం భాగ్యంస్వామీ! ఇలా ఈ కుర్చీలో కూర్చోండి."

"కాలినడకప్రయాణ సాధనం. కడుపుకి ఫలాలు మాత్రమే ఆహారం, పుడమితల్లే నాకు ఆసనం" అంటూ వరండాలో కూర్చున్నాను.

"ఎక్కడినుంచి వస్తున్నారు. ఎక్కడికెళుతున్నారు స్వామీ!"

"హిమాలయాలలో మా గురుదేవులు జ్ఞానానంద యోగీంద్రుల వారున్నారు. వారి ఆజ్ఞమీద ప్రపంచ పర్యటన చేస్తూ నాలుగు నెలల క్రితం బైలుదేరాను. ముందు ప్రయాణం ఎక్కడికి అనేది చెప్పజాలను."

ఆ తర్వాత నేను, రఘురామయ్య పదినిమిషాలు పిచ్చాపాటి మాట్లాడుకున్నాము.

ఉన్నట్లుండి రఘురామయ్య కుడిచెవిమీదవున్న పుట్టుమచ్చని తదేకంగా చూస్తూ! "ఆహా ఏమదృష్టం నాయనా! కుడిచెవిమీద పుట్టుమచ్చ వుండటం చక్రవర్తి లక్షణం!" అన్నాను.

"నిజంగానా స్వామీ!"

"నిజమా అని తిరిగి ప్రశ్నిస్తున్నావా? పుట్టుమచ్చల శాస్త్రము, హస్తరేఖల పరిశీలన మాకు కొట్టిన పిండి. గురుదేవులు నాకెన్నియో విద్యలు నేర్పారు. కాని, హస్త రేఖలు, పాదరేఖలు, పుట్టుమచ్చలు శాస్త్రంలో మాత్రమే నేను పరిపూర్ణ పారంగతుడిని కాగలిగాను."

"అలాగా స్వామీ! నా చేతిలో రేఖలు చూపి నా జాతకం చెప్పగలరా? ఏం తీసుకుంటారు" లేచివచ్చి నా దగ్గరగా కూర్చుని అన్నాడు రఘురామయ్య.

"పైసా పుచ్చుకోను నాయనా! అలా పుచ్చుకుంటే నా కిచ్చిన ఈ జ్ఞానం పనికిరాకుండాపోతుంది. నీ చెయ్యి యిలాతే నాయనా!"

రఘురామయ్య ఇంట్లో వాళ్ళందరినీ పిలిచాడు. అంటే భార్యని, కూతురు రమని, గోపాలంని. వాళ్ళొచ్చిం తరువాత తనచేయి నా చేతిలోబెట్టి "చెప్పండి స్వామీ!" అన్నాడు.

"మీకీపిచ్చి వదలదు" భార్య విసుక్కుంది.

"మన జాతకం మనకి తెలియదా మామయ్యా!" గొణు గుతూ అన్నాడు గోపాలం కావాలనే.

"ఏం చెపుతాడో చూద్దాం. అబద్ధం చెప్పాడో అప్పుడే చెపుతాం" అంది రమ.

"నోరు ముయ్యండి. వీరు మామూలుస్వామి కారు హిమాలయాలనుంచి వచ్చారు. డబ్బు పుచ్చుకోరు." అని వాళ్ళని గదమాయించి "చెప్పండి స్వామీ!" అన్నాడు నాతో.

రఘురామయ్య చేతిలో రేఖలు చూపి ఓ పదినిమిషాలు దీర్ఘంగా ఆలోచించి గురువుగారిని ధ్యానిస్తున్నట్లుగా కళ్ళు మూసుకుని ఆపై ఆయన జాతకం చెప్పాను. పుట్టు పూర్వోత్తరాలు చెప్పడమే గాక ఓ సారి టైఫాయిడ్ జ్వరంవస్తే మరణించాడని కింద పెట్టటం, పొగరుమోతు ఎద్దు డొక్కలో కుమ్మటం, కారు ప్రమాదంలో వెంట్రుక వాసిలో ప్రమాదం తప్పటం, వగైరా వగైరా చెపితే ఆయన, మిగతావారు ఆశ్చర్యంతో అమాంతం నా కాళ్ళకి మొక్కారు.

ఆ తర్వాత ఆయన భార్య జాతకం చెప్పాను. ఆ జాతకం కరెక్టే! ముందే గోపాలం చెప్పాడు కదా.

ఈదఫా జాతకం. రమ చెయ్యిచూపి చెపుతూ "ఈ అమ్మాయి హస్తరేఖలు అమోఘం" అంటూ ఎన్నో చెప్పి చివరికి ఈపిల్ల తొంటిమీద పైసా అంత పుట్టు మచ్చలు అంగుళం దూరంగా రెండు వున్నాయి. దానివల్ల మంచి చెడు దగ్గర దగ్గరగా వున్నాయి" అంటూ ఆగాను.

రమ తొంటిమీద సరిగ్గా పైసా అంత నల్లని పుట్టు

మచ్చలు అంగుళం పెదంలో పక్క పక్కన వున్నాయిట. ఓసారి గోపాలం చాటుగా చూశాడుట రమ స్నానం చేస్తుండగా. రమ పుట్టు మచ్చల గురించి గోపాలం చెప్పాడు.

"అదేమిటి స్వామీ! ఆగిపొయ్యారు మంచి చెడు ఫలితాలు దాయకుండా చెప్పండి. అవసరమయితే చెడు పోవటానికి శాంతుల లాంటివి జరిపిస్తాను" అన్నాడు రఘురామయ్య.

ఓ నిమిషం ఆగి ఆయన బలవంత పెట్టిన తరువాత అసలు విషయానికొచ్చాను. రమకి పరాయి సంబంధం చేస్తే విధవరికం తప్పదని దగ్గర సంబంధం వరసయిన వాడికిచ్చి చేస్తే అన్నివిధాలా మేలు జరుగుతుందని. దీనికి తిరుగులేదని చెప్పాను. ఇంకా కొన్ని నమ్మదగ్గ మాటలు చెప్పాను.

రఘురామయ్య ముఖంలో విచార రేఖలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. గోపాలం చేయికూడా చూడమని చెప్పాడు.

"ఏదెలా జరగాలో అలా జరుగుతుంది. జరిగినవి అందరూ చెప్తారు. జరగబోయేవి మాత్రం నిజాలుకావు" మేమిరువురము ముందనుకున్న విధంగానే గట్టిగా అనే శాడు గోపాలం.

రఘురామయ్య కోప్పడటం గోపాలం గుణుస్తూ చేయి చాచటం నేను జాతకం చెప్పటం జరిగింది.

"నా భార్య యిప్పుడు ప్రసవించే రోజులు. నాకు అబ్బాయి పుడతాడా? అమ్మాయా? చెప్పండి స్వామీ" అన్నాడు గోపాలం.

వెంటనే నేను కోపంగా నొసలు ముడేసి గడ్డం నిముడు

కుని "పెద్దవాళ్ళతో హాస్యాలాడటం తగదు. నీకు వివాహం కానిది భార్య ఎక్కడినుంచి వస్తుంది? ఇలా అబద్ధాలాడటం తగదు. జీవితంలో నిరాశతో నిన్ను నీవు చిన్న బుచ్చుకుంటున్నావు. అన్ని ఆఖరయి నీవు మంచి వ్యక్తిత్వం గలవాడివయే రోజు దగ్గర పడింది" అన్నాను.

"ఎప్పుడు?" ఆదుర్దాగా అడిగాడు గోపాలం.

"అకస్మాత్‌గా అబ్బే సిరి కళ్ళుండి గుడ్డివాడిని చేస్తుంది. అహంభావం అహంకారాన్ని పెంపొంద చేస్తుంది. నీ విషయంలో అలాకాదు. వివాహం అయిన మూడో వారంలో లక్ష్మి తానంతట తాను నిన్ను వరిస్తుంది. లకారాలకి అధిపతి వవుతావు. అక్కడితో నీదశ తిరుగుతుంది. జీవితాంతం భార్యా బిడ్డలతో భోగభాగ్యాలు అనుభవిస్తావు" అన్నాను.

ఆ తర్వాత కొద్దిసేపు విశ్రాంతి నెపంతో మాట్లాడుతూ కూర్చున్నాను. పండ్లు పాలు యివ్వబోతే వంటిపూట అదీ రాత్రి మాత్రమే రెండుపండ్లు భుజిస్తానని చెప్పి. ఏదీ స్వీకరించలేదు. ఆపై అందరివద్ద శలవు తీసుకుని బైలుదేరాను.

ఆ రాత్రి గోపాలం సత్రానికొచ్చి నాకు రెండువేలు యిచ్చాడు.

సాయంత్రం రఘురామయ్యగారు గోపాలంతో చెప్పారుట రమకి వేరే సంబంధాలు చూడను. నీవే రమకి భర్తవి, నాకు అల్లుడివి అని....

గోపాలానికి రమనిచ్చి పెళ్ళిచేసిన కొద్దిరోజులకే రఘురామయ్యకి తెలుస్తుంది గోపాలం జాతక ఫలితం.

తెరలు తెరలుగా వస్తున్న నవ్వుని బలవంతానా ఆపు

కున్నాను. అంతలో- చటుక్కున నాకో అయిడియా వచ్చింది.

3

అవసరానికి మారువేషాలలో తిరగటానికి నావద్ద కొన్ని డ్రస్ లున్నాయి. వాటిల్లో ఓ మంచి సూటు తీసి ధరించాను. నారూపం పూర్తిగా మార్చుకున్నాను.

ఆ రోజు రఘురామయ్యని చాటుగా కల్సుకున్నాను.

"మీరు జీవితంలో ఘోరంగా మోసపోబోతున్నారు. నమ్మినవారే మీకు ద్రోహం తలపెట్టారు. ఆ నమ్మక ద్రోహమేదో నాకు తెలుసు. మీరు నాకు మూడువేలు యిస్తే వెంటనే ఆ ద్రోహి, ద్రోహము చెపుతాను.ఇప్పుడు మీకు నేను సాక్ష్యం చూపలేను. ఎందుకంటే నా ఫీజు పోతుంది. ఇలా మీరు నా చేతిలో మూడువేలు వుంచటం అలా నేను రహస్యం చెప్పటం ఏకకాలంలో జరుగుతుంది. సమ్మతమేనా?" అన్నాను.

"ఎవరు నీవు? రహస్యమేమిటి? లోకంలో రకరకాల మోసాలు జరుగుతుంటాయి, నావద్ద డబ్బు కాజేయటానికి ఇదో నాటకమా?" అన్నాడు రఘురామయ్య.

"ఇది మోసముకాదు. మీరు మీ అమ్మాయిని గోపాలానికిచ్చి పెళ్ళి చేయబోతున్నారు. అందులో మోసం వుంది. ఆ రహస్యం నాకు తెల్సు. రహస్యం తెల్సుకున్నందున మోసంనుంచి తప్పించుకోగలుగుతారు మీరు. దానికి ఫీజు మూడువేలు అడిగాను."

"మూడువేలు పుచ్చుకుని వుడాయిస్తావేమో! పైగా రహస్యం అంటున్నావు. రహస్యమేమీ నాకు వుపయోగ దేపది వుండదేమో?"

"మోసపోతానేమో అనే భయం మీకుండటం సహజం. మీచేతిలోనే మూడువేలు వుంచుకోండి. నేచెప్పింది విని ఆపై నాకు యివ్వండి. మిమ్మల్ని ఓ ఆపదనుంచి తప్పిస్తున్నాను. దానికి ఫీజనుకోండి. లంచం అనుకోండి. మీ యిష్టం!"

రఘురామయ్య ఆలోచించాడు కొన్ని ప్రశ్నవేశాడు. నా జవాబులు తృప్తిని కలిగించాయి.

రఘురామయ్య డబ్బు తీసుకువచ్చాడు.

రఘురామయ్యపైనే నిఘావేసి వుంచాను. ఆయన వంటరిగానే వచ్చాడు.

"రహశ్యాలు సేకరించటం నావృత్తి" అంటూ మొదలు పెట్టాను. గోపాల ఓ మిత్రుడు సహాయంతో నాటకం ఆడాడని....మిత్రుడు సన్యాసి వేషంతో వచ్చి ఫలానా విధంగా మిమ్మల్ని మోసం చేశాడని....వాళ్ళిద్దరు తోడు దొంగలని....చేతిలో రేఖలుచూపి జాతకం చెప్పేవాళ్ళు కొన్ని విషయాలు చెప్పగలరుగాని, ఫలానా నెలలో యిన్ని గంటలకి ఎద్దు పొడిచింది. ఆ గాయం నెలా యిరవై రోజులకి తగ్గింది. అంటూ వివరం చెప్పరని....రఘు రామయ్య నమ్మేటట్లు ఆరోజు జరిగింది వివరంగా చెప్పాను.

రఘురామయ్య నా మాటలు నమ్మాడు.

"నీవు చెప్పింది వింటుంటే నిజం నా కళ్ళముందు కనపడుతున్నది. కాని యింత వివరం నీకెలా తెలిసింది?"

"ముందే చెప్పాగా.రహశ్యాలు సేకరించటం నావృత్తి. దానిపైనే నేను జీవిస్తున్నాను. గోపాలం అతని మిత్రుడు

అనుకున్న మాటలు నా చెవినపడ్డాయి. అంతే!" అన్నాను.

రఘురామయ్య మూడువేలు నా చేతిలో పెట్టాడు. "మూడువేలు పోయినందుకు నాకు విచారంలేదు. గోపాలం లాంటి నీచుడుని అల్లుడుకాకుండా కాపాడావు. ఇంటికెళ్ళి వాడి అంతం చూస్తాను" అంటూ రఘురామయ్య వెళ్ళి పోయాడు.

వాళ్ళిద్దరు కల్పి నా అంతం చూస్తారేమో అనే భయం నాలో వుండటంవల్ల, ఆ రాత్రికి రాత్రి సంపాదించుకున్న అయిదువేలతో ఓ మారుమూల ప్రాంతానికి ప్రయాణం కట్టాను. □□□

అబద్ధాల ధర్మరాజు?

ఇన్‌స్పెక్టర్, దొంగతో—

"ఎప్పుడూ అబద్ధాలెందుకు చెపుతూ వుంటావ్?"

"ధర్మరాజే అబద్ధం ఆడేడు. నేను అబద్ధం ఆడితే తప్పా?" అన్నాడు దొంగ.

వెంటనే ఇన్‌స్పెక్టర్ "ఎవడా ధర్మరాజు, చెప్తావా? మక్కెలిరగదన్నాలా?" అన్నాడు గుడ్లురుముతూ.

—టి. వి. శ్రీనివాసరావు, బరంపురం.

హత్యా దృశ్యం?

కొండలరావు

చెళ్ళుమంది దెబ్బ. సున్నగా తెల్లగా వున్న జమున చెంప మీద కాంతారావు చేతివ్రేళ్ళు చెఱకుగడ కణుపుల్లా ఎర్రగా తేలేయి.

"నేను వచ్చేలోగా తయారుగా వుండలేకపోయావో, నీ అంతం చూస్తాను. పతివ్రత కబుర్లు కట్టిపెట్టి నేను చెప్పినట్టు చెయ్!" క్రూరంగా శాపించి విసురుగా బయటకు నడిచాడు కాంతారావు.

పడిన దెబ్బ ఆమె చెంపకు మాత్రమే తగల్లేదు. బలంగా మనసును కూడా తాకింది. అగ్నికి ఆజ్యం తోడైనట్టు అది భగ్గుమని మండింది. అవమానంతో అప్రతిభురాలై కాంతారావు వెళ్ళినవైపు చూస్తూ నిల్చుంది జమున.

తరువాత ఒక నిశ్చయానికి వచ్చినదానిలా వంటింట్లోకి నడిచింది. అలమరలో వున్న చాకు తీసుకుంది. అది

యింట్లో అవసరానికి వుపయోగించే అరంగుళాల చాకు. లైటు వెలుతురులో దాని పదును తళతళ మెరుస్తోంది. పిడి మీద పిడికిలి బిగించి సన్నగా నవ్వుకుంది జమున.

తనిప్పుడు హంతకి కాబోతోంది.

జీవితంలో తను చేసిన పెద్ద పొరపాటు కాంతారావుని భాగస్వామిగా ఎన్నుకోవడమే.

యవ్వనం పువ్వులా విచ్చుకున్న తొలిరోజులు. తెలిసీ తెలియని వయసు. ఆకర్షణకి సులభంగా లొంగే మనసు. కాంతారావుని ఎన్నుకునేలా చేసేయి.

తను గుడ్డిగా ప్రేమించింది కాంతారావుని. అతనూ తనను గాఢంగా ప్రేమిస్తున్నాడని నమ్మింది. ఆ నమ్మకం యిపుడు ముక్కలైంది.

లక్షాధికారి రంగారావు తన తండ్రి. ఆ స్తిలేని కాంతా రావును అల్లుడుగా వప్పుకోడని తనకు తెలుసు. అందుకే చెప్పకుండా పెళ్ళి చేసుకుంది.

తను బి. ఎ. చదువుతోంది అపుడు. కాంతారావు డిగ్రీ పూర్తి చేసి, ఖాళీగా వున్నాడు.

మెల్లగా మొదలైన తమ పరిచయం ప్రేమగా మారి, పెళ్ళికి దారితీసింది.

మెళ్ళో పూలమాలలతో స్నేహితులు తోడు రాగా ఆశీర్వదించమని వచ్చిన నవదంపతుల్ని ఆశీర్వదించకపోగా అవమానించి పంపేడు తన తండ్రి. ఆ పరిస్థితుల్లో తన తల్లే వుండివుంటే అనునయించేదిగదా అని తన చిన్న తనంలోనే పోయిన తల్లిని తల్చుకుని దుఃఖించింది.

కాంతారావు తోడులో తన స్నేహితులే నీడ అయేరు. త్వరలోనే విజయవాడలో ఒక ప్రయివేట్ ఫరమ్‌లో

గుమాస్తా వుద్యోగం సంపాదించేడు కాంతారావు. విజయ వాడలో కాపురం పెట్టేరు.

కొంతకాలం ఒడిదుడుకులు లేకుండా వుల్లాసంగానే సాగింది సంసారం. తర్వాత కాంతారావు ధోరణి మారు తున్నట్టు తెలుసుకుంది.

నాలుగురోజుల్నుండి మరీ అసహ్యాకరమైన ధోరణిలో దిగేడు కాంతారావు. వాళ్ళ ఆఫీసరు ఆశ చూపేడట. తనకు కావలసింది చేస్తే ప్రమోషను యిప్పిస్తానన్నాడట. లేన ట్లైతే కక్ష సాధించుకుంటాడట.

ఇదేమి కోరిక? అతనికి తను కావాలట. ఈ విషమ పరిస్థితిలో తనేం చేయాలి? ఇటువంటివాళ్ళకి బుద్ధి వచ్చే విధంగా తను ప్రవర్తించాలి. అందుకు తన జీవితాన్నే పణంగా పెట్టాలి!

చాకు టేబులుపైన వుంచింది. వీధి తలుపులు దగ్గరకు మూసిపెట్టింది.

ఒకసారి గదంతా పరిశీలించి, వస్తువులన్నీ చిందర వందర చేసింది. మంచంపైన దిండ్లు, దుప్పటి అస్త వ్యస్తంగా చేసింది. గాజులు పగలగొట్టి మంచంపైన గదంతా చల్లింది. నుదుటి కుంకుమ చెరుపుకుంది. జడ విప్పి జుట్టు విరబోసింది. అద్దంలో ఒకసారి చూసుకుని తృప్తిగా నిట్టూర్చింది.

ఆత్మరక్షణకి హత్య చేయవలసి వచ్చిందంటే చట్టమే తనకు రక్షణ కల్పించవచ్చు. కనీసం శిక్ష తగ్గించవచ్చు.

చాకు అందుకుంది. ముందు లోపలికి బహుశా కాంతా రావే రావచ్చు. ఎవరొచ్చినా చావడం ఖాయం.

ఇపుడు కాంతారావుపైన ఎంతో అసహ్యాన్ని పెంచు

కుంది జమున. అతని వుద్దేశ్యాన్ని మార్చాలని ఈ నాలుగు రోజులుగా ఆమె చేసే ప్రయత్నాలన్నీ వృధా అయేయి. తమ సాంసారిక జీవితం ఛిన్నాభిన్నమైందని ఆమె గ్రహించింది.

అందువల్లే ఈ నిర్ణయాన్ని తీసుకోడానికి ఆమె ఆలస్యం చేయలేదు. గుండెను దిటవుపరచుకొని వచ్చే వాళ్ళకోసం ఎదురుచూస్తూ రాయిలా నిల్చుంది.

టేబుల్ గడియారంలో ముల్లులు రెండూ పది మీదున్నాయి.

2

జమున్ని హెచ్చరించి తిన్నగా ఆఫీసుకి వెళ్ళేడు కాంతారావు. అనుకున్న ప్రకారం వాళ్ళ ఆఫీసరు 'శ్రీధర్' తన గదిలో కూర్చుని వున్నాడు.

కాంతారావుగదిలో అడుగుపెట్టగానే రివాల్వింగ్‌చైర్‌లో విలాసంగా వూగుతూ, తల ఎగరేసి చిరునవ్వు నవ్వేడు. దాని అర్థం కాంతారావుకు తెలుసు. బదులుగా కాంతారావు కూడా పెదవులపైకి నవ్వు తెచ్చుకున్నాడు.

శ్రీధర్ ఎదురుగా అత్యాధునికమైన పెద్ద టేబుల్ వుంది. దానిమీద ఓల్డ్ టావరిన్ హాఫ్ బాటిల్ సగం ఖాళీగా వుంది. ప్రక్కనే అందమైన గాజుగ్లాసు సగం వరకూ విస్కీతో నిండివుంది.

అతని పెదవులమధ్య కింగ్‌సైజు సిగరెట్ ఎర్రగా వెలుగుతూ పొగలు చిమ్ముతోంది. కాంతారావును కూర్చోమని చేత్తో సైగ చేసేడు.

ఎదురుగా వున్న గెస్ట్ చైర్‌లో కూర్చున్నాడు కాంతారావు.

"హెల్ప్ యువర్ సెల్ఫ్" ప్రక్కనేవున్న మరో ఖాళీగ్లాసు చూపించి అన్నాడు శ్రీధర్.

"థాంక్స్. ఐ ఓంట్ టేక్." అని వూరుకున్నాడు కాంతారావు.

"దెన్ వుయ్‌కెన్‌గో" అని గ్లాసెత్తి అందులోవున్న మిగిలిన సగాన్ని గటగటా త్రాగేసి లేచి నిల్చున్నాడు. ఇద్దరూ బయటకు నడిచారు. ఆఫీసుకు తాళంవేసి, కీ జేబులో వుంచుకున్నాడు కాంతారావు.

కాంతారావు వున్న యిల్లు ఆ వీధిలో ఒంటరిగా వున్నట్టు వుంటుంది. ఇంటికి వెళ్ళగానే నెమ్మదిగా తలుపు తట్టేడు కాంతారావు. లోపల గడియవేసి లేదని గ్రహించి నెమ్మదిగా తోసేడు. శ్రీధర్‌ని లోపలకు వెళ్ళమని సైగ చేసేడు.

శ్రీధర్ లోపలకు వెళ్ళి, తలుపులు మూసి గడియ వేయగానే వరండాలో వున్న స్విచ్ నొక్కేడు. తరువాత బయలుదేరి మళ్ళీ ఆఫీసుకు వెళ్ళేడు.

ఆఫీసు తలుపులు లోపలనుండి మూసి లైటు వేసేడు. శ్రీధర్ కూర్చునే కుర్చీలో కూర్చున్నాడు. రిస్టువాచిలో టైము చూసేడు పది దాటింది.

తన పథకాన్ని ఒకసారి సమీక్షించుకున్నాడు.

"పూర్‌ఫెలో శ్రీధర్! తన ట్రాప్‌లో పడ్డాడు. ఇక పైన వాడి జుట్టు తన చేతిలో వుంటుంది. ఆఫీసరైనంత మాత్రాన అంత పొగరా!"

'జమున శ్రీధర్‌ని చూసి ఆశ్చర్యపోతుందేమో!' జమున్ని తలుచుకోగానే కాంతారావు మనసు కోపంతో దహించుకుపోయింది.

'నయవంచకి. శ్రీధర్‌తో పెళ్ళికి ముందే సంబంధం వున్నదన్న విషయం తనకు తెలియక మోసపోయాడు.'

ఆ విషయం శ్రీధర్‌వల్లే తెలిసింది. ఒకరోజు కాకతాళీయంగా సినిమాహాలు దగ్గర కలిశారు. సినిమాకు జమున్ని కూడా తీసుకువచ్చేడు కాంతారావు. ఆమె ఆడవాళ్ళ గేటుదగ్గర నిల్చుని వుంది. శ్రీధర్‌ని చూడలేదామె.

కాంతారావు చూపించేడు శ్రీధర్‌కి ఆమె తన భార్యే నని. శ్రీధర్ కళ్ళలో ఆశ్చర్యాన్ని గమనించేడు కాంతారావు.

"జమున నీ భార్యా?" అన్నాడు శ్రీధర్.

ఈసారి ఆశ్చర్యపోవడం కాంతారావు వంతయింది.

"జమున మీకు తెలుసా?" అప్రయత్నంగా అన్నాడు.

"తర్వాత మాట్లాడుకుందాంలే" అని ప్రసంగాన్ని తుంచేసి హాలులోపలికి వెళ్ళిపోయేడు శ్రీధర్.

అతను ఫస్టుక్లాసుకు వెళ్ళేడు. జమున, కాంతారావు సెకండ్‌క్లాసుకు వెళ్ళేరు. అందువల్ల శ్రీధర్ వాళ్ళకు హాలులోపల కన్పించలేదు.

సినిమా చూస్తున్నాడన్న మాటేగాని, మనసక్కడలేదు కాంతారావుకు. అయినా జమునతో శ్రీధర్ ప్రసక్తి తేలేదు.

శ్రీధర్ కేరక్టర్ మంచిదికాదని తెలుసు కాంతారావుకు. అతనికి లేని అలవాటు లేదు. ఆడవాళ్ళ పిచ్చి మరీ యెక్కువ.

శ్రీధర్‌కి జమున ఎట్లా తెలుసో, వాళ్ళిద్దరిమధ్యవున్న సంబంధం ఎటువంటిదో అంతుచిక్కలేదు కాంతారావుకు.

ఆఫీసులో శ్రీధర్‌కు, కాంతారావుకూ మధ్య అంతగా

మంచి అవగాహన లేదు. అత నెపుడూ కాంతారావును పని విషయంలో సతాయిస్తూ వుండేవాడు. దాన్ని భరించ లేకపోయేవాడు కాంతారావు.

అతని 'టీజింగ్' నుండి తప్పించుకోవాలంటే ఏం చేయాలా అని ఆలోచిస్తూ వుండేవాడు. అటువంటి పరిస్థితిలో యీ సంఘటన.

సినిమా హాలుదగ్గర యీ సంఘటన జరిగిన మర్నాడు ఆఫీసులో కాంతారావును తన రూములోనికి పిలిపించేడు శ్రీధర్.

కూర్చోమని సీటు ఆఫర్ చేసేడు.

'జమున నాకెట్లా తెలుసో తెలుసుకోవాలని వుందికదు!' శ్రీధర్ సంభాషణ ప్రారంభించేడు.

కాంతారావు మౌనంగా కూర్చున్నాడు.

'అది సహజంలే. తెలుసుకోవాలని ఎవరికయినా వుంటుంది' ఆగి సిగరెట్ వెలిగించేడు.

"ఎవరికయినా తనభార్య పరాయివాడికి తనకు తెలియకుండా తెలుసునని తెలిస్తే, అతని మనసు కత్తితో కోస్తున్నట్టుంటుంది. ఔనా?" పొగపీల్చి వదుల్తూ అన్నాడు శ్రీధర్.

అతని ధోరణిలోవున్న కవ్వింపు గ్రహించేడు కాంతారావు.

అయినా ముఖంలో ఏవిధమైన భావం కనిపించలేదు.

"నాభార్యమీద నాకెంతో నమ్మకంవుంది. మాది లవ్ మారేజ్" స్థిరంగా, దృఢంగా అన్నాడు కాంతారావు.

"ఊఁ...."అని చిన్నగా తల పంకించేడు శ్రీధర్.అతని పెదవులపైన చిరునవ్వు వుంది. ఆ నవ్వులో వున్న

వ్యంగ్యాన్ని వూహించుకున్నాడు.

శ్రీధర్ టేబుల్ సొరుగులాగి డైరీ ఒకటి పైకితీశాడు అది పాతడైరీ. ఆడైరీ కవర్లోంచి కార్డుసైజు ఫోటో ఒకటితీసి కాంతారావు ఎదురుగా టేబుల్‌పైన వుంచేడు.

ఫోటోలో ఆమెను చూడగానే కాంతారావు కళ్ళు వెడల్పయినాయి, ఆమె కొంటెగా నవ్వుతోంది. ఆ నవ్వుకు బుగ్గలు సొట్టలుపడి ఆమె అందానికి ఆకర్షణ పెరిగింది. ముందుకు వేసుకున్న వాల్జడలో ఒంటిగులాబి ఆమె కొంటెనవ్వుకు బదులు పలుకుతోంది. అది జమున బస్ట్ ఫోటో.

ఫోటోను చేతిలోకి తీసుకోబోయేడు కాంతారావు. అంతలో శ్రీధర్‌దాన్ని వెనక్కితిప్పి పెట్టేడు.

"విత్ స్వీట్ కిసెస్"—జమున.

ఫోటో వెనకవైపు వ్రాసివున్న అక్షరాలు స్పష్టంగా అందంగా వున్నాయి. అది జమున చేతివ్రాతే. సందేహం లేదు.

కాంతారావు ముఖం నల్లబడి పోయింది. అతని హృదయం నిజంగానే కత్తితో కోస్తున్నట్టువుంది. అక్కడికక్కడే శ్రీధర్ని పీకనులిమి చంపుదామా అన్నంత కసి వచ్చింది. అవమానంతో అతని గుండె దహించుకుపోయింది.

అయినా కాంతారావు తొందరపడలేదు. నిదానంగా వుండడానికి ఎంతో కష్టపడ్డాడు. మనసును అదుపులోనికి తెచ్చుకున్నాడు.

శ్రీధర్ ఫోటోనుతీసి మళ్ళీ డైరీలో జాగ్రత్తచేశాడు. అతను కాంతారావును పరిశీలిస్తూనే వున్నాడు.

"ఇప్పుడేమంటావ్?" శ్రీధర్ అడిగేడు హేళనగా.

"ఏమీ అనే పరిస్థితిలో లేనునేను." అనిలేచి బయటకు వచ్చేసేడు కాంతారావు.

తరువాత కాంతారావు చాల ముభావంగా వుండేవాడు జమునతో. కాని అసలు విషయం చెప్పలేదామెకు. ఎప్పుడూ అశాంతిగా ఆలోచిస్తూ వుండేవాడు. శ్రీధర్ని, జమున్నీ మానసికంగా హింసించాలని నిర్ణయానికొచ్చాడు.

పథకం ఆలోచించి హనుమంతు సహాయాన్నికోరేడు.

హనుమంతు కాంతారావు స్నేహితుడు. అతను ఒక ఫోటో స్టూడియోను నడుపుతున్నాడు. అతనివద్ద జర్మను నుండి తెప్పించిన కెమేరా ఒకటివుంది. అది ఆటో మేటిక్‌గా ఎలక్ట్రిసిటీతో పనిచేస్తుంది.

అయిదురోజుల క్రితం పక్కింటి వాళ్ళతో జమునని సినిమాకుపంపి హనుమంతును యింటికి తీసుకువచ్చాడు కాంతారావు.

పడకగది పైభాగంలో తడికతో అల్లిన అటకవుంది. కెమేరాను అటక పైభాగంలో బయటకు కన్పించకుండా అమర్చేడు హనుమంతు. లెన్సుమాత్రం బయటకు వుండి దాని 'వ్యూ' సుమారు గదిలో చాలాభాగం కవర్‌చేసే విధంగా అరేంజ్ చేసేడు.

లెన్స్ బయటకువున్నా, అది కెమెరా లెన్సని అక్కడ కెమెరా వున్నదన్న సంగతి ఎవరికీ తెలియదు.

వరండాలో లైట్లు వెలిగించడానికి ఒక స్విచ్‌వుంది. వరండాలోని లైటుతో దాని కనెక్షన్ తీసేసి, గదిలోపలి లైటుతో ఆ స్విచ్‌ని కనెక్టుచేశాడు. అందువల్ల గదిలోని లైటు రెండు స్విచ్‌లతోను వెలుగుతుంది.

వరండాలో స్విచ్ నొక్కగానే గదిలో లైటువెలిగి, కెమెరా పనిచేయడం ప్రారంభించే విధంగా కనక్షన్స్ ఏర్పాటు చేసేడు హనుమంతు.

ఈ ఏర్పాటు చేసినట్లు జమునకు అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు కాంతారావు.

3

శ్రీధర్ కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న కాంతారావు ఏదో గుర్తుకు వచ్చినట్టు, ఎదురుగావున్న టేబుల్ సొరుగు లాగేడు.

లాక్ చేసి లేకపోవడంవల్ల అది బయటకు వచ్చింది. అందులో జమునఫోటో దాచిన డైరీవుంది. ఫోటోతీసి జేబులో వుంచుకున్నాడు కాంతారావు.

రిస్ట్‌వాచిలో టైము చూసేడు. పదిగంటల నలభై ఐదు నిమిషాలయింది. లేచి ఇంటికి బయలుదేరేడు.

ఈపాటికి కెమెరా తనపని పూర్తిచేసే వుంటుంది. అయిదు నిమిషాలకొకటి చొప్పున అరగంటసేపు ఆటోమేటిక్‌గా ఫోటోలు తీస్తుందది. ఆ ఫోటోలతో శ్రీధర్ భరతం పట్టించవచ్చు. తనకక్ష తీర్చుకోవచ్చు.

ఇంటి వరకూ వెళ్ళిన కాంతారావుకు ఏదో అసహజంగా అన్పించింది.

యాంత్రికంగా తలుపు తట్టేడు. తలుపుతీసి నిశ్చలంగా నిలబడివుంది జమున. గదిలో లైటు వెలుగుతూనేవుంది.

గదిలోపలకు అడుగు పెట్టేడు. అక్కడి దృశ్యంచూసి కొయ్యబారి పోయాడు.

శ్రీధర్ అచేతనంగా నేలమీద పడివున్నాడు. చాకు అతని ఛాతీలో పిడివరకూ దిగబడివుంది. రక్తంతో షర్టు

అంతా తడిపివుంది. ఛాతీనుండి కారిన రక్తం గచ్చునేల మీద మడుగులావుంది.

జమునవైపు వెర్రివాడిలా చూసేడు కాంతారావు.

"నువ్వ్ శ్రీధర్‌ని చంపేసేవా?" నమ్మలేనట్టు అడిగేడు.

ముఖాన్ని చేతుల్లో దాచుకుని రోదిస్తోంది జమున.

"చెప్పు, నువ్వీ హత్యచేసేవా?" రెట్టించి అడిగేడు కాంతారావు.

అవును. నేనే ఈహత్య చేసాను. అతన్ని నేనే చంపేసాను," దుఃఖాన్ని దిగమ్రింగి, నిశ్చయంగా చెప్పింది జమున.

"నువ్వింతకు తెగించగలవని వూహించలేక పోయాను ఎందుకు చేశావీపని. శ్రీధర్ నీపాత ప్రియుడేగా?"

ఆశ్చర్యంతో కాంతారావును చూపింది జమున. ఆమె కళ్ళలో ఏదో అనుమానం తొంగిచూపింది.

"ఏమిటి మీర నేది?"

"నీకర్థంగాని భాషలో చెప్పలేదే! ఏమీ తెలియనట్లుగా ఎందుకా నాటకం. శ్రీధర్‌తో నీకింతకుముందు సంబంధం లేదా?"

వినలేనట్టు చెవులుమూసుకుంది జమున. తనున్న అపాయకరమైన పరిస్థితినికూడా మర్చిపోయింది.

ఇదన్నమాట అసలు విషయం. తనపైన అనుమానంతోనే యీమనిషి యిటువంటిపనికి పాల్పడ్డాడు. అసలు తనపైన అనుమానం కలగడానికిగల కారణం ఏమిటో?

"మీరామాటలు ఏ ఆధారంతో అంటున్నారు?"

జేబులోని ఫోటోతీసి జమున చేతికిచ్చాడు కాంతారావు.

"ఇది శ్రీధర్ దగ్గర ఎందుకుంది?"

ఆశ్చర్యంగా ఫొటోను చూసింది జమున. జరిగిన విషయం హఠాత్తుగా గుర్తుకు వచ్చిందామెకు.

"మన పెళ్ళికిముందు ఒకనాడు నా ఫోటో అడిగారు గుర్తుందా?"

గుర్తుచేసుకుంటూ తల వూగించేడు కాంతారావు.

"మర్నాడు మీకివ్వాలని ఈఫోటో పుస్తకంలో పెట్టుకుని కాలేజికి వెళ్ళేను. సాయంత్రం తిరిగి యింటికి వెళ్ళేటప్పుడు మీరు కన్పించేరు. మీకు ఫోటో యిస్తామని పుస్తకంలో చూస్తే కన్పించలేదు. ఆ విషయం మీకు చెప్పేనుకూడా!"

ఆరోజుల్లో జమున్ని కలుసుకోడానికి కాలేజి దగ్గరకు వస్తుండేవాడు కాంతారావు.

"అయితే శ్రీధర్ దగ్గరికిది ఎలా వెళ్ళింది?"

"శ్రీధర్ చెల్లెలు ప్రభ నా క్లాస్‌మేట్. నన్ను ఆట పట్టించడానికి తీసేనని తర్వాత చెప్పింది. కాని ఫోటో తన దగ్గర మిస్సయిందనీ, కన్పించడం లేదని చెప్పింది."

కాంతారావు అనుమానం తీరిపోయింది. తను యెంత మూర్ఖంగా ప్రవర్తించాడో అర్థమైంది. కాని పరిస్థితి చేయి దాటిపోయింది.

జమున్ని ఈ పరిస్థితినుండి యెలా రక్షించుకోవాలో అర్థంగాక అయోమయంలో పడిపోయాడు కాంతారావు.

శవంగా మారిన శ్రీధర్‌ను ఒకసారి పిచ్చివాడిలాచూపి జమునకు దగ్గరగా నడిచేడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. మృదువుగా ఆమెను తనవైపు హత్తుకుని "నన్ను క్షమించు జమునా! నా అవివేకంవల్ల, చాలా

అనర్థం జరిగిపోయింది యిప్పుడెలా? ఏంచేద్దాం?" అని గొణుగుతున్నట్టుగా అన్నాడు.

అతని నోటినుండి సరిగా మాటకూడా రావడంలేదు.

ఈ సంఘటనకుబాగా షాక్ తిన్నాడు.

"చేసేదేంవుంది! పోలీసులకు రిపోర్టు చేయడమే!" దృఢంగా అంది జమున.

"నో! అలా వీల్లేదు. నువ్వు హంతకురాలిగా శిక్షింపబడితే నేను భరించలేను.

ఒకపని చేద్దాం. ఈ విషయం పోలీసులకు తెలియనీయవద్దు. శవాన్ని ఎవరికీ అంతుచిక్కని విధంగా మాయం చేద్దాం! నువ్వేమీ జరగనట్టు మామూలుగానేవుండు. ఏమంటావ్?"

"వద్దు! అనవసరంగా మీరుకూడా యీనేరంలో ఇరుక్కుంటారు. వెంటనే పోలీసుల్ని పిలవండి. నన్ను జైలుకు పంపండి."

"నామాట విను జమునా! నేను చెప్పినట్టు చేస్తే తప్పించుకోడానికి అవకాశంవుంది."

"నేను వప్పుకోను. జరిగిందేదో జరిగిపోయింది. యిందులో మీరుకూడా ఎందుకు యిరుక్కుంటారు. మీరు పోలీసుల్ని పిలవకపోతే నేనేవెళ్ళి తెలియజేస్తాను" అంటూ వాకిలివైపు అడుగులు వేసింది జమున.

ఏమీ చేయలేని అసహాయస్థితిలో నిశ్చేష్టుడై నిలబడిపోయాడు కాంతారావు

4

ఇన్‌స్పెక్టర్ 'శివాజీ' తన ఆఫీసు రూంలో కూర్చునివున్నాడు.

అతని ఎదురుగా వున్న కుర్చీలో జమున తండ్రి రంగా రావు వున్నాడు.

"మీరన్నది నిజమా?" కుతూహలంగా ప్రశ్నించేడు శివాజీ.

రంగారావు ముఖం చాలా సీరియస్‌గా వుంది.

"నేనన్నది నూరుపాళ్లు నిజం. ఈ హత్య జమున చేయలేదు. కావాలని నేరం తనపైన వేసుకుంటోంది."

"హత్య నేనే చేసేనని ఒప్పుకున్నదామె. సాక్ష్యంగూడా బలంగావుంది. మీ అమ్మాయిని కాపాడుకోవాలని మీరు కట్టుకథ చెప్తున్నారేమో!"

"లేదు యిన్‌స్పెక్టర్‌గారూ! నేను అబద్ధం చెప్పడం లేదు. నా కూతురుకు నేనే ఒకసారి అన్యాయం చేసేను. ఆమెను అవమానపరచి, ఇంటినుండి వెళ్ళగొట్టేను. ఇపుడు మళ్ళీ అన్యాయం చేయలేను. తను చేయని నేరాన్ని తనపైన వేసుకుంటోంది."

అదేసమయంలో కాంతారావు వచ్చేడు ఆ గదిలోనికి. తన మామగార్ని అక్కడచూపి చకితుడయ్యేడు.

కాంతారావు భుజాన కెమేరా ఒకటి వ్రేలాడుతోంది. ఒక చేతిలో న్యూస్ పేపర్ చుట్టిన పేకెట్ వుంది.

శివాజీకి విష్‌చేసి పేకెట్టూ, కెమెరా అతనికి అందించేడు.

పేకెట్ విప్పి చూసేడు శివాజీ. అతని కనుబొమలు పైకి లేచాయి.

"హౌ యీజిట్ పాజిబుల్?" ఆశ్చర్యంతో ప్రశ్నించేడు శివాజీ.

కెమెరాతో తను చేసిన ఎరేంజ్ మెంటూ, అట్లా చేయ డానికి గల కారణం చెప్పేడు కాంతారావు.

ఇన్ స్పెక్టర్ శివాజీ విప్పి చూపిన పేకెట్టులో కొన్ని ఫొటోలున్నాయి. వాటిని రంగారావుకు చూపేడు శివాజీ.

స్తబ్దుడుగా చూసేడు రంగారావు.

అవన్నీ ఒకే దృశ్యానికి సంబంధించినవి. రంగారావు చాకుతో శ్రీధర్ గుండెల్లో పొడుస్తున్న దృశ్యం అది....

... రంగారావు చెప్పడం మొదలుపెట్టేడు। శివాజీ సైగతో 'రైటర్' స్టేట్ మెంట్ రికార్డు చేయసాగేడు.

"జమున యిల్లు వదిలి వెళ్ళిన తరువాత నాకు పిచ్చెత్తి నట్టు వుండేది. ఒక్కగా నొక్క కూతురు. ఆమె కోర్కెను నాకు నేనై తీర్చలేకపోయాను.

"కాంతారావుకు విజయవాడలో ఉద్యోగం వచ్చిందని తెలిపింది. జమున్ని చూడడానికి వెళ్ళాలని నా మనసెంతో పీకేది. అయినా నా మూర్ఖత్వం నన్ను ఆపేది.

"కాంతారావు నా అంతస్థుకు తగడన్న చులకన భావం, జమున నా మాటను వినలేదన్న కోపం నన్ను నా కూతు రుకు దూరం చేసేయి.

"చాలకాలం తర్వాత మమతను చంపుకోలేక, మన సును సమాధాన పరచుకుని, నా కన్నకూతుర్ని చూసుకో డానికి బయలుదేరేను. అతికష్టంమీద యిల్లు కనుక్కో గలిగేను. అప్పటికి రాత్రి పది దాటింది.

"ఇంటిని సమీపించేసరికి లోపల గలభా జరుగు తున్నట్టు శబ్దం విన్పించింది. లోపలి లైటు వెలుగు కిటికీ లోంచి బయటకు వస్తోంది. కిటికీ దగ్గరకువెళ్ళి తొంగి చూసేను.

"ఊహించని దృశ్యం కంట పడింది. పశుబలంతో ఒక వ్యక్తి జమున్ని బలాత్కరిస్తున్నాడు. నాలో కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది. కిటికీ దగ్గర్నుండి ఒక్క అరుపు అరిచేను. వెంటనే అతని పట్టు సడలింది. ఒక్క ఉదుటున వచ్చి తలుపుతీపింది జమున.

"వెంటనే లోపలకు పరుగెత్తేను. నేను సమయానికి రాబట్టి సరిపోయింది. లేకపోతే....ఆ తలంపుతో నాలో ఉద్రేకం పెరిగిపోయి. నేనేం చేస్తున్నానో నాకే తెలియని మైకంలో....గదిలో ఒక మూలగా కన్పించిన చాకు చేతిలోకి తీసుకుని అతనిపైన కలియబడ్డాను.

"అతను నిషామీదున్నాడు. పారిపోదామని ప్రయత్నించేడు, కాని బలంగా గుండెల్లో చాకు దిగబడడంతో క్రిందకు ఒరిగిపోయేడు."

"వెంటనే నా ఉద్రేకం దిగిపోయింది. జరిగిన విషయం గ్రహింపుకు రాగానే నాలో కంగారు పెరిగిపోయింది. ఆ సమయంలో జమున, తేరుకుని, నన్ను పారిపొమ్మని తొందర చేసింది. ఆమె ఆ పరిస్థితికి నిలద్రొక్కుకుని చాల ధైర్యంగా వుంది. నేనేమీ ఆలోచించే పరిస్థితిలో లేను. జమున ప్రేరణతో వెంటవే అక్కడ్నించి వెళ్ళిపోయేను.

"కాని, హత్యా నేరాన్ని తనమీద వేసుకుందని తెలిసిన మరుక్షణం నా అవివేకానికి నన్ను నేను నిందించుకున్నాను. వెంటనే మీదగ్గరకు పరుగెత్తుకు వచ్చాను" ఆవేదనగా చెప్పాడు రంగారావు. □□□

ముష్టివాడి ఉలెన్‌కోటు!

లలిత కుమారి

"ఎస్! పీతాంబరం స్పీకింగ్."

"నేనండీ. సేఠ్ చందన్‌లాల్‌ను. ప్రసాదరావుగారు వున్నారా ఇంట్లో?"

"ఇప్పుడే వచ్చారు. వాహినీ స్టూడియోలో ఓషూటింగ్ కార్యక్రమం ముగించుకుని."

"ప్రస్తుతం వేరే ఎంగేజ్‌మెంట్సేవీ లేవు గదా ఆయనకు?"

"లేవుగానీ, మీరెందుకు ఫోన్ జేస్తున్నారో చెప్పనే లేదు."

"అదే చెప్పబోతున్నానండీ. వుదయం ప్రసాదరావు గారు నా షాప్‌కు ఫోన్‌జేసి, మేలురకం వజ్రాలేవైనా వుంటే సాయంత్రం ఇంటికి తెచ్చి చూపమన్నారు. ఈ మధ్యే మాదగ్గిర కొత్తరకం వజ్రాలు వచ్చాయి.

మేము ఒకరిళ్ళకు వజ్రాలు తీసికెళ్ళి చూపం! కావలసిన వారు తిన్నగా షాప్‌కేవచ్చి కొనుక్కెళ్ళాలి. కాని, ప్రసాదరావుగారి విషయం వేరుకదా? ఆయన పేరుమోసిన ఫిలిమ్ హీరో! ఇంట్లోంచి కాలు బైట పెట్టారంటే కంది రీగల్లా చుట్టుముట్టేస్తారు జనం. పైగా. మా షాప్ మంచి ట్రాఫిక్ సెంటర్లో వుందాయె.

అందుకే, వజ్రాలు ఆయనకు ఇంట్లోనే చూపే రిస్కు తీసుకుంటున్నాను. వారింట్లోనే వున్నారన్నారుగా. పావు గంటలో వచ్చేస్తాను" అన్నాడు సేఠ్ చందన్‌లాల్ అవతలినించి.

"ఆల్‌రైట్! తప్పకుండా రండి. నేనీలోపల మీరు వస్తున్నట్టు ఆయనకు చెబుతాను."

"అలాగే!" అవతల క్లిక్‌మంది.

రిసీవర్ రెస్టుమీదుంచి లేస్తూ, రిస్టువాచీ చూసుకున్నాడు పీతాంబరం.

సాయంత్రం ఆరుగంటలు.

తన ఆఫీసు గదిలోంచి బైటపడి, మేడ మెట్లెక్కి పైనవున్న ప్రసాదరావు గదివైపు నడిచాడు.

* * *

"బాబూ! రెండ్రోజుల్నించి పస్తున్నా. పైసా ధర్మం జెయ్యండి నాయనా!" అరుస్తున్నాడు వృద్ధుడు వీధి పక్క లైటు స్తంభంకింద కూర్చుని.

చేతిలో సొట్టలుపడి, అతనిలాగే శిథిలావస్థలో వున్న జర్మన్ సిల్వర్ గిన్నె. దారినపోయే ప్రతివాడివైపూ చూస్తున్నాడు దాన్ని. తోచినవాళ్ళు ఆగి, పైసో రెండు పైసలో విసురుతున్నారు గిన్నెలో.

వేసేవారికన్నా వెయ్యకుండా దాటిపోయేవారే ఎక్కువ!
సాయంత్రం ఆరు గంటలవుతోంది.
పరిసరాలవింకా చీకట్లు చుట్టు ముట్టలేదు.
వీధి కిరుపక్కలా ఎత్తైన మేడలు. ఆ మేడలముందు అందంగా పెంచిన పూదోటలు. ఆ వీధిలో నివసించే ప్రాణులు సామాన్యులుకారు. ఇటు కీర్తిలక్ష్మికీ, అటు ధనలక్ష్మికీ అత్యంత ప్రియబాంధవులు. అక్కడ బడుగు జీవులకి చోటులేదు.

"దయచూపండి బాబూ! ముసలోడికి పైసా ధర్మం చెయ్యండి నాయనా!" నీరసంగా అరుస్తున్నాడు వృద్ధుడు.

బక్కపల్చని ఒళ్లు, మొహంమీద కాలచక్రం గీసిన ముడతలు, పీక్కుపోయిన కళ్లు. అస్తవ్యస్తంగా పెరిగిన గెడ్డం, పీచు తల, ఏ పుణ్యాత్ముడో దానం చేసింది కాబోలు, అక్కడక్కడా అతుకులుపడ్డ ఉలెను కోటు ధరించేడు. మాసి క్షీణదశలో ఉన్న గూడకట్టు పంచ.

టూకీగా ఇదీ అతని అవతారం!

"ఒకప్పుడు బాగా బతికినోణ్ణి బాబూ! కాలం కాటేసింది. దిక్కులేనోణ్ణైపోయాను. ఇక మీరే దిక్కు నాయనా! పైసా ధర్మం జెయ్యండి!" దయనీయంగా విని పిస్తోంది అతని కంఠం ఆ నిశ్శబ్దమైన వీధిలో.

3

గది ముందాగి, "మే ఐ కమిన్ సర్!" అన్నాడు పీతాంబరం.

"ఎస్!"

పీతాంబరం లోన అడుగుపెట్టాడు.

ప్రసాదరావు సోఫాలో కూర్చుని బీర్ తాగుతున్నాడు.

తెలుగుచిత్ర పరిశ్రమలో అతను మకుటంలేని మహారాజు. బిజీస్టార్. బాక్సాఫీస్ హిట్ హీరో!

"సేఠ్ చందన్‌లాల్ ఫోన్ చేశాడండి. ఉదయం మీరు ఏవో వజ్రాలుతెచ్చి చూపమన్నారుట!" అన్నాడు అతని సెక్రెటరీ పీతాంబరం వినయంగా.

ప్రసాదరావు ఆలోచించి—"ఓహో! చందన్‌లాలా? ఘానాను. ఉదయం స్టూడియోనుంచి ఫోన్‌చేసి చెప్పాను. వజ్రాలు తీసుకొస్తానన్నాడా?" అడిగాడు.

"ఔనండి!"

"వెరీగుడ్!" కంఠం తగ్గించాడు ప్రసాదరావు."మిస్టర్ పీతాంబరం! ఇన్‌కమ్ టాక్సువారి కళ్ళుగప్పి మనం దాచిన బ్లాక్‌మనీ. విపరీతంగా పేరుకు పోతూంది ఇంట్లో. దాన్ని 'సత్కార్యాలకు' వినియోగిస్తూ సాధ్యమైనంత త్వరగా వదిలించుకోవాలి.

లేకుంటే, అది ఇంతై వటుడింతై అన్నట్టు పుట్టలూ గుట్టలుగా పెరిగే ప్రమాదముంది. అందుకే సేఠ్ చందన్ లాల్‌ను పిలిపించాను. ఆ బ్లాక్ కరెన్సీతో కొన్నివజ్రాలు కొని, అద్భుతమైన ఓ నెక్లెస్ చేయించాలి."

ప్రసాదరావు ఏదో అనబోతుండగా బట్లర్‌వచ్చి "సేఠ్ చందన్‌లాల్ వేంచేశారండి!" అన్నాడు వినయంగా.

"పంపించు!" అన్నాడు ప్రసాదరావు. బట్లర్ వచ్చిన రెండు నిమిషాలకు, రుబ్బురోల్లా దొర్లుకుంటూ వచ్చాడు సేఠ్ గదిలోకి.

బాగా మేయడంవల్ల అడ్డదిడ్డంగా వచ్చిన వళ్ళు. ముందుకు పొడుచుకువచ్చిన గణపతి బొజ్జ. తలమీద టోపీ. పిల్కాలాల్చి. ధోవతి. ఇది అతని ఆకృతి.

"రండి సేఠ్‌జీ! మీ గురించే మాట్లాడుకుంటున్నాం." అన్నాడు ప్రసాదరావు సాదరంగా ఆహ్వానిస్తూ.

చందన్‌లాల్ గారపళ్ళు బయటపెడుతూవచ్చి సింగిల్ సోఫాలో కూలబడ్డాడు పిండిబస్తాలా, చేతిలోవున్న బ్రీఫ్ కేస్ ఒళ్ళోపెట్టుకుని.

"వజ్రాలు తెచ్చారా?" అడిగాడు ప్రసాదరావు.

"వేరే చెప్పాలా? చూడండి!" అంటూ బ్రీఫ్‌కేస్ తెరిచాడు సేఠ్.

అందరికళ్ళూ రెప్పపాటు జిగేల్ మన్నాయి. రంగు రంగుల కాంతులీనుతున్న రకరకాల సైజు వజ్రాలు!

"వీటిలో మీకు తోచినవి ఎన్నుకోండి!" అన్నాడు చందన్‌లాల్, బ్రీఫ్‌కేస్ టీపాయ్‌మీద పెడుతూ.

ప్రసాదరావు ఒక్కొక్క వజ్రాన్నితీసి పరిశీలిస్తూ, మొత్తం ఇరవయినాలుగు వజ్రాలు ఎన్నుకొని పక్కన పెట్టాడు.

అరగంట పట్టింది అంతా అయ్యేసరికి.

సేఠ్ పళ్ళు వెళ్ళబెట్టి "చాలా?" అడిగాడు.

ప్రసాదరావు తలూపి "ధరకట్టండి! నెట్‌క్యాష్ ఇస్తా" అన్నాడు.

నెట్‌క్యాష్ అనగానే సేఠ్‌కళ్ళు తళతళ మన్నాయి.

జేబులోంచి నోట్‌బుక్‌తీసి, బాల్‌పెన్‌తో ఐదు నిమిషాలు ఏవో లెక్కలుకట్టి. "మొత్తం నాలుగులక్షల తొంభై వేల మూడు వందలు!" అన్నాడు సేఠ్.

"కూర్చోండి, వస్తాను" అంటూ లేచి పక్కగదిలోకి నడిచాడు ప్రసాదరావు.

పదినిమిషాల తరువాత, నోట్లకట్టల దొంతరతో తిరిగి

వచ్చాడు ప్రసాదరావు.

"చూసుకోండి!" అన్నాడు వాటిని టీపాయ్ మీద గుమ్మరిస్తూ.

"మీరు చెప్పాక మళ్ళీ నోట్లు లెక్కపెట్టుకోడం మిమ్మల్ని అవమానించడమౌతుంది రావుగారూ! కానీ. ఈ బిజినెస్ రూల్సంటూ ఒహటున్నాయి చూడండీ...." నసిగాడు సేఠ్ అష్టవంకర్లు తిరుగుతూ.

"ఫరవాలేదు. ఎంచుకోండి" అన్నాడు ప్రసాదరావు నింపాదిగా.

కట్టలు లెక్కించటం పూర్తయ్యాక, "ఔనండి కరెక్ట్‌గా ఉన్నాయి, ఇహ నాకు సెలవిప్పిస్తారా!" అన్నాడు సేఠ్ ఊపిరి తీసుకుంటూ.

"ఆల్‌రైట్! వెళ్ళిరండి". అన్నాడు ప్రసాదరావు.

చందన్‌లాల్ నోట్లన్నీ బ్రీఫ్‌కేస్‌లో సర్దుకుని లేచాడు. మరోసారి వాళ్ళకి వినయంగా నమస్కరించి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో, టీపాయ్‌మీద టెలిఫోన్ గణగణ మోగింది.

"ఎవ్వరో చూడు!" అన్నాడు ప్రసాదరావు, గ్లాసులో సగం మిగిలివున్న బీర్ అందుకుంటూ.

పీతాంబరం రిసీవర్ ఎత్తి "హలో, పీతాంబరాం స్పీకింగ్!" అన్నాడు.

"నేన్సార్, వరదాచారిని!" అవతలినించి వినిపించింది.

ఆ పేరు వినగానే పీతాంబరం కనుబొమలు ముడి వడ్డాయి. "చెప్పండి!" అన్నాడు క్యూరియస్‌గా.

"ప్రసాదరావుగారు వున్నారా ఇంట్లో?"

"ఉన్నారు."

"ఈ రాత్రి ఏడుగంటలకు మా ఇన్‌కమ్ టాక్స్ ఉన్నతాధికార్లు మీ యింటిమీద మెరుపుదాడి చెయ్య బోతున్నారు. ప్రసాదరావుగారి దగ్గర బ్లాక్‌మనీ దండిగా ఉన్నట్లు వారికి ఇన్ఫర్మేషన్ అందిందిట. బీ కేర్‌ఫుల్!"

"గుడ్‌గాడ్! థాక్సండీ వరదాచారిగారూ! అమూల్యమైన ఈ సమాచారాన్ని సమయానికి మాకందించి పుణ్యం కట్టు కున్నారు. మీ మేలు ఎన్నటికీ తీర్చలేనిది. మీ ప్రతిఫలాన్ని రేపీపాటికి పువ్వుల్లో పెట్టి సమర్పిస్తాను."

"థాంక్స్! ఉంటాను మరి!"

"అలాగేనండి! మెనీ థాంక్స్!"

అవతల 'క్లిక్' మంది.

రిసీవర్ క్రెడిల్‌చేసి, ఖంగారుగా ప్రసాదరావుకి విషయం చెప్పాడు పీతాంబరం.

ప్రసాదరావు గుండె గుభిల్లుమంది. "మైగాడ్! ఇప్పు డెలా? ఈ వజ్రాలనెక్కడ దాచేదిప్పుడు? ఆ ఇన్‌కమ్ టాక్స్ అధికార్ల కళ్ళు వీటిమీద పడ్డాయంటే, ఏం జవా బిచ్చేది? వీటి తాలూకు లెక్కలు ఎలా చూపెట్టేది?

రేపు నాదగ్గిర బ్లాక్‌మనీ పట్టుబడ్డట్టు పత్రికల్లో పడితే నా ప్రిస్టేజ్ ఏంగాను? ప్రజల్లో నాపట్ల ఉన్న ఆరాధనా భావం గంగలో కలవదూ?

ఇంట్లో వీటిని దాచే వీలులేదు. ఆ ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్లు ఇల్లంతా అంగుళం వదలకుండా గాలిస్తారు. వారివద్ద డబ్బూ నగలూ, దాగివున్న రహస్యప్రదేశాలని కనుగొనే ఇండికేటర్ మెషీన్స్ కూడా ఉంటాయిట!" అన్నాడు ప్రసాదరావు ఆందోళనగా.

"ఔనండి. ఈమధ్య పత్రికల్లో చదివాను. ప్రముఖ

హిందీతారల ఇళ్ళమీద ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్ళు దాడి జరిపి. బాత్‌రూం గచ్చుకిందా. మంచం కోళ్ళల్లో సైతం దాచిన బ్లాక్‌మనీ వెలికి తీశారట." అన్నాడు పీతాంబరం చేతులు నలుపుకుంటూ.

"ఇంకా మాటలతో కాలయాపన చేస్తావేమయ్యా నీ తెలివంతా ఉపయోగించి ఏదో ఒకటి జెయ్యి మరి! ఇప్పటికే ఐదున్నరయిపోయింది. వ్యవధి చాలా తక్కువుంది. ఈ వజ్రాలవి సురక్షితంగా ఎక్కడ దాచగలమో వెంటనే ఆలోచించు." అన్నాడు ప్రసాదరావు ఆతృతగా.

పీతాంబరం తీవ్రంగా ఆలోచిస్తూ బాల్కనీవైపు నడిచాడు. రెండు నిమిషాల తరవాత చటుక్కున వెనుదిరిగాడు.

4

"ముసలోణ్ణి బాబూ! ధర్మం జెయ్యండి. భగవంతుడు మీ పిల్లా పాపల్ని చల్లగా చూస్తాడు. పైసా పారేసి పుణ్యం కట్టుకోండి నాయనా!" అరుస్తున్నాడు వీధి పక్కన.

అప్పుడే అతని ముందునించి వెళుతున్న ఓ వ్యక్తి చటుక్కున ఆగాడు. కాసేపు వృద్ధుణ్ణి పరీక్షగా చూసి.

"నా అంచనా తప్పు కాకుంటే మీరు గుర్నాధంగారు కదూ?" అడిగాడు సందేహంగా.

వృద్ధుడు తలెత్తి ఆ వ్యక్తిని కళ్ళు చిట్లిస్తూ చూసి—
"ఎవర్నాయనా నువ్వు?" అడిగాడు.

"ముందు నా సందేహం తీర్చండి. మీరు గుర్నాధమేనా?"

"ఔను బాబూ! నా పేరు నీకెలా తెలిసింది నాయనా?

ఎవరు నువ్వు?" వృద్ధుడి కంఠంలో ఆశ్చర్యం.

అతను నవ్వి—"కాస్త పరీక్షగా చూడండి. గుర్తొస్తానేమో!" అన్నాడు.

వృద్ధుడు తల అడ్డం తిప్పి—"లేదు నాయనా! కాలం దేన్ని స్థిరంగా ఉంచుతుందని? వయసుతోబాటు కళ్ళు కూడా మసక బారాయి. గుర్తుపట్టలేకపోతున్నాను" అన్నాడు.

"చాలాకాలం క్రితం మీరు విశాఖపట్నంలో వుండేవారు. గుర్తుందా?"

"నా యవ్వనమూ, మంచి రోజులూ అన్నీ అక్కడే కదా గడిచింది! ఆ పట్నాన్ని ఎలా మర్చిపోగల్ను బాబూ?"

"మీ కొడుకు శివశంకరం స్నేహితుణ్ణి నేను. బాల్యంలో మేమిద్దరం ప్రాణ స్నేహితులం. తరుచూ మీ ఇంటికి వచ్చేవాణ్ని. మా ఇద్దర్నీ అలా తిరుగొద్దనీ, బుద్ధిగా చదువుకోమనీ మీరు మందలిస్తుండేవారు."

"ఎప్పుడో చూసిన నన్ను ఇన్నేళ్ళ తరవాత, ఇంత మారిపోయినా గుర్తించావంటే నీ జ్ఞాపకశక్తిని మెచ్చుకోవలసిందే నాయనా! ఇక్కడే వుంటున్నావా? పెళ్ళయిందా? పిల్లలెందరు? ఇంకా నీ పేరు చెప్పనేలేదు!" ప్రశ్నల వర్షం కురిపించసాగాడు వృద్ధుడు.

"నా పేరు కృష్ణమూర్తండీ! అనుకోకుండా జాతకం మారి ఇక్కడే స్థిరపడ్డాను. లక్షలు గడిస్తున్నాను. నలుగురు పిల్లలు. ఇంతకీ శివశంకరం ఎక్కడున్నాడు? మీరీ స్థితికెలా వచ్చారు?" అడిగాడతను కుతూహలంగా.

వృద్ధుడి మొహం విచారంతో వాడిపోయింది. "ఇంకె

క్కడి శివశంకరం నాయనా. ట్రేన్ ఆక్సిడెంట్‌లో పోయాడు. వాడే గనక బ్రతికుంటే నాకీ గతి పట్టేదా?"

"చాలా విచారకరమైన విషయం చెప్పారు. మిమ్మల్నీ స్థితిలో చూడలేకపోతున్నాను. రండి మా ఇంటికి. కడుపు నిండా తిని ఎన్నాళ్ళయిందో? ఇహ మీకేం ఫరవాలేదు. అదృష్టవశాత్తూ కనిపించారు నాకు.

ఈ చరమ దశలో మిమ్మల్ని ఆదుకుని, నా బాల్య మిత్రుడి ఆత్మకు శాంతి కలిగించడం నా ధర్మం! పదండి!" అన్నాడతను ఆప్యాయంగా.

వాడిపోయిన వృద్ధుడి మొహంలో తిరిగి జీవకళ ప్రజ్వ రిల్లింది. గిన్నె అందుకుని లేవబోయాడు.

"ఆ గిన్నె, జోలీ ఇక్కడే వదిలిరండి. వాటితో మీ ఋణం ఇక తీరిపోయినట్లే. ఈ పక్కనేవుంది మా ఇల్లు!" అన్నాడతను ముందుకు నడుస్తూ.

వృద్ధుడు అతను చెప్పినట్టే వట్టి చేతులతో లేచి, తడ బడే అడుగుల్ని కూడాదీసుకుంటూ నీరసంగా అతన్ని అనుసరించాడు.

ఇద్దరూ కొద్దిదూరం నడిచి ఓ బంగళాలోకి తిరిగారు.

"రండి. ఇదే మా ఇల్లు! మొహమాట పడకండి" అన్నాడతను వృద్ధుడి భుజంమీద చెయ్యివేసి లోనికి తీసి కెళుతూ.

అప్పటికే పరిసరాలన్నీ చీకట్లు చుట్టుముట్టాయి. ఇంట్లో దేదీప్యమానంగా లైట్లు వెలుగుతున్నాయి. డైనింగ్ రూంలో ప్రవేశించా రిద్దరు.

టేబిల్‌మీద రకరకాల వంటకాలు రెడీగా పేర్చి వున్నాయి స్టీలు గిన్నెల్లో. వాటిమీద దృష్టిపడగానే వృద్ధుడి

మోహం హండ్రెడ్ కాండిల్ బల్బులా వెలిగింది.

"కూర్చోండి. ముందు తృప్తిగా భోంచేసి మాట్లాడుకుందాం మిగతా విషయాలు" అన్నాడతను కుర్చీ చూపిస్తూ.

"ఇంట్లో నౌఖర్లు తప్ప నీ భార్యా పిల్లలు కనిపించడం లేదేమిటి నాయనా?" అంటూ కూర్చున్నాడు వృద్ధుడు.

"వాళ్ళా, బీచికెళ్ళారు షికారుకోసం. కాసేపట్లో వచ్చేస్తార్లెండి. చూద్దురుగాని!" అంటూ టేబిల్ మీది బ్రాందీ బాటిల్ అందుకున్నాడతను.

గ్లాసులో సగంవరకూ బ్రాందీపోసి-"ఈ చలికాలంలో వృద్ధులపాలిటి కల్పతరువు ఇది. పుచ్చుకోండి. వెచ్చగా వుంటుంది. ఆకలికూడా ఎక్కువ అవుతుంది" అన్నాడు గ్లాసు ముందుకు తోస్తూ.

వృద్ధుడు వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుని టేబిల్ మీది నాప్కిన్‌తో చేతులు తుడుచుకుని గ్లాసందుకున్నాడు.

అతను వెండి పళ్ళెంలో పదార్థాలు వడ్డించి-"తినండి. మొహమాట పడొద్దు. ఈనాటితో ఇది మీ ఇల్లే అనుకోండి. నన్ను మీ శివశంకరంగానే భావించండి" అంటూ పళ్ళాన్ని వృద్ధుడి ముందుంచాడు.

ఆలోగా వృద్ధుడి చేతిలోని గ్లాసు ఖాళీ అయింది. "భగవంతుడే నీరూపంలో వచ్చి నన్నాదుకున్నాడు నాయనా! ఈ కలికాలంలో నాలాటి దిక్కూ దివాణంలేని వారిపట్ల ఇంత ఆప్యాయత చూపేవాడెవ్వడు?" అంటూ పళ్ళాన్ని ముందుకి లాక్కుని ఆవురావురుమంటూ తినసాగాడు.

నాలుగైదు ముద్దలు తిన్నాడోలేదో, హఠాత్తుగా కను

గుడ్లు తేలవేసి, ఎవ్వరో తోసినట్టు దబ్బున టేబిల్ మీది కొరిగిపోయాడు.

5

"సెభాష్! కథ సవ్యంగా నడిపించావన్నమాట!" అంటూ గదిలో అడుగుపెట్టాడు ప్రసాదరావు.

"ఔను! బికారి వెధవ. అడాగ్గానే గుర్నాథమై కూర్చున్నాడు, తిండికోసం. ఆ బ్రాందీలో మత్తుమందు ఓవర్ డోస్ కలిపివుందని వీడికేం తెలుసు? ఉదయం వరకూ మళ్ళీ వీడికి స్పృహరాదు!" అన్నాడు పీతాంబరం నవ్వుతూ.

"స్పృహ వచ్చాక ఇక్కడికి వచ్చి గొడవజేస్తే?"

"వీడిమొహం! ఈ బికారి వెధవలు తరుచూ ఇలాటి పగటి కలలు కంటూంటారు, విదరలో! స్పృహ వచ్చాక జరిగిందంతా ఏదో బంగారు కలై వుంటుందని మర్చిపోతాడు."

"నిజమే! టైం అవుతోంది. త్వరగా కానివ్ నీ పని" అన్నాడు ప్రసాదరావు.

పీతాంబరం లేచివెళ్ళి, సూదీ, దారమూ, బ్లేడూ పట్టుకొచ్చాడు. కుర్చీలో పడున్న ముసలాడి కోటు విప్పి, బ్లేడుతో కోటు చివరకుట్లు కట్ జేశారు. కోటు లోపలి భాగంలో పిల్కా బట్ట వేసివుంటుంది.

కోటు బట్టనూ, ఆ పిల్కా అస్తర్‌నూ కొద్దిగా విడదీసి—"వజ్రాలు ఇవ్వండి!" అన్నాడు.

జేబులోంచి కాగితంలో చుట్టివున్న వజ్రాలు తీసిచ్చాడు ప్రసాదరావు. ఆ పొట్లాన్ని కట్ జేసిన కోటు బట్టలోకి తోసి సూదీ, దారంతో తిరిగి కుట్టేశాడు పీతాంబరం.

ముసలాడికి తిరిగి కోటు తొడిగించి, ప్రసాదరావువైపు చూశాడు. "ఇహ వీణ్ని వీధిలో ఎక్కడ కూర్చున్నాడో అక్కడే పడుకోబెట్టి వస్తాను.

ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళ సెర్చి పూర్తయ్యాక తిరిగి మన వజ్రాలు మనం తెచ్చుకోవచ్చు. ఆలోగా వీడికి స్పృహ వచ్చే ప్రసక్తిలేదు. నౌఖర్లకు ఈ తతంగం ఎంతమాత్రం తెలియకూడదు. ఏపుట్టలో ఏ పాముందో? నేనే తంటాలు పడతాను" అంటూ బైటికి తీసికెళ్ళాడు పీతాంబరం.

పది నిమిషాల తరవాత తిరిగి వచ్చాడు.

"మొత్తానికి నా పెర్సనల్ సెక్రెటరీ వనిపించుకున్నావోయ్ పీతాంబరం! నీ బుర్రని రీసెర్చికోసం అమెరికా పంపాల్సిందే! ముందు బట్లర్ని పిల్చి ఆ ముష్టివెధవ ఎంగిలిజేసిన ఈ కంచం తీయించు" అన్నాడు ప్రసాదరావు.

అప్పుడు పడింది పీతాంబరం దృష్టి డైనింగ్ టేబిల్ కింద! ఏదో ద్రవం గుమ్మరించినట్టుందక్కడ!!

"ఏమిటిది? ఎలా వచ్చిందిక్కడికి?"

"నేను చెబుతాను. ఇద్దరూ ఇటు తిరగండి!" అన్న కంఠం విని పీతాంబరం, ప్రసాదరావు లిద్దరూ జోడు గుర్రాల్లా వెనుదిరిగి అదిరిపడ్డారు.

తలుపు మధ్య నిల్చున్న ముష్టివాణ్ని చూడగానే ఇద్దరి బుర్రలూ గిర గిర తిరగసాగాయి. ఆ వృద్ధుడి చేతిలో ఇప్పుడు పిస్తోలు కూడా వుంది!

"మిస్టర్! వీధిలో నీవు నా దగ్గరికి వచ్చి కల్లిబొల్లి కబుర్లు ప్రారంభించగానే నాకేదో అనుమానం కలిగింది నీమీద!

నీవు పళ్ళెంలో పదార్థాలు వడ్డిస్తున్నప్పుడు నీవిచ్చిన బ్రాందీని తాగకుండా, టేబిల్ కింద ఒలికేశాను. ఆ ముందు చూపే ఇలా మీ బండారం బద్దలు కొట్టింది.

నేనెవ్వర్నో తెలుసా? పి.బి.ఐ. ఇన్‌స్పెక్టర్ని! ఈ వీధిలో ఓ ఇంటిమీద నిఘా వుంచడానికి, ఇలా మారు వేషంలో ముష్టెత్తుకుంటున్నట్టు నటిస్తున్నాను. కాకతాళీయంగా మీ నాటకంలో ఓ పావునయ్యాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కర్కశంగా.

అదే సమయంలో బైట ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళ జీపు వచ్చి ఆగిన శబ్దం కర్ణకఠోరంగా వినిపించింది పీతాంబరం.
ప్రసాదరావులకు! □□□

రెండో సగం—?

భార్య పుట్టినింటికి వెళ్ళి నెలైంది. ఆ నెల విరహంలో ఆమె తన భర్తకు టెలిగ్రాం ఇచ్చింది. "మీనుండి నేను ఒక్క నెల దూరమయ్యానా? ఈ నెలలో సగం చిక్కిపోయాను, నన్నెపుడు పిలుచుకు వెళతారు?" అని.

"మరో నెలతర్వాత" అన్న జవాబు పంపాడు భర్త.

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

మూడు అపూర్వ వస్తువులు !!!

జొన్నలగడ్డ రామలక్ష్మి

సూర్యారావు ఆలోచన లోకపట్టాన తేలలేదు. అతనికి అర్జంటుగా అయిదువేలు కావాలి. లేకపోతే వున్న ఊళ్ళో స్వంతిల్లు అమ్మేయాల్సి వుంటుందని తండ్రిరాశాడు. ఆయన వుత్తరం చదివేక ఎలాగో తల తాకట్టు పెట్టయినా అయిదువేలు సంపాదించాలని అతనికి తోచింది.

అయితే సూర్యారావు తల విలువ అయిదువేలు చేస్తుందని అంగీకరించే స్నేహితులు చాలా తక్కువ మంది వున్నారు. అలా అంగీకరించగలిగిన వారిలో అయిదు వేలివ్వగలిగిన వారొక్కరు కూడాలేరు. ఏది ఏమైనా సూర్యారావు ఊరిమీద పడి నాలుగిళ్ళు తిరగాల్సి వుంది.

అతను అప్పుడే వచ్చిన పేపరు తీసుకుని తిరగేయ సాగాడు.

పేపరు చదువుతూండగా సూర్యారావు నొక ప్రకటన ఆకర్షించింది.

"పట్టుకుంటే పదివేలు బహుమానం!

ఈ పైన ఫొటోలోవున్న వ్యక్తికోసం పోలీసులు వెదుకుతున్నారు. ఇతను అనేక రకాల నేరాల్లో భాగస్వామి. ఇతనివద్ద మూడు విచిత్రవస్తువులున్నాయి. ఒకటి బాల్ పెన్. ఈ పెన్‌మీద ఒక అమ్మాయి బొమ్మవుంటుంది. తన క్రింద తిప్పితే ఆ బొమ్మ బట్టలు విప్పుకుంటుంది. ఆ పెన్‌తో అతడు గాజుపలకలు కోస్తాడు.

రెండవది ఆటోమేటిక్ కెమేరా. అది ఫొటోలు తీసుకొనేందుకనువైనదే అయినా దూరాన్నుంచి మనుషులను షూట్ చేయడానికి కూడా అవకాశమున్నదని పోలీసులు విశ్వసిస్తున్నారు.

మూడవది పాకెట్ రేడియో. దాన్ని తను ట్రాన్మిటర్‌గా వాడుతున్నాడని అనుమానముంధి. నిత్యం మారువేషాల్లో తిరిగే ఈ వ్యక్తి పైపోలికల్లో ఉండే అవకాశమున్నదని భావించబడుతోంది. ప్రమాదకరమైన ఈ వ్యక్తిని పట్టివ్వగలిగినవారికి పదివేల రూపాయలు క్యాషు బహుమతి ఇవ్వబడుతుంది...."

సూర్యారావుకు చాలా ఉత్సాహం వచ్చింది.

గబగబా వెళ్ళి స్నానం చేసేశాడు. తర్వాత స్నానాల గదిలోంచి బయటకు వచ్చి వేగంగా బట్టలు మార్చుకుని ఇంటికి తలుపు తాళం వేసి—వీధిలోపడ్డాడు.

సూర్యారావు ఉత్సాహానికి క్కారణం లేకపోలేదు. ప్రకటనలో వున్న మూడు విచిత్ర వస్తువులనూ రెండు రోజుల క్రితమే అతను చూశాడు. పేపర్లో ఫొటోలోవున్న వ్యక్తిని కూడా అతను నాలుగురోజుల క్రితం ఒక హోటల్లో చూశాడు. ఆ వ్యక్తి ఆ హోటల్లోనే ఉంటున్నాడు

పన్నెండో నంబరు గదిలో. అంత ఖచ్చితంగా ఆ వివరాలు గుర్తుండడాని క్కారణముంది.

ఆ వ్యక్తి పక్కన చాలా అందమైన ఆడపిల్లవుంది. ఆ పిల్లవైపు ఒకసారి చూస్తే—దృష్టి మరలించుకోవడం చాలాకష్టం. తనూ ఆ పిల్లవైపే చూస్తూండిపోయాడు. అతనూ ఆమే చాలా ఉత్సాహంగా, చనువుగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

అతను కాసేపలా కబుర్లు చెప్పి లేచి నిలబడ్డాడు. ఆమెకూడా లేచింది. ఇద్దరూ హోటల్ మెట్లువైపున నడిచారు. అప్పుడే వాళ్ళు తన పక్కగా వెళ్ళారు. వెళ్ళేముందతను సర్వర్ని పిలిచి—"ఎవరైనా నా కోసం వస్తే నా గదికి పంపించు, ఆ సీట్లోకే వస్తాను. నా రూం నంబరు తెలుసుగా—పన్నెండు...." అన్నాడు.

అతని వాలకంబట్టి ఏ స్మగ్లరేనా కాదుగదా అని కాసేపు అనుకున్నాడు తను. అతని రూపం కూడా ఆ పిల్ల రూపంతో పాటు తన బుర్రలోవుండిపోయాయి. పేపర్లో ఫోటో చూడగానే తనకు గుర్తువచ్చేసింది.

ఈ వ్యక్తి బహుశా ఓ వారంరోజుల క్రితం ఈ ఊరు వచ్చివుంటాడు. ఆ హోటల్లో మకాంచేసి ఉంటాడు. అనంతరం తనదగ్గరున్న విచిత్రవస్తువుల్ని ఒకొక్కటే ఎవరికో ఒకరికి అమ్మేసివుంటాడు.

రెండ్రోజుల క్రితం రామారావు దగ్గర తనా బాల్ పెన్ చూశాడు—"ఆడపిల్లని నగ్నంగా చూస్తావుటోయ్...." అన్నాడు రామారావు తనలో. తనకర్థంకాక నవ్వితే బాల్ పెన్ చూపించి ప్రదర్శించాడు.

"బాగుంది—" అన్నాడు తను.

"ఎక్కడదని అడగవేం?"

"చెప్పు...." అన్నాడు తను.

"సారీ—చెప్పకూడదు...." అన్నాడు రామారావు.

"బాగుంది—" అన్నాడు తను.

"పెన్నూ బాగుందన్నావ్. అదెక్కడి నుంచి వచ్చిందో చెప్పనంటూంటేనే బాగుందంటున్నావ్"—అని "నిజంగా చెప్పకూడదులే—ఇది గ్లాస్‌కటింగ్ ఇన్‌స్ట్రుమెంట్ కూడా" అన్నాడు రామారావు.

తను ఆశ్చర్యపడ్డాడు. కుతూహలం పెరిగింది — "నేను కొంటానొకటి. ఎంతో, ఎక్కడ దొరుకుతుందో చెప్ప కూడదూ...." అన్నాడు.

"చెప్పేవిషయమైతే ఎప్పుడో చెబుదును...." అన్నాడు రామారావు.

ఆ రోజే సాయంత్రం తను రంగనాథం ఇంటికి వెళ్ళాడు. భోజనానికి పిల్చాడతను.

రంగనాథం వివాహితుడు. కానీ బాధ్యతల్లేవు. అతని జీతం డబ్బులలో హాయిగా ఓ వెలుగు వెలుగుతున్నాడు. అతని భార్యకూడా చాలా అందంగా వుంటుంది.

"ఈవేళ ఈయన మిమ్మల్ని భోజనానికెందుకు పిలిచారో తెలుసా"—అంది రంగనాథం భార్య కాంతిమతి.

"నువ్వు చెప్పినా ఆతనెలాగూ నమ్మడు, నువ్వు చెప్పక పోయినా నేనెలాగూ కెమేరా చూపిస్తాను"—అన్నాడు రంగనాథం.

"కెమేరా ఏమిటి—కొన్నావా?"

"లేదు. కానీ కొన్ని రోజులు మనింట్లో వుంటుంది."

తను కెమేరాని పరీక్షగా చూశాడు. వ్యూ చూస్తూంటే

కొత్తగావుంది లోపలేవో బోర్డర్లూ-అంకెలూ వున్నాయి.

"ఇది ఆటోమేటిక్ కెమేరా....మనమేమీ చేయనక్క్లేదు! లైటు దానంతటదే అడ్జస్టయిపోతోంది. ఫోకస్ చేయడం—క్లిక్ మనిపించడం — అంతే!"—అన్నాడు రంగనాధం.

"నిజంగా!"—అన్నాడు తను.

"ఓ రీలు కొనేశారు. అప్పుడే ఇరవై ఫోటోలదాకా తీసేశారు. కోతికి కొబ్బరికాయ దొరికినట్లుంది ఈయన వ్యవహారం—" అంది కాంతిమతి.

"పైన ఫ్లాష్ షూ పక్కన ఇంకో స్విచ్ కనబడుతోం దేమిటి?"

"దాని గురించి నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు."

"ఇంతకీ ఆ కెమేరా ఎక్కడిది?"

"అదికూడా నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు."

తనకు చిరాకు కలిగి ఏమైనా సాయం చేస్తుందేమోనని కాంతిమతి వంక చూశాడు. ఆమె ఏ సమాధానమూ ఇవ్వకుండా అన్నం వడ్డించింది.

ఆ రాత్రి అతనా దంపతులకో రెండు ఫోటోలు తీశాడు. వాళ్ళింట్లో భోంచేస్తూండగా అంతా కలిపి సెల్ఫ్‌టైమర్‌తో ఓ ఫొటో తీసుకున్నారు కూడా.

ప్యాకెట్ ట్రాన్సిస్టర్ మాత్రం తను అంతకు క్రితం రోజునే సాంబమూర్తి దగ్గర చూశాడు. సాంబమూర్తికి పాకెట్ ట్రాన్సిస్టర్ లేదు. ఎప్పుడూలేనిది అతనా రోజున ఆఫీసులో మధ్యాహ్నం లేటెస్టు వార్తల గురించి మాట్లాడితే-ఎలా తెలిసిందని తనడిగాడు. అప్పుడు సాంబమూర్తి తన దగ్గరున్న పాకెట్ ట్రాన్సిస్టర్ చూపించాడు.

ఎలా వచ్చిందని అడిగితే చెప్పలేదు. నవ్వి వూరుకున్నాడు. తనూ నొక్కించలేదు.

అది మామూలు ట్రాన్సిస్టర్లాలేదు. దానికి కొన్ని అడిషనల్ స్విచెస్ కూడా వున్నాయి. అవేమిటో సాంబమూర్తికి తెలియవని తనకు తెలిసిపోయింది.

ఈ మూడు వస్తువులూ తప్పక ఆ స్మగ్లర్‌కి సంబంధించినవే అయుంటాయి. స్మగ్లర్‌కి సంబంధించిన ఆ మూడు వస్తువుల గురించిన ప్రకటన తను పేపర్లో చదవడమూ, తనకా మూడు వస్తువులూ తటస్థపడడమూ కాకతాళీయం కావచ్చు. కానీ అవి స్మగ్లర్‌వి కాకుండా పోవు. అవీ ఇవీ ఒకేరకంగా వుండడం కాకతాళీయంగా జరిగుండకపోవచ్చు. పైగా తన మిత్రులు ముగ్గురూ కూడా ఆ వస్తువులు తమ దగ్గర కెలా వచ్చాయో చెప్పడానికి నిరాకరించారు. అంటే ఏదో రహస్యమున్నదన్నమాట!

2

సూర్యారావు ముందుగా రామారావింటికి వెళ్ళాడు. అతను వెళ్ళేసరికి రామారావింట్లోనే వున్నాడు. అతను కాస్త కంగారుగా కనబడ్డాడు.

"ఈవేళ పేపరు చూశావా?"-అన్నాడు సూర్యారావు సంభాషణ ప్రారంభిస్తూ.

"చూశాను, అందుకే కంగారుగా వుంది...."

"అయితే ఆ బాల్‌పెన్ నీకు స్మగ్లరే యిచ్చాడా?"—సూర్యారావు సూటిగా అడిగాడు.

"అతను స్మగ్లరో కాదో తెలియదు. మనిషి బాగా ముసలివాడిలాగున్నాడు. అయిదా రోజుల క్రితం నా దగ్గరకు వచ్చి ఈ పెన్నిచ్చాడు. తన కొడుకు వాడేవాడట ఈ

పెన్ను. ఆ కొడుకు చనిపోయి ఏడాదయిందట జ్ఞాపకార్థం ఇది వుంచుకున్నాట్ట. ఈ పెన్నును తన కొడుకీడు వాడి కిచ్చి ఓ వారం రోజులుంచుకోమనాలని ఆయన ఆశయం. ప్రతి ఏటా యిలాగే చేస్తాడట. ఆ విధంగా తన కొడుకు పేరు చాలామంది గుర్తుంచుకుంటారన్నాడు. అప్పు డాయన అన్నీ వివరంగా చెబుతూంటే నాకు నమ్మకంగానే అనిపించింది. కానీ ఈ రోజు పేపర్లో ప్రకటన చూసేక అంతా మోసమేమోననిపిస్తోంది....''అన్నాడు రామారావు.

"నీ దగ్గరకొచ్చిన ముసలాయనకీ - పేపర్లో ఫోటోకీ పోలికలు లేవా?"

"ఏమో - వున్నాయేమో - పోల్చడం చాలా కష్టం....'' అన్నాడు రామారావు.

''కానీ ఆ పేపర్లో మనిషిని నేను చూశాను. అక్కడికి తీసుకువెడతాను. నాతో వస్తావా?" అన్నాడు సూర్యారావు.

రామారావు ఆశ్చర్యంగా మిత్రుడివంక చూశాడు.

''ముందు మనమిగతా మిత్రుల దగ్గరకు వెడదాం-ఆ తర్వాత అంతా కలిసి ఏంచేయాలీ నిర్ణయించవచ్చు...." అన్నాడు సూర్యారావే మళ్ళీ.

ఇద్దరూ కలిసి రంగనాధం ఇంటికి వెళ్ళారు. రంగ నాధం కూడా పేపర్లో ప్రకటన చూశాడు.

''ఆ రోజు ఓ ముస్లిం నా దగ్గరకు వచ్చాడు. తన కెమేరాని ఓ వారం రోజులపాటు ముచ్చటైన జంటకివ్వా లని తోచిందిట. అదేదో తన సెంటిమెంటన్నాడు. కెమేరా ఎలా వాడాలో చెప్పాడు. అతను మాట్లాడుతూంటే ఏ విధమైన అపనమ్మకమూ కలగలేదు. కానీ యిప్పుడీ ఫోటో ప్లస్ ప్రకటన చూస్తూంటే నాకు అనుమానంగానే వుంది" అన్నాడు రంగనాధం.

"ఫోటో మనిషికీ_నీకు కెమేరా ఇచ్చిన ముస్లింకీ పోలి కలు కనబడుతున్నాయా?''-అడిగాడు సూర్యారావు.

''చెప్పలేను....'' అన్నాడు రంగనాథం.

"రీలింకా లోడయ్యే వుందా? లేక అయిపోయిందా?''-అడిగాడు రామారావు.

''ఇంక రెండే రెండు స్నాప్స్ వస్తాయి. మా ఆవిణ్ణి పిల్చి మన ముగ్గురినీ తీసేయమంటాను....'' అన్నాడు రంగనాథం.

''సెల్ఫ్ టైమరుందేమో...."

"మనిషుండగా సెల్ఫ్ టైమరెందుకూ-వెధవ బోరు...." అన్నాడు రంగనాథం అతని కిప్పుడు కెమేరా మోజు పూర్తిగా తీరిపోయినట్లు కనబడుతోంది.

అన్ని ఫొటోలూ అయేక రీలు కెమేరాలోంచి బయటకు తీసేశారు. మిత్రులు ముగ్గురూ కలిపి సాంబమూర్తి ఇంటికి వెళ్ళారు.

సాంబమూర్తి పేపర్లో ప్రకటన చూడలేదు. వీళ్ళు ముగ్గురూ కలిపిరావడం అతన్ని ఆశ్చర్యపరచింది. అయితే విషయం విన్నాక అతను మరింత ఆశ్చర్యపడి—"ఇక్క ణ్నించి పేపర్లో ప్రకటనలు కూడా చాలా జాగ్రత్తగా చూస్తూండాలన్న మాట...." అన్నాడు.

"ఇంతకీ రేడియో...."

"ఎవడో చిన్న ఉద్యోగి - పదిహేను రూపాయలకు నా దగ్గర తాకట్టుకి పెట్టాడు. అలాంటివి నా కలవాటు లేవ న్నాను. ముక్కూ ముఖం ఎరగనివాడికి డబ్బెవరిస్తార్సార్ ఈ రోజుల్లో-ఇది తాకట్టు కాదు. నా బాధ్యత నాకు గుర్తు చేయడానికి మీ దగ్గరుంచుతున్న వస్తువు అన్నాడు. అతను

మాట్లాడుతున్నంతసేపూ నాకే విధమైన అనుమానమూ రాలేదు....''

"ఇప్పుడు గుర్తుపట్టగలవా అతన్ని-ఫొటోలో వున్న వ్యక్తిలాగే వున్నాడా!"

"లేదు. బహుశా మారువేషం కావచ్చు...."

"నేరస్థుడు చాలాతెలివైనవాడిలాగున్నాడు...."అన్నాడు రామారావు.

"మీరు ముగ్గురూ కూడా మీకు ఆయా వస్తువులెలా వచ్చాయో చెప్పలేరు. రహస్యంగా వుంచమని నేరస్తుడు చెప్పాడా?"-అనడిగాడు సూర్యారావు.

ముగ్గురి దగ్గర్నుంచీ కూడా అవునని సమాధానం వచ్చింది.

"నేరస్థుణ్ని నేను చూశాను. అతను హోటల్ శాంతి భవనంలో పన్నెండో నంబరు గదిలో వుంటున్నాడు. ఈ వస్తువులనీ-అతన్ని కలిపి పట్టిస్తే మనకు పదివేలు బహుమతి లభిస్తుంది. అయితే ఒక చిన్న మనవి. పదివేలూ ముగ్గురూ సమంగా పంచుకుందాం. కానీ అర్జంటుగా నాకు అయిదువేలు అవసరం. మీరు ముగ్గురూ కలిపి యింకో రెండువేల అయివందలు నాకు అప్పుగా యివ్వాలి....'' అన్నాడు సూర్యారావు.

"అయితే నేరస్థుణ్ని మనం పట్టుకోగలమనే అనుకుంటున్నావా?" అన్నాడు సాంబమూర్తి.

"మనం నలుగురం కలిస్తే అతణ్ని పట్టుకోవడం ఏమంత కష్టసాధ్యం కాదనిపిస్తోంది. దానికి తోడు అపురూపమైన ఈ మూడు వస్తువులూ మన చేతికి చిక్కాయి" అన్నాడు సూర్యారావు.

"వీటినే యథాతథంగా పోలీసులకిచ్చేసి—నేరస్థుడి వివరాలు చెప్పేస్తే...." అన్నాడు రంగనాథం.

"మీరుచెప్పే విషయాలు కట్టుకథల్లా వున్నాయి. ఈ వస్తువులు మీకెలా వచ్చాయోనని పోలీసులను మానపడి ముందు మిమ్మల్ని లాకప్‌లో పడేస్తారు...." అన్నాడు సూర్యారావు.

"అయితే మనమేం చేయాలంటావ్?" అన్నాడు సాంబమూర్తి.

"ఆ మనిషినీ—ఈ వస్తువులనీ కలిపి పోలీసుల కప్పగించాలి...." అన్నాడు సూర్యారావు.

"మనమా సామాన్యులం. వాడేమో తెగించినవాడు. ప్రమాదముండదంటావా?" అన్నాడు రంగనాథం.

"ప్రమాదకరంగా మనం ప్రవర్తించవద్దు. వాడి వునికి తెలుసుకుని పోలీసులకు చెప్పేద్దాం. ఈ వస్తువుల్నీ వాణ్ణి పట్టిచ్చినట్టవుతుంది...." అని—"వాడు పారిపోయి ఈ ఊరొచ్చాడు. వాణ్ని పోలీసులు అనుమానించడం జరిగింది. అందుకే తాత్కాలికంగా తన వస్తువులు మీదగ్గర దాచాడు. పదండి శాంతి భవనం హోటల్‌కి వెడదాం—" అన్నాడు సూర్యారావు.

3

మిత్రులు ముగ్గురూ తమతమ వస్తువులతో శాంతి భవనం హోటల్‌కు బయల్దేరారు. సూర్యారావుని వదిలిపెడితే మిగతా ముగ్గురికీ మనసులో కాస్త బెదురుగానేవుంది వాడు తాత్కాలికంగా ఆ వస్తువులు తమదగ్గర దాచిపెట్టాడు విషయాన్ని రహస్యంగా ఉంచమని హెచ్చరించాడు. ఇప్పుడది బయటపడితే తమ ప్రాణాలకే ముప్పువస్తుంది.

హోటల్ శాంతిభవనం చేరుకోగానే సూర్యారావుతిన్నగా రిసెప్షన్' దగ్గరకువెళ్ళి రూంనెంబరు పన్నెండులోని వ్యక్తిని కలుసుకోవాలన్నాడు.

రిసెప్షనిష్టు సూర్యారావును చూపినవ్వి—"సార్ మీరు నాకుతెలిసినవారు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇప్పుడే పోలీసులకు ఫోన్‌చేసి మిమ్మల్ని పట్టించి వుండేవాణ్ని. అతనికోసం ఎవరువచ్చినా—పోలీసులకు చెప్పమని ఆర్డర్ వుంది...." అన్నాడు.

సూర్యారావు స్వరం తగ్గించి—"ఈరోజు పేపరులో అతనిఫోటో చూసాను. మీ హోటల్లో అతనుంటున్నట్లు చూశాను. నేను పోలీసులకు సాయపడదామనే వచ్చాను. అతని సంగతి పోలీసులకు తెలిసిపోయిందా? అసలేం జరిగింది?"—అన్నాడు. అతని కంఠంలో నిరుత్సాహం ధ్వనించింది.

"నిన్న సాయంత్రం కాబోలు సార్—ఏదో రహస్య వ్యవహారంచేస్తూ అతను పోలీసుల కంటబడ్డాడు. వాళ్ళ తన్ని ఫాలో అయ్యారు. తిన్నగా మా హోటల్‌కివచ్చారు అతను గదికి వెళ్ళిపోగానే నన్ను వివరాలడిగారు. నాకు తెలిసినవి చెప్పాను. తరువాత వాళ్ళతని గదికివెళ్ళారు. గది తలుపులు లోపలవేసి వున్నాయి. ఎంతతట్టినా ఎవరూ తలుపు తీయలేదు.

ఆఖరికి బలవంతంగా తలుపులు తెరచి వెళ్ళారు. లోపల ఎవరూలేరు. గదంతా వెదకగా అతనికి సంబంధించిన కొన్ని వివరాలు దొరికాయి. దాన్నిబట్టి అతను అనేక నగరాల్లో పోలీసులను ముప్పతిప్పలు పెడుతున్న స్మగ్లర్ ప్రముఖుడని తెలిసింది. పోలీసులు వెంటనే అప్పటికప్పుడే

ప్రకటన వేయించారు.

మా హోటల్లో బసచేసినవారి ఫోటోలుంచడం మా అల వాటు. ఆ విధంగా వారికి ఫోటోకూడా లభించింది. ప్రస్తుతం ఆ స్మగ్లర్ ఊళ్ళో తిరుగుతున్నాడు. యెవరు పట్టుకుంటేవారికి పదివేలు బహుమానం. మళ్ళీహోటల్‌కు వస్తే నేనే పట్టుకుని ఆ పదివేలూ సంపాదిద్దా మనుకుంటు న్నాను సార్! కానీ వాడు మళ్ళీ యిక్కడికి వస్తాడా— అది కలలోనిమాట...." రిసెప్షనిష్టు నిట్టూర్చాడు.

సూర్యారావుతోపాటు మిత్రులు ముగ్గురి ముఖాల్లోకూడా నిరుత్సాహం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ముగ్గురు బయ టకు వచ్చారు.

"వాడూళ్ళో వున్నాడు కాబట్టి, మన యిళ్ళకు వచ్చే అవకాశముంది...." అన్నాడు రంగనాథం.

"ఒకపని చేద్దాం. మీరంతా నా గదికి వచ్చేయండి. ఎవరయినా మీకోసం మీ యిళ్ళకువస్తే మా ఇంటికి రమ్మ నమని చిరునామా చెప్పండి. వాడు తప్పక మీ యిళ్ళకు వెడతాడు. ఆ తర్వాత మా యింటికీ వస్తాడు. అప్పుడు మనం నలుగురం. వాడొక్కడు. పదివేలు ఈజీగా సంపా దించవచ్చు...." అన్నాడు సూర్యారావు.

"కానీవాడు స్మగ్లర్. మనం సామాన్యులం...." అన్నాడు రంగనాథం.

"భయపడకు నాయనా. నీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డు. సరా?"—అన్నాడు సూర్యారావు. తాము నలుగురు కలిపి అప్పుడే పదివేలు సంపాదించినట్లే అతను భావిస్తు న్నాడు.

4

అనుకున్న ప్రకారం ముగ్గురూ వాళ్ళవాళ్ళ యిళ్ళదగ్గర చెప్పి—సూర్యారావు గదికి బయలుదేరారు. ఆ స్మగ్లర్ అంతవరకూ ఎవరిళ్ళకూ వెళ్ళలేదని రూఢి అయింది. దారిలో రామారావు సూర్యారావు హోటల్లో భోజనంచేశారు.

గది చేరుకున్నాక—"మనకు కాలక్షేపమెలా అవుతుంది కాసేపు పేకాడదాం...." అన్నాడు సాంబమూర్తి.

"అలాగేకాని గది తలుపులు గడియవేసేయ్...." అన్నాడు రంగనాథం.

"రాత్రి పడుకునేటప్పుడు తప్ప అలాచేయడం నా కలవాటులేదే—" అన్నాడు సూర్యారావు.

"అవుననుకో. కానీ ఇప్పటి పరిస్థితివేరు. హఠాత్తుగా తలుపులు తోసుకొని స్మగ్లర్ వచ్చాడనుకో. మనం సిద్ధపడి వుండం. వాడే ఆయుధాన్నయినా చూపి బెదిరించవచ్చు. అలాగాకుండా తలుపు వేసివుంటే వాడు తలుపు తడతాడుకదా. అప్పుడు మనం పొజిషన్స్ టేకప్‌చేసి తలుపులు తీయవచ్చు. సులభంగా పట్టుబడే అవకాశముంటుంది...." అన్నాడు రంగనాథం.

"రంగనాథం చెప్పింది బాగానేవుంది .." అన్నాడు సాంబమూర్తి. అతనేవెళ్ళి గది తలుపులు వేసి వచ్చాడు కూడా.

తర్వాత పేకాట ప్రారంభమయింది. జోరుగానే కొనసాగింది ఓపావు గంటసేపు. అంతలో ఎవరో తలుపు తట్టారు.

మిత్రులందరూ ఒకర్నొకరు హెచ్చరించుకొని ముగ్గురు

తలోమూల నక్కారు. రంగనాధం వెళ్ళి తలుపులుతీశాడు. మిగతా ముగ్గురూ ఊపిరిబిగబట్టి జరగబోయే దానికోసం ఎదురుచూస్తున్నారు.

తలుపులు తెరుచుకోగానే వచ్చిన ఆడమనిషిని చూసి సూర్యారావు నవ్వుకుంటూ తన స్థానంలోంచి బయటకు వచ్చాడు.

ఆమె ఎదురింటివాళ్ళ పనిమనిషి. తనదగ్గర తీసుకున్న పత్రిక ఈమెద్వారా తిరిగి పంపించారు వీళ్ళు. పత్రిక అందుకోగానే ఆమె వెళ్ళిపోయింది. రంగనాధం తలుపులు వేసి—"నా గుండె లింకా కొట్టుకుంటూనే వున్నాయ్...." అన్నాడు.

"అందుకేగా నిన్ను తలుపులు తీయమన్నది. నిన్ను చాటునపెడితే ఇవతలవాళ్ళు చస్తున్నా బయటకు రావు...." అన్నాడు.

"బాగుంగి—నా దగ్గరున్న కెమేరా మీ అందరి దగ్గరున్న వస్తువులకన్నా విలువైనది...." అన్నాడు రంగనాధం.

"విలువ అవసరాన్నిబట్టి. వాడు ఇంట్లోంచి పారిపోవాలనుకుంటే నా బాల్‌పెన్నే ఉపయోగిస్తుంది. కెమేరా ఎందుకు? దేని విలువ దానిది...." అన్నాడు రామారావు.

"అదీ నిజమే!" అన్నాడు రంగనాధం.

ముగ్గురూ వారివారి వస్తువులు బయటపెట్టి వాటిని పరీక్షించసాగారు.

"వాడింక మన దగ్గరకు రాడని నాకు అనుమానంగా వుంది. వాడి స్మగ్లింగ్‌కు ఈమూడు వస్తువులుబాగా ఉప

యోగ పడుతున్నట్లున్నాయి. మనంకూడ వీటినుపయోగించి స్మగ్లింగ్ ప్రారంభిస్తే...." అన్నాడు సూర్యారావు.

"అలా ఎలా కుదుర్తుంది? వాడేదో ముఠాకు చెందినవాడయివుంటాడు. ఇంకా రకరకాల వస్తువులుపయోగిస్తూండి వుంటాడు. నాడా దొరికిందిగదా అని గుర్రంకొనమన్నట్లుంది నీ ఆలోచన...." అన్నాడు సాంబమూర్తి.

తిరిగి పేకాట ప్రారంభమయింది. మూడో రౌండు అయింది. మూడుసార్లు రామారావు ఆల్‌కౌంట్ ఇచ్చాడు. నాలుగోసారికూడా అతనికి ముక్కలు సరిగా కలవలేదు. చాలా విసుగ్గా వుందతనికి. ఆటయింకా రెండుసార్లు తిరక్కుండానే సాంబమూర్తి షో అన్నాడు. రామారావు పేకముక్కలు నేలమీద విసిరికొట్టాడు. మళ్ళీ ఆల్‌కౌంట్!

అలా విలాసంలో రెండుపేకలు జారి మంచంక్రిందకు వెళ్ళిపోయాయి.

"మరీ అంత విసురు పనికిరాదు. రేపు పెళ్ళయితే ఏంచేస్తావ్?"—అన్నాడు సాంబమూర్తి.

రంగనాథం నవ్వుతూ—"ఆడవాళ్ళకి పేకాట చాలా ఇష్టం. కానీ ఓడిపోవడం వాళ్ళకిష్టముండదు. పేకాటలో ఓడారో—ఆరోజు మగాడికి భోజనముండదు. అందుకే వాళ్ళతో ఆడేప్పుడు—నెగ్గడానికి కాక, ఓడడానికే ఆడతాను నేను. అఫ్‌కోర్స్—వాళ్ళ చేతిలో ఓడిపోవడమే ఎక్కువ బాగుంటుంది కూడా...." అన్నాడు.

"మరింకా నాకలాంటి అలవాట్లు లేవుకదా...." అంటూ రామారావు లేచాడు—మంచంక్రింద పడిన పేకముక్కలు తీయడానికి.

"దూరగలవా మంచం క్రిందకు...." అన్నాడు సూర్యారావు నవ్వుతూ.

"ఇదీ అలవాటు లేనిపనే అనుకోవాలి. కానీ తప్పదు" అంటూ రామారావు ముందుకు నడిచాడు. అంతలోనే వెనక్కి రెండడుగులు వేశాడు. కారణం — మంచంకింద నుంచి ఆ రెండు పేకముక్కలు వాటంతటవే వెనక్కి వచ్చేశాయ్.

"మైగాడ్—మంచంకింద ఎవరో ఉన్నారు!" అన్నాడు రంగనాధం. అతనిలో బెదురు ప్రారంభమయింది.

అప్పుడే మంచం క్రిందనుంచి చటుక్కున ఒకవ్యక్తి లేచి వచ్చాడు.

"ఎస్—అయాం స్మగ్లర్ హియర్. మీరు మాత్రం ఎవరూ ఉన్నచోటునించి కదలవద్దు...."

అతని చేతిలో రివాల్వర్ ఉంది.

"ఉదయం నన్నెవరో వెంటాడుతుంటే తప్పించుకొని ఈగదిలో దూరాను. అప్పుడీగదిలో మనిషి స్నానంచేస్తున్నాడు. స్నానం పూర్తయ్యేసరికి నేను మంచంక్రింద దూరాను. అతను వెంటనే వెళ్ళిపోతాడనుకోలేదు. కానీ క్షణాలమీద తాళం వేసికొని వెళ్ళిపోయాడు. నా వస్తువులు కలెక్ట్ చేసుకొని వెళ్ళిపోదామనుకున్న నేను అనవసరంగా ఇక్కడ చిక్కడిపోయాను. కానీ నా అదృష్టం కొద్దీ మీరంతా ఈగదికే వచ్చారు నా వస్తువులతో సహా. జీవితంలో అదృష్టం ఇంతగా తటస్థపడటం యిదేమొదటి

సారి నాకు, మీ యందరికీ నా ధన్యవాదాలు. ఆ వస్తువుల నలాగే వదిలేసి మీరు బాత్రూంలోకి వెళ్ళండి. లేకపోతే నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను...." అన్నాడతడు.

మిత్రులు నలుగురి ముఖాల్లోనూ కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. నలుగురూ బాత్రూంలోకి నడిచారు. అతడు బయటనించి బాత్రూం తలుపులు వేసేశాడు. ఆ తర్వాత అక్కడున్న తన వస్తువులు తీసుకొని....తనవేషం త్వర త్వరగా మార్చుకొన్నాడు. గదిలోంచి బయటపడి తలుపులు దగ్గరగా వేసాడు. ఆ తర్వాత బయట జనంలో కలపి పోయాడు.

బాత్రూంలో మిత్రులు సూర్యారావుని తిడుతున్నారు— "ఉయ్యాల్లో పిల్లాడినెట్టుకొని ఊరంతా వెదికినట్లు— ఇంట్లోనే వాణ్ణుంచుకొని తెలుసుకోలేక పోయావు. నీ మూలంగానే పదివేలు పోయాయి మనకు...."

"నాగదిలో నాకుచెప్పి దూరలేదుగదా వాడు. అసలే డబ్బవసరంలోకూడా ఉన్నానేను...." అంటూవాపోయాడు సూర్యారావు.

"సరే—ఈగదిలోంచి బయటపడే మార్గం చూడండి. పెలవుపూటా ఇంట్లోనయినా గడపకపోతే మా ఆవిడ గోలెడుతుంది. డబ్బాశ ఎలాగూ తీరలేదుగదా!" అన్నాడు రంగనాథం.

మిత్రులు నలుగురూ దివాలా తీసిన మొఖాల్తో గది బయటపడే మార్గం గురించి ఆలోచించసాగారు. □□□

దొంగ ఎవరు ?

శశిభూషణ్

ఇంటిముందాగిన టాక్సీలోంచి దక్షిణామూర్తి క్రిందకు దిగాడు.

అజంతా మూవీస్‌వారి "దొంగ ఎవరు?" చిత్రం ఔట్ డోర్ షూటింగ్ సందర్భంగా ఊటీ వెళ్ళిన డైరెక్టర్ దక్షిణామూర్తి మద్రాసులోని తన ఇంటికి తిరిగొచ్చేసరికి నాకు ప్రాణాలు లేచి వచ్చాయ్!

అప్పటివరకు అంటే దాదాపు ఏడు రోజులుగా నేను దక్షిణామూర్తి ఇంట్లో గోడలతోను, పుస్తకాలతోను మాట్లాడుతూ గడిపాను. వేరే స్నేహితులెవరూ లేకపోవటంతో ఇల్లుదాటి హోటల్‌కి తప్ప మరెక్కడికీ వెళ్ళలేదు ఈ వారం రోజులుగా.

అసలు నేను మద్రాస్ రావటానికి పెద్ద కారణమే వుంది. ఇక్కడ బోలెడు పబ్లికేషన్స్, వివిధ పత్రికలకు చెందిన కార్యాలయాలు వున్నాయ్. ఏ పబ్లిషర్ అయినా దయతలచి క్రైం స్క్రిప్టు కనీసం నెల కొకటైనా తీసుకుంటారేమోనని, అదృష్టాన్ని వెతుక్కుంటూ ఇలా వచ్చాను. తుదకు ఏ పత్రికాఫీసులోనైనా చిన్న వుద్యోగం వంటిది చిక్కినా చాలని అనుకున్నాను. ఇంకా ఎన్నో ఆలోచించి, గంపెడు ఆశతో మద్రాస్ చేరాను.

దక్షిణామూర్తి తప్ప మరొక వ్యక్తి ఎవరూ తెలియదు నాకు మద్రాసులో. నాలాగే దక్షిణామూర్తి కూడా యింకా బ్రహ్మచారిగానే వుంటున్నాడు. ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న డైరెక్టర్ వాడు.

అంతక్రితం వేరే ఏదో ఫిలిమ్ కంపెనీలో ఎసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసేవాడు. అజంతా మూవీస్‌వారి దృష్టి అనుకోకుండా దక్షిణామూర్తి మీద పడింది. తమ మొదటి చిత్రానికి వాణ్ని డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు.

అది తొలి అవకాశం కావటంతో దక్షిణామూర్తి ఎక్కువ శ్రమ పడ్డాడనే చెప్పొచ్చు!

ఫలితం దక్కింది.

అజంతా మూవీస్ వారి తొలి చిత్రం పాతిక సెంటర్స్‌లో శతదినోత్సవాలు జరుపుకుంది. దాంతో దక్షిణామూర్తి పేరు తెలుగు సినిమా పరిశ్రమలో మారు మ్రోగిపోతూంది.

దక్షిణామూర్తికి వేరే ఆఫర్లు ఒకవైపు వచ్చి పడుతుండగా అజంతా మూవీస్‌వారే తమ రెండవ చిత్రం "దొంగ ఎవరు?" ప్రారంభించారు. ఈ చిత్రానిక్కూడా

దక్షిణామూర్తినే డైరెక్టర్‌గా తీసుకున్నారు.

నేను మద్రాస్ రాకమునుపే ఈ వివరాలన్నీ నాకు తెలిశాయి. దక్షిణామూర్తి తన స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు వుత్తరాల ద్వారా నాకు తెలియజేసేవాడు. ఎటొచ్చీ బ్రేక్ నావద్దనే పడేది. ప్రతి చెత్త వుత్తరానికీ సమాధానం వ్రాయాలంటే ప్రాణస్నేహితుల విషయంలో కూడా నాకు మహా బద్ధకం! దక్షిణామూర్తినుంచి మూడు నాలుగు లెటర్లు వచ్చాక నావద్దనుంచి ఒకటి వెళ్ళేది.

మద్రాస్‌లో దక్షిణామూర్తి పరపతి పెరిగిపోవటం ప్రారంభించిందని తెలిశాక మా పల్లెటూర్లో ఊరికే కూర్చోలేకపోయాను. మూర్తిగాడిని ముందుకుతోసి ఏ పబ్లిషర్నైనా బ్రతిమాలుకోవాలని... కొండంత ఆశతో ....స్వార్థంతో మద్రాస్ రైలు ఎక్కాను.

కాని, తీరా నేను మద్రాస్ వచ్చేసరికి, హడావుడిగా డ్రస్ చేసుకుంటూ ఇంట్లో కన్పించాడు దక్షిణామూర్తి. నన్ను చూసి కౌగలించుకున్నంత పనిచేశాడు. కుశల ప్రశ్నలు అన్నీ అయ్యాయి. కాని, చావు కబురు చల్లగా చెప్పాడు.

తను ఔట్‌డోర్ షూటింగ్ సందర్భంగా ఊటీ వెళ్తున్నట్టు హుషారుగా చెప్పుకొచ్చాడు.

"మళ్ళీ ఎప్పుడొస్తావ్!" అన్నాను సగం చచ్చి.

"వారం రోజులు పడుతుంది. అంతవరకు నువ్వు ఇక్కడే వుండు" అంటూ హడావుడిగా తలదువ్వుకున్నాడు. "నిజంగా నన్ను నువ్వు క్షమించక తప్పదురా! రాక రాక వచ్చావ్. అయినా నీతో కులాసాగా గడిపే అవకాశం లేకుండా పోయింది. ప్చ్....ఏమీ అనుకోవద్దురా బ్రదర్!

ఎన్నాళ్ళు.... వారం! దట్సాల్!"

"నీ ప్రోగ్రాం కేన్సిల్ చేసుకుని నా ఎదురుగా కూర్చోమని నేను చెప్పటం లేదుగాని. నువ్వు అనవసరంగా కంగారుపడకు. క్షేమంగా వెళ్ళిరా!" అన్నాను చేసేదిలేక.

ఆ రోజు దక్షిణామూర్తి వెళ్ళాక చాలా బాధ పడ్డాను ఒంటరిగా సమయాన్ని ఖర్చుచెయ్యటం ఎలాగో తెలియక. బుక్స్‌తో ఎన్ని గంటలు గడపటం? గంటలు కాదు— రోజులు.

ఇల్లుదాటి ఎక్కడికైనా వెళ్దామంటే క్రొత్త ప్రదేశం! పరిచయస్తులు ఎవరూలేని ఊరు. ఏ సినిమాకో వెళ్ళినా మూడు గంటలకంటే ఎక్కువసేపు తోచేదికాదు. తర్వాత పరిస్థితి మామూలే.

అలాంటి పరిస్థితిలో ఇరుక్కుపోయిన నేను వరండాలో కుర్చీవేసుకుని కూర్చుని, ఏదో పత్రిక తిరగేసుకుంటూ వుండగా ఇంటిముందు టాక్సీ ఆగిన చప్పుడైంది. తలెత్తి చూసేసరికి టాక్సీనుండి దిగుతున్న మూర్తి కన్పించాడు. అంతే! నా ప్రాణాలు లేచి వచ్చాయ్.

టాక్సీ ఫేర్ చెల్లించి, ఈలపాట పాడుతూ వరండా మెట్లు ఎక్కాడు దక్షిణామూర్తి.

"షూటింగ్ బాగా సాగిందట్రా? ఒకరోజు ఆలశ్యం అయ్యిందేమిటి?" అన్నాను లేస్తూ.

నన్ను తీసుకుని ఇంట్లోకి వచ్చాడు మూర్తి. "సినిమా షూటింగ్ అంటే కథలు రాయటం అంత తేలిక అనుకున్నా వేమిట్రా! ఎండ లేకుంటే ఒక్కోసారి వారం రోజుల తరబడి కూడా నోరు మూసుకుని కూర్చోవల్సి వస్తుంది. ఔట్‌డోర్ షూటింగ్‌లోని అవస్తలు నీకు

తెలియవురా బాబూ!"

"ఇన్‌డోర్ షూటింగ్ గొడవలు కూడా నాకు తెలియ వనుకో! ఊటీలో ఇంతకూ ఏం తీశారేమిటి?"

"హీరో-హీరోయిన్ల డ్యూయట్ సాంగ్ ఒకటి తీశాం. తర్వాత క్లైమాక్స్ స్టంట్!"

మూర్తికి ఆవేళే నాగోడు విన్పించటం బావుండదని దాని సంగతి మరుసటిరోజు చూసుకోవచ్చని అప్పటికి వూరుకున్నాను.

సాయంత్రం నాలుగున్నర అయివుంటుందపుడు.

స్నానం పూర్తిచేసుకుని, డ్రసప్ అయ్యాడు మూర్తి. నన్నూ డ్రస్ చేసుకోవల్సిందిగా తొందరచేశాడు. తీరిగ్గా డ్రస్ చేసుకుంటూ వుండిపోతే వాడెక్కడ తంతాడోనని హడావుడిగా లుంగీ స్లాకు తీపిపారేపి, పాంటు, షర్టు తగిలించుకున్నాను. మళ్ళీ ఏదైనా షూటింగ్ గొడవేమో అనుకున్నాను. నా అంచనా పొరబాటు.

మూర్తి, నేను ఎక్కిన టాక్సీ హీరోయిన్ చంచల ఇంటిముందాగింది. ఆ ఇల్లు ఆమెదేనని గేటుకున్న సైన్ బోర్డే చెప్పింది.

"ఏమిట్రా విషయం?" మూర్తిని అడిగాడు.

"హీరోయిన్ కుమారి చంచల తెల్సుగా! ప్రస్తుతం ఆమె మార్కెట్ పడిపోయిందనుకో! ఈ ఇల్లు ఆవిడ గారిదే! ఈవేళ ఆమె పుట్టిన రోజట!" టాక్సీలోనే నా చెవిలో వూదాడు మూర్తి.

2

మేము వెళ్ళేసరికి హీరోయిన్ చంచలే మెయిన్ హాల్లో కొవ్వొత్తులు ఆర్పుతూ కన్పించింది. హాల్‌నిండా

వున్నారు జనం. మద్రాస్ ఫిలిం కంపెనీల యాజమాన్యం వారు, నటీనటులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నీషియన్లు, ఇతర ప్రముఖులు హాజరై వున్నారు.

మూర్తి నలుగురైదుగుర్ని నాకు పరిచయం చేశాడు. తర్వాత మూర్తి ఆ జనంలో ఎక్కడ చిక్కుకున్నాడో నాకు తెలియదు. కూల్ డ్రింక్ స్ట్రాతో సిప్ చేస్తూ ఓ సోఫాలో చతికిలబడ్డాను.

"ఎక్స్‌క్యూజ్ మీ...." అంటూ వచ్చి నా ప్రక్కనే కూర్చున్నాడొక యువకుడు. ఫుల్ సూట్‌లో వున్నాడు.

నేను అతని విషయం పెద్దగా పట్టించుకోలేదు.

"క్షమించాలి ఇలా అడుగుతున్నందుకు. మీరెవరో తెలుసుకోవచ్చా?" వినయంగా అడిగాడతను.

"నాపేరు కాళిదాసు. డైరెక్టర్ దక్షిణమూర్తి ప్రాణ స్నేహితుణ్ణి!" అన్నాను. 'దక్షిణా మూర్తి' అనే అక్షరాలను గట్టిగా పలికాను.

అతని ముఖంలో రంగులు మారాయ్. "గ్లాడ్ టు మీట్ యు" నా చేయి అందుకుని నొక్కాడతను. "నా పేరు ధనపతి. హీరోయిన్ చంచల నా చెల్లాయ్!" అన్నాడు. నేను చిన్న షాక్‌కి గురైనమాట నిజమే.

ధనపతిని ఆ క్షణంనుంచి గౌరవంగా చూడటం మొదలు పెట్టాను. ప్రముఖ హీరోయిన్ అన్నగారాయె మరి!

కొరియా యుద్ధం మొదలుకొని కాకరకాయల వేపుడు వరకు ఎన్నో కబుర్లు చెప్పాడు ధనపతి. ఆఖరకు, "మీరేం చేస్తున్నారు మాస్టారూ? ఉద్యోగమా, వ్యాపారమా" అంటూ ప్రశ్నించాడు.

"ప్రస్తుతం ఏమీ చెయ్యటం లేదండీ. దక్షిణామూర్తిని చూడటానికి మద్రాస్ వచ్చాను. మాది పల్లెటూరులెండి. ఆంధ్రలో చిత్తూరుజిల్లాకి చెందినది. వ్యవసాయం వుంది. ఆ పని చూసుకుంటాను. తీరిక సమయాల్లో పత్రికకు కథలు, వ్యాసాలు రాస్తుంటాను" అన్నాను.

పల్లెటూర్లో నేనొక బికారినని, వ్యవసాయం గట్రా ఏమీలేని దరిద్రుణ్ణని ధనపతికి నిజం చెప్పుకోలేకపోయాను ఆ విధంగా చెప్పుకోవటానికి ఆ ఇంటి వైభవం....అక్కడి మనుషుల బట్టలు....ఆడవాళ్ళ ఆభరణాలు....ఆ వాతావరణం నాకడ్డుపడి దారి మళ్ళించాయి.

"అంటే మీరు రచయితలన్నమాట! అలా చెప్పండి!" అంటూ సిగిరెట్ ఆఫర్ చేశాడు ధనపతి.

"వద్దండీ. అలవాటు లేదు!" అన్నాను.

ఇంతలో మూర్తి మావైపు వచ్చాడు. ధనపతి ఏదో పనున్నవాడిలా హడావుడిగా వెళ్ళిపోయాడు—మూర్తిని చిరునవ్వుతో పలకరించి.

"రాత్రికి డాన్స్ ప్రోగ్రాం. డిన్నరు వుంటాయట. వెయిట్ చేద్దామంటావా, వెళ్ళిపోదామంటావా?" అడిగాడు మూర్తి.

"నీ యిష్టం:"

"నీ ఇష్టాయిష్టాలు కావాలోయ్ నాకు."

"ఉందాం. ఇంటికి వెళ్ళినా మనం చేయగల్గిందేముంది?"

"రైట్!" అని సిగరెట్ వెలిగించాడు మూర్తి.

చీకటి పడేసరికి కొందరు వెళ్ళిపోయారు గాని, కొత్త వాళ్ళు వచ్చి హడావుడిగా చంచలకు తమ శుభాకాంక్షలు తెలియజెయ్యటం మొదలుపెట్టారు. ఏ షూటింగ్ హడా

వుడిలోనే ఎక్కడో వుండి ఇప్పుడిలా వచ్చివుండాలి వీళ్ళు. మూర్తి చాలా కబుర్లు చెప్తూ కూర్చున్నాడు నా ప్రక్కనే.

"ఈ చంచల నటించిన చిత్రాలు నేనూ రెండు చూశాను మూర్తీ! ఈమెకు నటన అంటే ఏమిటో తెలియదని నా సందేహం!" అన్నాను ధగధగ మెరిసిపోతున్న డైమండ్ నెక్లెస్‌తో పదేపదే నా కళ్ళకు కన్పిస్తున్న చంచల్ని ఈర్ష్యగా చూస్తూ.

"ష్! నెమ్మదిగా మాట్లాడు. ఆవిడ విన్నదంటే నీతో బాటు నన్నుకూడా తన్ని తరిమేస్తుంది!" అంటూ నవ్వాడు మూర్తి.

"సర్లే! ఏ మాత్రం సంపాదించిందేమిటి? ఈ బంగ్లా సొంతమేనా?"

"అద్దెకొంప. బాంకులో ఏదైనా దాచుకుందో, లేదో తెలియదు. అజంతా మూవీస్ వారి 'దొంగ ఎవరు?' చిత్రంలో తన్ను హీరోయిన్‌గా బుక్ చెయ్యమని కాళ్ళు పట్టుకున్నంత పని చేసిందనుకో! చివరికి ఆఖరు అస్త్రం కూడా ప్రయోగించింది. అయినా నేను సహాయం చెయ్యలేకపోయాను. ప్రొడ్యూసర్‌కి ఈవిడి అంటే ఎలర్జీ. ఈవిడ ఎక్స్‌ట్రాగా కూడా పనికిరాదని, అసలు సినిమా ఫీల్డుకే తగదని ఆయన అభిప్రాయం!" అన్నాడు మూర్తి రెండు సిగరెట్లు ఖర్చుచేసి.

"దొంగ ఎవరు చిత్రంలో యిప్పుడు హీరోయిన్ ఎవరేమిటి?"

"సుప్రియ. నా మొదటి చిత్రం....దాన్ని కూడా ఈ ప్రొడ్యూసరే నిర్మించాడు....దానిలో సైడ్ హీరోయిన్‌గా

వేసింది సుప్రియ. హుషారైన అమ్మాయి. తొందరగా పైకి రాగలదు ఇప్పటిలాగే శ్రమపడితే! ఈ చిత్రం అదే- 'దొంగ ఎవరు' చిత్రం సక్సెస్ అయితే తర్వాత సుప్రియ మనకు అందదు. ఎందుకో తెలుసా?"

"తెలియదు."

"ఈ ఫీల్డు అంతేనోయ్. మనిషి వున్నత శిఖరాలను చేరుకోవాలన్నా, సర్వనాశనం కావాలన్నా ఈ ఫీల్డులో మాత్రం సాధ్యం."

"అదిసరే! చంచల అన్నయ్య ధనపతి సినిమాల్లో వెయ్యటం లేదా?"

"లేదు. ఎవరైనా అడిగినా ఆ ఇంట్రస్ట్ తనకు లేదంటాడు. అతని తెలివితేటలు కూడా అంతంత మాత్రమే! చంచల చెప్పిన పని తప్ప మరొకటి చెయ్యటం అతనికి తెలియదు."

"అతను చంచలకి అన్నయ్య కాదేమో!"

నన్ను ఏప్ మనిషిని చేస్తున్నట్టు చూడసాగాడు మూర్తి. ఇంకా చూస్తూనే వున్నాడు.

"ఏమిట్రా నువ్వు వాగుతున్నది?" అన్నాడు చివరికి.

"మూర్తీ! నీ సినిమా ప్రపంచంతో నాకు సంబంధం లేకున్నా ఈ ఫీల్డు రహస్యాలు నేనూ కొన్ని తెల్సుకొని వున్నాను. ధనపతి-చంచల మీరందరూ అనుకుంటున్నట్టు 'అన్నా-చెల్లెలు' కారని నా నమ్మకం!" అన్నాను.

"నీ బోడి నమ్మకాలు ఎవరిక్కావాలి? నీకు అటువంటి సందేహం ఎందుకు కల్గిందసలు?"

"చంచల వయసు ఎంత వుంటుందంటావ్?"

"ఈ రోజుతో పందొమ్మిది నిండాయని అందరికీ చెప్పు

కున్నది. కొవ్వొత్తుల్ని కూడా సరిగ్గా అన్నే వుంచింది. వాస్తవంలో ఆమెకు పాతిక అయినా వుంటుంది వయసు."

"గుడ్! ఇహపోతే ధనపతి సంగతి తీసుకుందాం. అతనికి ఇరవై సంవత్సరాలు కూడా నిండివుండవు. ఇంకా మీసాలు కూడా సరిగ్గా నలుపు రంగుని సంతరించుకో లేదు. దీన్నిబట్టి నీకు ఏమర్థమైంది?"

కొత్త సిగరెట్ వెలిగించుకున్నాడు మూర్తి. హుషారుగా ఏదో మాట్లాడబోయాడు. కాని, ఇంతలో డిన్నరుకు పిలుపు వచ్చింది.

3

డిన్నరు తీసుకుంటున్నారు అందరూ.

మూర్తి, నేను మాత్రం ఓ బల్లముందు కూర్చున్నాం. అప్పటివరకూ రుచి చూడని పదార్థాలు నా ముందు బల్ల మీదున్నాయ్. అపురావుమని తింటే బావుండదని నాజుగ్గా తింటున్నాను.

"తర్వాత చెప్పవోయ్!" నా కాలు తొక్కాడు మూర్తి.

"ఏముందీ! సినిమా రంగంలో చాలా మంది ఆడవాళ్ళు చేసే పని చంచల కూడా చేసింది. తనకంటే చిన్నవాణ్ణి చేరదీయటం. వాణ్ణి అన్నయ్యగా చెప్పుకొని ప్రపంచానికి పరిచయం చెయ్యటం చాలా మందికి అలవాటు ఈ సినిమా ప్రపంచంలో. దానివలన అలాంటి ఆడవాళ్ళకు రెండు లాభాలు. మొదటిది మగదిక్కు వుంటుంది. రెండవది వయసు ఆటోమేటిక్‌గా తగ్గిపోతుంది. ఎలాగో తెలుసా? ఇపుడు ధనపతిని ఎవడైనా చూస్తే అతనికి రెండు పదుల కంటే ఎక్కువ వయసు వుండదని అనుకుంటారు. అలాంటివ్యక్తికి చెల్లెలు అయిన చంచల వయసు అపుడెంత

వుందొచ్చు? కనీసం రెండు సంవత్సరాలు తక్కువ అనుకో!"

"ఓ మైగాడ్! ఈ ఫీల్డులో ఇన్నాళ్ళుగా వుండీ ఈ రహస్యాన్ని నేనే గ్రహించలేకపోయాను. ఇది నీ కెలా తట్టిందిరా?"

బదులు చెప్పలేదు నేను.

డాన్స్ ప్రోగ్రాం అనివార్య కారణాలవల్ల ఆగిపోయినట్టు, అందుకు తనెంతో చింతిస్తున్నట్టు ఎనౌన్స్ చేసింది చంచల.

అందరూ డిన్నర్ తీసుకోవటం పూర్తయ్యింది అప్పటికే.

చంచల ఎనౌన్స్‌మెంటు ముగిసిన మరుక్షణంలో దీపాలు ఆరిపోయాయి.

"కరెంటు పోయిందేమో!" అన్నారెవరో.

'కెవ్వు'న అరిచిందొక స్త్రీ.

4

నిమిషం కూడా గడవకమునుపే దీపాలు వెలిగాయి.

"నా 'నెక్లెస్ పోయింది! ఇందాక లైట్లు పోయిన సమయంలో ఎవరో లాగేసుకున్నారు. దొంగ వెధవలు" అరుస్తోంది చంచల.

"అందరూ పెద్దమనుషులే! ఎవరిని అనుమానించటం?" చిందులు తొక్కుతున్నాడు చంచల అన్నయ్య ధనపతి.

"పోలీస్ రిపోర్ట్ యివ్వండి! అంతవరకు ఎవ్వరినీ ఈ యిల్లుదాటి వెళ్ళనివ్వకండి!" నేను అప్రయత్నంగా చెప్పేశాను.

"నాన్‌సెన్స్! అవతల మాకు చాలా పనులున్నాయ్! పోలీసులు రావటానికి, అందరినీ చెక్ చెయ్యటానికి చాలా సమయం పడుతుంది" ఓ డిస్ట్రిబ్యూటర్ విసుక్కున్నాడు.

"ఛీ! ఛీ! ఇదేం గోలరా బాబూ!" ఓ హీరో ముద్దుల చెల్లెలు అటుయిటు తిరుగుతోంది.

ఎవరు ఏ విధంగా విసుగును ప్రదర్శించినా; అక్కణ్ణుంచి వెళ్ళడానికి ఎవరికీ ధైర్యం చాల్లేదు. బోసిగా వుంది చంచల మెడ. అదే అందరి బాధా.

ధనపతి పోలీసులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు.

నిమిషాలమీద పోలీసులు వచ్చేశారు.

"మిస్ చంచల ధరించిన నెక్లెస్‌ని ఎవరెవరు చూశారు?" పై కప్పుని చూస్తూ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్. బహుశా ఆ కప్పునే అడిగాడేమో!

"అందరూ చూసే వుంటారు సార్! ఈవేళ మా చెల్లాయ్ పుట్టినరోజు. ఆ సందర్భంగా యిందరిని ఆహ్వానించింది. ఉదయంనుంచి ఆ నెక్లెస్ చెల్లాయ్ మెడలోనే వుంది" అన్నాడు ధనపతి.

"మీరు చంచల అన్నగారా?"

"అవున్సార్! మీకు ఫోన్ చేసింది నేనే. నా పేరు ధనపతి."

ఇన్‌స్పెక్టర్ తలపంకించాడు. "లైట్లు ఆరిపోయిన తర్వాత తిరిగి ఎంతసేపటికి వెలిగాయ్?"

"ఒక్క నిమిషంపాటు చీకటిలో వున్నాం. ఆ నిమిషంలోనే దొంగతనం జరిగింది!" అన్నాడు ధనపతి.

"లైట్లు వచ్చాక ఎవరైనా యిక్కణ్ణుంచి బయటికి వెళ్ళారా?"

"ఈ హాలుదాటి ఎవగూ వెళ్ళలేదు."

"కరెంటుపోయిన ఆ ఒక్క నిమిషంలో దొంగతనం జరిగింది. దొంగతనం జరిగిన మరుక్షణంలో ఆ వ్యక్తి

లైట్లు రాకమునుపే జారుకున్నాడేమో!"

"లేదుసార్! ఆ దొంగ యింకా ఇక్కడే వున్నాడు. లైట్లు పోయిన సమయంలో నేను వీధి వరండాలో వున్నాను. కారు హారన్ విన్పించి అప్పుడే వరండాలోకి వెళ్ళాను. అతిధి ఎవరైనా ఆలస్యంగా వచ్చాడేమోనని. అతన్ని లోనికి తీసుకురావటానికి వెళ్ళాను ఇక్కణ్ణుంచి! నేను వరండాలోకి వెళ్ళేసరికి ఎవరిదో కారు వీధివెంట వెళ్ళిపోయింది తిన్నగా. వెనుదిరిగి ఇంట్లోకి రాబోయాను. ఇంతలో లైట్లు పోయాయి. ఎవరైనా ఆ సమయంలో బయటికి వెళ్ళటానికి ప్రయత్నించి వుంటే నాకు తెల్సేది."

ఇన్‌స్పెక్టర్ చంచల దగ్గరగా వచ్చాడు. "మేడమ్! మీకు ఎవరిమీదైనా అనుమానం వుందా?"

ఏడవలేక నవ్వింది చంచల. "వీళ్ళందరూ నా అతిధులు. ఎవరిని అనుమానించమంటారండీ?"

"ఇట్సాల్‌రైట్! ఆ నెక్లెస్ ఖరీదు చెప్పండి ప్లీజ్!"

"లక్ష రూపాయలు. డైమండ్ నెక్లెస్."

"బిల్లుమీదనే కొన్నారనుకుంటాను....?"

"బిల్లు లేకుండా అంత విలువైన నెక్లెస్ కొనటానికి నేను స్మగ్లింగ్ చెయ్యటంలేదు. బిల్లు వుంది చూపించమంటారా?"

చంచలకి కోపం వచ్చిందని అర్థమైంది ఇన్‌స్పెక్టర్‌కి.

ఇన్‌స్పెక్టర్ చంచల్ని వదిలి, మరొక వ్యక్తిని ప్రశ్నలతో హింసించటం ప్రారంభించాడు.

చివరికి నా వంతు వచ్చింది.

తడుముకోకుండా సమాధానాలిచ్చాను.

నన్నొకసారి ఎగాదిగా చూపి వెనుదిరిగాడు ఇన్స్‌పెక్టర్.

నావి ఖరీదైన దుస్తులు కాకపోవటంతో ఇన్‌స్పెక్టర్‌కి నా మీద సందేహం కల్గిందేమో! అయినా చేసేదిలేక మౌనంగా వుండిపోయాను.

నిలబడున్న అతిథుల మధ్యనుంచి అటు యిటు కాసేపు తిరిగాడు ఇన్‌స్పెక్టర్. "లేడీస్ అండ్ జంటిల్‌మెన్!" తన కంచుకంఠాన్ని విప్పాడు. ''మీ రందరూ మర్యాదస్తులని నాకు తెలుసు. కాని దొంగ మీలోనే వున్నాడు.

దొంగ ఎవరు?

"ఇది తేలటానికి అందరినీ ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. నెక్లెస్ యింకా దొంగవద్దే వుంది. ఆ వ్యక్తి మంచిగా లొంగిపోతే మిగిలినవారికి అతను ఎంతో వుపకారం చేసినవాడు అవుతాడు. దొంగ ఎవరైవున్నా ఆ వ్యక్తి తప్పించుకోవటం అంటూ జరుగదు. దొంగకి ఒక్క నిమిషం టైం యిస్తున్నాను. అతను తనంతట తానే లొంగిపోతాడని ఆశిస్తున్నాను."

గుండు సూది క్రిందపడినా ఆ చప్పుడు అందరికీ విన్పించేలా నిశ్శబ్దం వ్యాపించింది!

ఎవ్వరూ పెదవి విప్పలేదు.

బరువుగా ఊపిరి పీల్చి వదలటానికైనా ఎవరికీ ధైర్యం చాలటంలేదు.

నిమిషం గడిచిపోయింది.

"దొంగ కిచ్చిన సమయం పూర్తి అయ్యింది. దొంగ తప్ప మిగిలిన వాళ్ళందరూ నన్ను క్షమించాలి. అందరినీ సోదా చెయ్యక తప్పదు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"డామిట్! ఆడవాళ్ళను కూడా సోదా చేస్తారా?'' ఓ డాన్సర్ అరిచింది.

"తప్పదు మేడమ్!" మందహాసం చేశాడు ఇన్‌స్పెక్టర్. "కాని, ఆడవాళ్ళను సోదా చెయ్యటానికి ఆడపోలీసుల్ని పిలిపిస్తాం. దయచేసి ఎక్కడివాళ్ళు అక్కడే నిలబడండి!"

డాన్వర్ నోరు అంతటితో మూతపడింది.

క్షణాల్లో ఆడ పోలీసులు వచ్చేశారు.

అప్పటికే ఇన్‌స్పెక్టర్ మగవాళ్ళను ఐదుగుర్ని సోదా చేసి, నా వద్దకొచ్చాడు. ఇన్‌స్పెక్టర్ చూపులన్నీ మొదటి నుంచీ నా పైనే వున్నాయ్. నన్ను సోదా చెయ్యటం పూర్తయ్యింది. ఇన్‌స్పెక్టర్‌కి చాలా ఆశాభంగం కలిగినట్టు అతని ముఖంలో మారిన రంగునుబట్టి గ్రహించాను.

ఆడ పోలీసులు అక్కడున్న స్త్రీల నందరినీ సోదా చేశారు-చంచలను తప్ప.

ఫలితం లేకపోయింది.

ఆడపోలీసులతోబాటు మగ పోలీసులు కూడా బిక్క మొహాలువేసి నిలబడిపోయారు.

"మరొకసారి సోదా చేస్తాం. దయచేసి అందరూ సహకరించండి...." అంటున్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇహ నేను ఊరుకోలేకపోయాను. "అవసరంలేదు ఇన్‌స్పెక్టర్! నెక్లెస్ ఎక్కడున్నదో నేను చెప్పగలను" అన్నాను.

అందరి చూపులూ నా మీద పడ్డాయ్.

"చెప్పండి! ఎక్కడుంది నెక్లెస్? దొంగ ఎవరు?" అంటూ నా ముందు కొచ్చాడు ఇన్‌స్పెక్టర్.

"దొంగ మరెవరో కాదు. చంచల. నెక్లెస్ ఆమె వద్దే వుండివుండాలి!" అనేశాను. నా హేతువాదనా శక్తి మీద నాకు నమ్మకం వుంది మరి!

"ఫూల్! నీకేమైనా మతిపోయిందా? నా నెక్లెస్‌ని నేనే దొంగలిస్తానా?" అరిచింది చంచల.

"ఇతనికి మతి చలించివుండాలి సార్!" అంటూ ఇన్‌స్పెక్టర్ ప్రక్కకొచ్చి నిల్చున్నాడు ధనపతి.

"దయచేసి అందరూ కాసేపు మౌనంగా వుండండి!" అని ఇన్‌స్పెక్టర్ నా వైపు తలతిప్పాడు. "మిస్ చంచల తన నెక్లెస్‌ని తనే దొంగలించిందని మీరెలా చెప్పగలరు?"

"హేతువాదనా శక్తితో. ఇన్‌స్పెక్టర్! ఆ కిటికీ గుండా చూస్తే ఈ ఇంటి కటువైపు నున్న ఇంట్లోని దీపాలు వెలుగుతుండటం కన్పిస్తోంది. ఈ కిటికీ గుండా చూస్తే ఇటువైపున్న ఇంట్లోని దీపాల పరిస్థితి కూడా తెలుస్తోంది. కరెంటు ఫెయిల్ అయిన సమయంలో నేను ఈ విషయం బాగా గమనించాను. ఈ ఇంట్లో మాత్రమే లైట్లు పోయాయి. ఆ సమయంలో ఈ యింటికి యిరుప్రక్కలా నున్న యిళ్ళలో దీపాలు వెలుగుతూనే వున్నాయ్.

ఈ యింటికి మాత్రమే కరెంటు సప్లయ్ ఒక్కనిముషం పాటు ఆగిపోయి వుండదు. ఎవరో కావాలని లైట్లు ఆర్పి వుండాలి! ఆ పని ఎవరయినా ఎందుకు చేస్తారు?

ఆవ్యక్తి దొంగతనం చెయ్యాలని ముందే ప్లాన్ వేసుకొని, లైట్లుతీసేసి ఉండాలనుకున్నాను. మెయిన్ ఆఫ్ చేసినా; నిముషంలో నెక్లెస్ కాజేసి, మళ్ళీవెళ్ళి మెయిన్ ఆన్ చెయ్యటం సాధ్యంకాదు. మెయిన్ వరండాలోవుంది.

దీన్నిబట్టి నా కర్థమయ్యిందేమిటంటే ఒకరు మెయిన్ ఆఫ్‌చేసి వుండాలని, మరొకరు దొంగతనం చేసివుండాలని. అటువంటి అవకాశం చంచలకు, ధనపతి మాత్రమేవుంది. ధనపతి మెయిన్ ఆఫ్‌చేసి వుండొచ్చు. చీకట్లో చంచల

తన డ్యూటీ తాను చేసివుంటుంది. నా అనుమానం నిజమైతే చంచల తన దుస్తుల్లోనే ఆ నెక్లెస్ ఎక్కడో దాచుకొని వుంటుంది!" అని మౌనం వహించాను.

ఆడపోలీసులు చంచల్ని సమీపించారు.

టక్కున తలదించేసుకుంది చంచల. ఆడపోలీసులకు ఆమె లంగాజేబులో నెక్లెస్ చిక్కిందట చివరికి.

చంచల్ని అందరి యెదుటా సోదా చెయ్యలేదు మరి! ఆడపోలీసులు ప్రక్కగదిలోకి ఆడవాళ్ళందరినీ తీసుకెళ్ళి సోదాచేసిన విధంగానే చంచల్నికూడా తీసుకెళ్ళి సోదా చేశారు. తిరిగొచ్చి ఇన్‌స్పెక్టర్ చేతికి ఆడపోలీసులు నెక్లెస్ ఇస్తూ విషయం చెపుతుంటే అందరమూ విన్నాం.

ధనపతి ఎవరిముఖంలోకి చూళ్ళేక తలదించుకుని నిలబడున్నాడు.

నా భుజం తట్టాడు ఇన్‌స్పెక్టర్. "మిస్టర్! నీ సహాయానికి థాంక్స్. కానీ, తను అటువంటిపని యెందుకు చేసిందో చంచల చెప్పటం లేదు. ఇదికూడా నువ్వేచెప్పు" అన్నాడు.

"ఇన్సూరెన్సు కంపెనీ వాళ్ళను మోసగించటానికి చేసివుంటుంది. ప్రస్తుతం చంచల మార్కెట్ సరిగా లేదని నాఫ్రెండ్ డైరెక్టర్ దక్షిణామూర్తి చెప్పాడు. అంతటి విలువగల నగను ఇన్సూర్ చేయకుండా ఎవరూ దగ్గరుంచుకోరు" అన్నాను.

నేను చెప్పింది నిజమేనని తరువాత తేలింది.

అటుతర్వాత అక్కడున్న అతిధులు నాతో కరచాలనం చేసి....చేసి....చివరికి నా కుడిచేయి చచ్చుబడేలా పుణ్యం కట్టుకున్నారు. □□□

లక్షకొక వెయ్యి!

కె. బి. ఎస్. కుమార్

అద్దంముందు నిలబడింది అనూరాధ. తన ప్రతిబింబాన్ని మరోసారి చూసుకుంది. సంతృప్తిగా నిట్టూర్చి మృదువుగా పవుడర్ రాసుకొని ముంగురులు సవరించుకొని పుస్తకాలు తీసుకుని లేడిపిల్లలా మెట్లుదిగి వచ్చింది.

"డాడీ.... నేను కాలేజీ కెడుతున్నా" అంది. ఆమెది కోయిల కంఠం.

"అలాగేనమ్మా" అన్నాడు ప్రసాదరావు చిరునవ్వుతో.

నాలుగడుగులు వేసి మళ్ళీ వెనక్కొచ్చింది.

"డాడీ ...సాయంత్రం మా ఫ్రెండ్సందరూ సరదాగా పిక్నిక్కెడుతున్నారు. నన్నూ రమ్మన్నారు"....అంది గోముగా.

"అలాగే వెళ్ళిరామ్మా" అన్నాడు ప్రసాదరావు ఆప్యాయంగా.

"నాకో రెండొందలు కావాలి డాడీ!" మరింత గారాలు పోయింది అనూరాధ.

"బీరువాలో వున్నాయ్. వెళ్ళి తీసుకోమ్మా." తాళం చెవులగుత్తి తీసి యిచ్చాడు.

"స్వీట్ డాడీ!" ప్రసాదరావు నుదిటిమీద గట్టిగా ముద్దు పెట్టుకొని కీబంచ్ తీసుకుని బీరువావద్దకు నడిచింది. రెండు వందలు జాకెట్లో దోపుకుంది. బీరువా మూసేసి, కీస్ ప్రసాదరావు చేతికిచ్చి కుందేలు పిల్లలా పరుగుతీసింది.

"పిచ్చిపిల్ల...." అనుకున్నాడు ప్రసాదరావు.

ప్రసాదరావు లక్షాధికారి. అనూరాధ అతనికి ఏకైక సంతానం.

ప్రసాదరావు భార్య ఆదిలక్ష్మి గర్భవతిగా తొమ్మిదో మాసం మోస్తుండగా ప్రసాదరావుకు విపరీతమైన జబ్బు చేసింది. ఎంతమంది కొమ్ములుతిరిగిన డాక్టర్లు ప్రయత్నించినా లాభంలేక పోయింది. దైవానుగ్రహమో లేక అనూరాధ పుట్టిన వేళావిశేషమోగాని ఆమె భూమ్మీదపడ్డ మరురోజునుండే అతను కోలుకోసాగాడు. అతని ఆరోగ్యం దినదినాభివృద్ధిచెంది రెణ్నెల్లు తిరక్కముందే ప్రసాదరావు సంపూర్ణారోగ్యవంతు డయ్యాడు.

అందుకనే అతనికి కూతురంటే ఎనలేని ప్రేమ. అనూరాధకి చీమకుడితే తనకి తేలుకుట్టినంత బాధపడి పోతాడు ప్రసాదరావు.

2

"నీకోకిల కంఠం, నెమలి రూపం తల్చుకుంటే నాకు రాత్రిళ్ళు నిద్రకూడా రావడంలేదు అనూ డార్లింగ్!" మత్తుగా ఆమెవేపు చూశాడు ప్రదీప్.

కిలకిలా నవ్వింది అనూరాధ.

"అదిగో. ఆ నవ్వే వద్దంటున్నాను. నీ ప్రతి చేష్టతో నన్ను రోజురోజుకీ పిచ్చివాణ్ని చేస్తున్నావ్."

"బిచ్చగాణ్ని మాత్రం చెయ్యనులే...." అనూరాధ పెదవులపై అదేనవ్వు!!

"నువ్వు చెయ్యకముందే అయిపోయాను. ప్రేమ బిచ్చగాడిని" అన్నాడు ప్రదీప్. ఆమెను రెప్పవేయకుండా చూస్తూ.

"ఏమిటి అలా చూస్తున్నావ్?"

"రోజురోజుకీ కొత్తపుంతలు తొక్కుతున్న నీ అందం నన్ను స్వర్గంలోకి తీసుకువెడుతోంది. ఆ అందాన్ని ఆస్వాదించటం తప్ప మరేదీ చెయ్యలేక పోతున్నాను."

"ఉద్యోగం ఏదేనా సంపాదించుకో. మా నాన్నకి అల్లుడివౌతావ్."

"ఈ పేదవాడు నీకు భర్తకాగలడా?"

"నా సుఖాన్ని మానాన్న ఎప్పుడూ కాంక్షిస్తాడు. నీకు ఉద్యోగం దొరికితే నన్ను పోషించగలవనే నమ్మకం ఆయనక్కలుగుతుంది."

"అదేదో మీనాన్ననే అడగలేక పోయావ్?"

"ఉద్యోగం స్వయంగా సంపాదించలేని వాడివి పెళ్ళాన్నెలా పోషిస్తావ్! అంటాడు మానాన్న. ఆ మాటడిగితే నీమొహంకూడ చూడడు."

"ఇంత స్ట్రిక్టుగావుండే మీనాన్నని చూడాలనుంది."

"మా నాన్నెక్కడికి పోడు. ముందు నువ్వు జాబ్ వెతుక్కో!"

"అలాగే. నీకోసం నేనేమైనా చేస్తాను."

"పద అయితే...." ఇద్దరూ పార్కు నుండి బయట పడ్డారు.

ప్రదీప్ బి. యస్సీ. ఆ సంవత్సరమే పాసయ్యాడు. తనంటే పడిచస్తాడు. తనులేకుండా బ్రతకలేనంటాడు. తను తనదికాదని తెలిస్తే నిజంగానే బ్రతకడేమో....

అనూరాధ బి. యస్సీ. ఫస్టియర్ చదువుతోంది. వయసుని మించిన ఆలోచనలూ తెలివితేటలూ ఆమెకున్నాయి. సెక్స్. సైన్సును గురించి ఆమెకి ఎన్నో విషయాలు తెలుసు. యివన్నీ ఆమె ఎన్నో పుస్తకాలు చదివి తెల్సుకుంది. ప్రసాదరావు కూడ ఆమెనిలాంటి విషయాల్లో అభ్యంతరం పెట్టక కావలసినంత స్వేచ్ఛనిచ్చాడు.

ఆ స్వేచ్ఛని దుర్వినియోగం చెయ్యలేదు అనూరాధ. తనగురించి అన్నీ తెలిసిన తను ప్రదీప్‌ని కూడ ఎంతలో వుంచాలో అంతలోనే వుంచింది.

స్నేహంవేరు. ప్రేమవేరు. పెళ్ళివేరు. ఇవి మూడూ ఒకదాని తర్వాత ఒకటి పెనవేసుకుపోవాలి. శారీరక సంబంధం వున్నంత మాత్రాన పెళ్ళి అవ్వించుకోదు. ప్రేమించేప్పుడు ఆ సంబంధంవుంటే అది నిజమైన ప్రేమ కాదు. ఇదీ ఆమె సిద్ధాంతం.

కాలేజీలో ప్రదీప్ పరిచయమయ్యాడు. తన స్నేహం కోరాడు. స్నేహం చేసింది. స్నేహం చేస్తున్నాననుకుంటూనే ప్రేమించేసింది. అతన్ని ఎన్నోరకాలుగా పరీక్షించింది. ఒక్కడబ్బులో తప్ప అతడు అన్నిట్లో గెలుపొందాడు.

అందుకే అతన్ని చేసుకోవాలని తీర్మానించుకుంది.

3

పేవ్‌మెంట్ మీద నడుస్తున్నాడు ప్రదీప్.

అతని మనసు అల్లకల్లోలంగా వుంది. తన చదువిక ముందుకి సాగదు. బియస్సీ పూర్తి చెయ్యటానికే ఎన్నో అగచాట్లు పడాల్సొచ్చింది. ఇంకా పెళ్ళికావాల్సిన చెల్లెళ్ళు యిద్దరున్నారు.

'వరకట్నం వద్దనండి' అని ప్రచారం చేస్తున్నారు. తనకి కట్నం పేరిట ఆడపిల్లకి అమ్ముడు బోవడమంటే తగని అసహ్యం.

కాని. ఈ రోజుల్లో ఆడపిల్లల్ని కట్నంలేకుండా చేసుకోడానికి ఎందరు ముందుకొస్తున్నారు? అలా చేసుకునే వనైతే 'డౌరీ' లేకుండా చేసుకోడానికి తనూ సిద్ధమే!

తన ఆశయాన్ని నెరవేర్చుకోటంకోసం యిద్దరు ఆడపిల్లల జీవితాలు బలిచెయ్యడం అతనికిష్టంలేదు.

అనూరాధకి డబ్బూ అందంతోపాటు మంచి హృదయం కూడ వుంది. మొదట డబ్బుకోసమే అనూరాధని ప్రేమించాడు తను. కాని ఆమె నిర్మలమైన ప్రేమ తనని మార్చేసింది. లక్షాధికారి కూతురైనా తనని ప్రేమించిందంటే ఆమె మనసు ఎంత గొప్పదై వుండాలి?

ఎలాగైనా వుద్యోగం సంపాదించాలి. వాళ్ళ నాన్నని కలవాలి. అనూరాధని చేసుకోవాలి. వీలైతే తన చెల్లెళ్ళ పెళ్లిళ్ళు కూడ తన పెళ్ళితోబాటే జరిపించేసెయ్యాలి.

ఆలోచిస్తూనే ఆ రోజు దినపత్రిక కొన్నాడు ప్రదీప్.

వాంటెడ్ కాలమ్స్ చూస్తోన్న అతని కళ్ళు మెరిశాయ్. రాయల్ కంపెనీవారు గుమస్తాలు కావాలని ప్రకటించారు.

ఉత్సాహంతో అక్కడేవున్న కిళ్ళీ కొట్టులో వైట్

పేపరు కొన్నాడు. అప్లికేషన్ రాసుకొని సిటీ బస్సెక్కాడు.

పోస్టులు ఎన్నున్నాయో కాని వందమందికి పైగా వున్నారు అప్పటికే. తనవంతు వచ్చేవరకూ ఓపిగ్గా కాచు క్కూర్చున్నాడు.

తనపేరు పిల్చేసరికి గుబగుబలాడుతోన్న గుండెలతో లోపలికి అడుగు పెట్టాడు.

ఇంటర్వ్యూచేసే అధికారి ప్రదీప్‌ని చూడగానే చిన్నగా నవ్వాడు. 'నువ్వొస్తావని నాకుతెల్సు' అన్నట్టుగా వుంది అతని నవ్వు.

"నమస్కారం సార్...." అన్నాడు నమ్రతగా.

"ఇప్పుడు నువ్వన్న ఆ మాటలో రెండు దాగివున్నాయి. ఒకటి మస్కా. రెండోది కారం. ఏది కొట్టాలనుకుంటు న్నావ్?" నవ్వుతోనే అడిగాడు అధికారి.

ఆశ్చర్యపోయాడు ప్రదీప్. అధికారులు యింత ఆద రంగా యింత చనువుగా వుంటారని అతనెన్నడూ అనుకోలేదు.

"అబ్బే? అలాంటిదేదీ లేదుసార్...." అన్నాడు తడ బడుతూ.

"కూర్చో...."

"ఫర్వాలేదు."

"నేనూ అదే అంటున్నాను. కూర్చో."

ముడుచుకున్నట్లుగా కూర్చున్నాడు.

ఆ తర్వాత ఏవో రెండు మూడు ప్రశ్నలడిగాడు. సమాధానాలు చెప్పాడు ప్రదీప్.

"వెరీగుడ్. నిన్ను ఎప్పాయింట్ చేసుకుంటున్నాను.

నెలకి నాలుగువందలు జీతం. అప్పుడప్పుడూ నేను చెప్పిన పనులు చేస్తుండాలి. అలా చెయ్యగలిగితే పనినిబట్టి పది వేలకి తగ్గకుండా యిస్తుంటాను. నెలజీతం మామూలుగా వుంటుంది...."

ఉబ్బితబ్బిబ్బై పోయాడు ప్రదీప్. ఆనందంతో అతని హృదయం పరవళ్ళు తొక్కింది. ఎన్ని జన్మలెత్తినా తను యిలాంటి వుద్యోగం సంపాదించలేడు. డబ్బులో మునిగి తేలవచ్చు. చెల్లెండ్ల పెండ్లిండ్లు ఘనంగా చెయ్యొచ్చు.

"ఏం... సమ్మతమేనా?" అధికారి కంఠం గంభీరంగా ధ్వనించింది.

"సమ్మతమే సార్...." అన్నాడు ప్రదీప్. ఆనందంతో అతని కంఠం వణికింది.

"వెరీ గుడ్. ఈ కార్డు తీసుకో. సాయంత్రం ఆరు గంటలకి ఈ అడ్రస్‌వద్ద కల్సుకో. ఏం చెయ్యాల్సిందీ. అక్కడ చెబుతాను" చేతిలో విజిటింగ్ కార్డు పెట్టాడు.

తలూపుతూ తీసుకున్నాడు ప్రదీప్.

4

"చెప్పండి...." గుండెల నిండా పొగపీల్చి వదుల్తూ ప్రశ్నించాడు డిటెక్టివ్ జలంధర్.

"మీరు నాకో సహాయం చెయ్యాలి."

"ఏమిటది?"

"నాకు చాలా ఆస్తివుంది, ఒక్కతే కూతురు. చాల గారాబంగా పెంచాను. ఆమె ఓ పేదవాణ్ణి ప్రేమిస్తోంది. అభ్యంతరం చెబితే ఆమె బాధపడుతుంది. కూతురు కన్నీరు నేను చూడలేను. అందుకే అతడు పేదవాడయినా అంగీకారం తెలియజెయ్యటానికి సిద్ధంగావున్నాను.

అయితే అతను నా బిడ్డను నిజంగా ప్రేమిస్తున్నాడా? లేక నా ఆస్తిని కాజెయ్యాలని ఎత్తువేశాడా?.... ఈమాత్రం తెల్సుకుంటే చాలు. మీ ఫీజు విషయంలో లోటు రానివ్వను" చెప్పాడు ప్రసాదరావు.

"మీ అమ్మాయి గురించీ ఆ అబ్బాయి గురించీ చెప్పండి."

"మా అమ్మాయి పేరు అనూరాధ. బి. యస్సీ ఫస్టియర్ చదువుతోంది. అతని పేరు ప్రదీప్ అని మా అమ్మాయి తన పుస్తకాల్లో అక్కడక్కడ అందంగా రాసు కున్నదాన్ని బట్టి గ్రహించాను. అతనీ సంవత్సరమే బి.యస్సీ పూర్తి చేశాడు."

"అతనెలా వుంటాడు?"

"సారీ.... అతన్ని నే చూడలేదు."

"అతని ఫొటో అయినా చూడకుండా అతన్నెలా కల్సు కోవడం? బై దిబై అతను మీ అమ్మాయికి లౌలెటర్స్ వగైరా ఏవైనా రాసినట్టు మీకు తెల్సా?"

"తెలీదు. నా కూతురు సామాన్యంగా అలాంటివి 'ఎలౌ' చెయ్యదు."

"మీ ఇంట్లో ఎవరెవరుంటారు?"

"నేను. మా అమ్మాయి. మేనేజర్ సాంబశివరావు. నౌకరుసోమన్న. సాంబశివరావు డ్యూటీ కాగానే వెళ్ళి పోతాడు."

"మీరు లేనప్పుడు మీ యింటికి ప్రదీప్ వచ్చివుండొచ్చు మేనేజరుగాని నౌకరుగాని చూసుండొచ్చు. వార్ని కను క్కున్నారా?"

"లేదు. అతనెప్పుడూ మా యింటికి రాలేదని రూఢిగా

చెప్పగలను."

"ఆల్‌రైట్. అయ్ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్."

"థాంక్యూ .... అడ్వాన్సుగా యిది వుంచుకోండి" వెయ్యిరూపాయలూ తన విజిటింగ్ కార్డూ బల్లపై పెట్టాడు ప్రసాదరావు.

"నేనివ్వాళ వ్యాపారనిమిత్తం వూరువెడుతున్నాను. రెండుమూడు రోజుల్లోగా వచ్చేస్తాను. ఈలోగా కనుక్కోటానికి ప్రయత్నించండి. సెలవు" అని చెప్పి వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

5

ప్రదీప్ ఆలోచిస్తున్నాడు.

సాయంత్రం ఆరుగంటలకి జరిగిన విషయాలు అతని బుర్రలో బొంగరంలా తిరగసాగాయి.

చెప్పిన టైమ్‌కి సరిగా వెళ్ళాడు తను. ఇంటర్వ్యూ చేసిన అధికారి-బాస్ కొన్ని విషయాలు చెప్పాడు.

హైదరాబాదు నుండి ఢిల్లీరోడ్డులో హైదరాబాదుకి వంద కిలోమీటర్ల దూరంలో తను వెయిట్ చూస్తూండాలి.

ఓ వ్యక్తి సరిగ్గా 10 గంటలకి థండర్‌బర్డ్ కారులో వెడుతూంటాడు. అతన్ని ఆపు చెయ్యాలి. అతని దగ్గర ఓ బ్రీఫ్‌కేసు వుంటుంది. అతన్నుండి బలవంతంగా ఆఖరుకి ప్రాణాలు తీసైనా సరే—ఆ బ్రీఫ్‌కేసును పట్టుకురావాలి.

అందులో తమ ఆఫీసుకి చెందిన కొన్ని ముఖ్యమైన ఫైళ్ళ తాలూకు డూప్లికేట్లు వున్నాయిట. వాటిని సంపాదించగలిగితే మొత్తం పదివేలు చేతిలో పడతాయి.

ఆ వ్యక్తి ఎవరు? తమ ఆఫీసు డూప్లికేటు ఫైళ్ళు అతనెలా సంపాదించాడు? అతను వాటిని ఎక్కడికి తీసుకు

పోతాడు? వాటితో ఏంచేస్తాడు.

తమ ఆఫీసులో అవకతవకలు జరుగుతున్నాయా? వాటి నతడు ప్రభుత్వాని కప్పగించబోతున్నాడా?

ఆ వ్యక్తిని హత్యచేసైనా సరే-ఆ సూట్ కేసు తేవా లన్నాడు బాస్. అంతే కాదు. మూడునెలల జీతంతోపాటూ రెండు నెలల చెక్కు కూడా యిచ్చాడు.

హత్యచెయ్యడమెలా? ఆ పేరు తల్చుకుంటేనే భయ మేస్తోంది తనకి. చెప్పిన పని చేసుకురాకపోతే వుద్యోగం వూడుతుంది. వచ్చింది కాస్త పిట్టలా ఎగిరిపోతుంది. తన కలలన్నీ కూకటివేళ్ళతో సహా కూలిపోతాయి. చెల్లెళ్ళ పెళ్ళి చెయ్యలేడు. అనూరాధని చేసుకోలేడు.

ఆ సూట్ కేసు సంపాదించగలిగితే పదివేలు చేతికొస్తాయి. తన రంగుల కలలన్నీ నిజమవుతాయి.

హత్య చెయ్యడం నేరం... మరి తమ ఆఫీసు ఫైళ్ళని రహస్యంగా కాజేసి, వాటికి డూప్లికేట్లు తయారుచేసి ఏదో చెయ్యబోవటం మాత్రం నేరం కాదూ!

నేరాన్ని నేరంతోనే ఛేదించాలి....

కాసేపు మనసులో తర్జనభర్జనలు జరిపి ఓ దృఢ నిశ్చ యంతో బయటకు నడిచాడు ప్రదీప్.

6

ఉదయం 10 గంటలకి ఫోన్ మోగింది. రిసీవరెత్తాడు డిటెక్టివ్ జలంధర్.

"హలో....ఎవరు? జలంధర్ గారేనా?"

"అవును. మీరెవరు?"

"మా నాన్నని....ఎవరో ఘోరంగా హత్యచేసారు సార్?" ఆమె ఏడుస్తోంది.

"ఎవరు మీరు అడ్రస్ చెప్పండి."

"నా పేరు అనూరాధ వ్రాసుకోండి" ఏడుస్తూనే చెప్పింది.

"ఇప్పుడే వస్తున్నాను" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. డాడ్జిలో కూచుని స్టార్ట్ చేశాడు.

తనకి వెనకగా దాదాపు పాతిక గజాల దూరంలో మరో కారు వస్తోంది. ఆ విషయం జలంధర్‌కి తెల్సు!!

జలంధర్ వెళ్ళేసరికి అనూరాధ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఎలా జరిగింది?" అంటూ ప్రవేశించాడు డిటెక్టివ్ జలంధర్.

"మా నాన్న దారుణంగా హత్య చెయ్యబడ్డారు. ఇవ్వాళ పత్రికలో వచ్చింది. ఎలా జరిగింది? మా డాడీకి శత్రువు లెవరున్నారు! ఇంత దారుణంగా చంపడానికి వాళ్ళకి చేతు లెలా వచ్చాయ్?" అంటూ పిచ్చిదానిలా రోదిస్తోంది అనూరాధ.

పేపరు తీసుకొని చదివాడు జలంధర్.

"హైదరాబాదునుండి ఢిల్లీ రోడ్‌లో హైదరాబాదుకి దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో థండర్ బర్డ్ కారులో వెడుతోన్న ఓ నడి వయస్కుడు దారుణంగా హత్య చెయ్యబడ్డాడు. గుర్తు పట్టడానికి వీల్లేకుండా అతని ముఖాన్ని కత్తితో చెక్కేశారు.

హత్య గతరాత్రి పదీ అయిదు నిముషాలకి జరిగి వుండొచ్చని అంచనా. శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టమ్‌కి పంపారు. హతుడు జేబులోని విజిటింగ్ కార్డునిబట్టి అతని పేరు ప్రసాదరావని, బిజినెస్ చేస్తున్నారని తేలింది. వ్రేలిముద్రలు పడకుండా హంత

కుడు జాగ్రత్తతీసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు....”

ఇదీ పత్రికలోని సారాంశం.

మరోసారి భోరుమంది అనూరాధ. మేనేజర్ సాంబశివరావు ఆమెని ఓదారుస్తూ చెమ్మగిల్లిన కళ్ళని తుడుచుకుంటున్నాడు.

నౌకరు సోమన్న కాస్తదూరంలో నిలబడి నోట్లో టవలు కొసకుక్కుకుని విలపిస్తోన్నాడు.

“వీరెవరు?” అన్నాడు జలంధర్ అనూరాధని చూస్తూ.

“నా పేరు సాంబశివరావు సార్. ప్రసాదరావుగారి మేనేజర్ని” తన్నుతాను పరిచయం చేసుకున్నాడు.

“ఎంతకాలంగా పనిచేస్తున్నారిక్కడ?”

“దాదాపు పదేళ్ళయింది.”

“ప్రసాదరావుగారు నిన్నరాత్రి ఎక్కడికి వెళ్ళారో మీకు తెల్సా?”

“తెలీదు.”

“మీరు మేనేజర్ కదా! మీతో చెప్పలేదా?”

“ఆయన వెళ్ళేప్పుడు ఏదీ చెప్పరు. వచ్చాక అన్నీ వివరిస్తారు.”

“గతరాత్రి తొమ్మిదిన్నర-పదిగంటల మధ్య మీరెక్కడున్నారు?”

“ప్రసాదరావు సంతకాలు చెయ్యాల్సిన పేపర్లు టైపు చేస్తూ ఆఫీసులో వున్నాను.”

“మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను” ఖంగున మోగింది డిటెక్టివ్ జలంధర్ కంఠం.

“ఆ!?” సాంబశివరావు విశ్చేష్టుడైపోయాడు. అనూరాధ వులిక్కిపడి జలంధర్ కేసి చూసింది.

సాంబశివరావు ఆశ్చర్యంనుండి తేరుకోకముందే యిన్స్పెక్టర్ చక్రవర్తి రావటం, అతని చేతులకి సంకెళ్ళు వెయ్యటం జరిగిపోయాయి.

"రాయల్ కంపెనీ అనే పేరుతోవున్న మరో కంపెనీకి ప్రొప్రైటరువయ్యావు. ప్రదీప్ ఉద్యోగం గురించి ఆలమ టిస్తున్నాడని అతనికి ఉద్యోగం యిచ్చి ప్రసాదరావుపై అబద్ధాలు చెప్పావు.

పదిలక్షలతో బైలుదేరిన ప్రసాదరావుని ప్రదీప్తోనే చంపించాలని ఎత్తు వేశావు. ఆతనికి లక్షకాక వెయ్యి చొప్పున పదివేలు ఆశచూపావు.

కాని, అతను నా వద్దకువచ్చి చెప్పి తను యిరుక్కో కుండా కాపాడమని అర్థించాడు. ఇద్దరం హైదరాబాదు పొలిమేరలు దాటుతోన్న ప్రసాదరావుని కలుసుకొని అన్ని విషయాలూ చెప్పాం. ప్రసాదరావు, అనూరాధ తండ్రని తెలిసిన ప్రదీప్ ఆశ్చర్యపోయాడు.

"ప్రసాదరావు దగ్గర డబ్బున్న సూట్కేసుని తీసుకొని ప్రదీప్కిచ్చాడు. ప్రసాదరావుని హత్యచేశానని చెప్పాడు. నువ్వు సంతోషించి లోపలికివెళ్ళి ఆ సూట్కేసులోంచే ఎనిమిదివేలు తీసియిచ్చావ్. ఆ నెంబర్లూ, ఈ నెంబర్లూ సరిపోయాయ్.

ప్రదీప్కిచ్చిన రెండువేల చెక్కుపై 'ఎస్సెస్ రావ్' అని సంతకం చేశావ్. ఆ సంతకంలోని అక్షరాలు నీ సంతకంతో సరిపోతాయ్. ఇవి చాలు నిన్ను నేరస్తుడిగా పట్టిచ్చేందుకు...."

"జలంధర్గారూ! అయితే మా నాన్న...."

"చనిపోలేదు. పత్రికల వాళ్ళతో మాట్లాడి ఆ ఏర్పాటు చేయించాను. అసలు వార్త సాంబశివరావు ఫోటోతోసహా

రేపటి పేపర్లో వస్తుంది. ప్రసాదరావ్‌గారూ!" పిల్చాడు డిటెక్టివ్ జలంధర్.

అప్పటిదాకా బయట జీప్‌లో కూర్చున్న ప్రసాదరావు. ప్రదీపూ ప్రవేశించారు.

"డాడీ....!" సంతోషంతో తండ్రిని కౌగలించుకుంది అనూరాధ.

"డిటెక్టివ్‌గారూ! మీ మేలు ఈ జన్మలో మరువలేను. ఎంతిచ్చినా మీ ఋణం తీర్చుకోలేను. నా ప్రాణం కాపాడారు" అన్నాడు ప్రసాదరావు, కృతజ్ఞతగా.

"ఈ కేసు తేలిగ్గా విడిపోయింది. ఇందులో నేను శ్రమపడిందేమీలేదు. మిమ్మల్ని కాపాడింది ఒక విధంగా ప్రదీప్. అతని మనసు డబ్బుపైకి మొగ్గివుంటే పర్యవసానం మరోలావుండేది. ఇంకే అభ్యంతరం లేకుండా అతన్ని మీ అల్లుడిగా చేసుకోండి...." అన్నాడు జలంధర్.

ఆప్యాయంగా ప్రదీప్‌వేపు చూశాడు ప్రసాదరావు.

ప్రేమగా అనూరాధవేపు చూశాడు ప్రదీప్.

సిగ్గుతో అనూరాధ బుగ్గలు అరుణిమదాల్చాయి! □□□

గుండెలో రైళ్ళు—??

రైల్వే డాక్టరు దగ్గరికి ఒక రైల్వే ఉద్యోగి వచ్చి "డాక్టర్ గారూ, నాకు ఎప్పుడు గుండెల్లో రైళ్ళు పరిగెత్తినట్లుగా వుంటున్నది," అన్నాడు.

"ఐతే, మీ ఎదురుగా ఎప్పుడూ ఎఱ్ఱ జండా వుంచుకోండి," వెంటనే సలహా చెప్పాడు డాక్టరు.

—ఎమ్. మంజురాణి, హైద్రాబాదు.

ఆ టు క ట్టు!!

ఎస్. గీతారాణి

అప్పుడే హాస్పటల్‌లో డ్యూటీ ముగించుకొని వచ్చిన నన్ను చూపి తెల్లబోయింది అమ్మ.

"చెల్లాయ్ ఏదమ్మా? ఎక్కడా కనిపించటంలేదు?" చిరాకుగా అంటూ షర్ట్ బటన్స్ విప్పుకోసాగాను.

"శ్యామ్. నీకు ఆక్సిడెంట్ కాలేదా?"

అమ్మ ప్రశ్నకు ఫక్కున నవ్వాను.

"ఏం ప్రశ్న అమ్మా ఇది. ఆక్సిడెంట్ అయితే ఇలా నీ ఎదురుగా ఎందుకుంటాను. హాస్పటల్‌లో వుండేవాడిని కదా" అని మళ్ళీ తిరిగి నవ్వాను.

"అయితే అతను ఎందుకలా చెప్పాడు. శాంతిని ఎందుకు తీసుకు వెళ్ళాడు?" అంది అమ్మ అయోమయంగా. ఉలిక్కిపడ్డాను నేను.

"ఏ వ్యక్తి? అతను శాంతిని తీసుకు వెళ్ళటం ఏమిటి. వివరంగా చెప్పమ్మా."

కలవరంగా ప్రశ్నించాను నేను.

"నేను బాత్‌రూమ్‌లో వున్నాను. అంతలో 'శాంతి గారూ!' అంటూ ఎవరో పిలిచారు. శాంతి బయటకి వెళ్ళింది. వెళ్ళినది మరో ఐదు నిముషాలకు లోపలకి వచ్చింది. బాత్‌రూమ్ దగ్గర నిలబడి-

"అమ్మా డాక్టర్ వినయ్‌భూషణ్‌గారి కారు, అన్నయ్య స్కూటర్ గుద్దు కొన్నాయట. ఆయన కొద్దిగా తాగి వుండటంతో ఈ ఆక్సిడెంట్ జరిగిందట. అన్నయ్యకి దెబ్బలు తగిలాయట. ఆయన హాస్పటల్‌లోనే వున్నాడట అన్నయ్య. స్వయంగా ఆయనే వచ్చారు. నేను ఆయనతో వెళ్ళి అన్నయ్యని చూస్తాను" అని చెప్పి వీధి తలుపులు తగ్గరగావేసి వెళ్ళింది.

ఎలాంటి కబురు వినవలసి వస్తుందో అని హడలి చస్తుంటే నువ్వు పూలరంగడిలా వచ్చావు. ఆ వెధవ శాంతిని తీసుకుపోవటానికే అలా చెప్పి వుంటాడు."

అమ్మ చెప్తున్న మాటలు వింటుంటే నాకు మతిపో తున్నట్లు అనిపించసాగింది.

శాంతిని మోసగించి తీసుకువెళ్ళే అవసరం ఎవరికి కలిగింది? మాకు తెల్సినంతవరకూ ఎవరికీ ఎలాంటి హానినీ కలిగించలేదు. నాకు మిత్రులే ఎక్కువ కాని శత్రు వులు ఎవరూ లేరు.

నో. నో, వున్నాడు. ఒకే ఒక శత్రువు. వాడే వెంకటమూర్తి.

ఉంది అనుకొంటే వాడి ఒక్కడితోనే నాకు శత్రుత్వం వుంది.

అది నేను కావాలని పెంచుకొన్నదికాదు. వాడి నీచ

మైన ప్రవర్తనవల్ల కలిగినది. దాన్ని శతృత్వం అనను. అసహ్యం అంటాను. వాడి దృష్టిలో మాత్రం అది శతృత్వమే.

సరస్వతీ సంగీత కాలేజీ లెక్చరర్ వెంకటమూర్తి. అతనిగొంతు ఎంత మధురంగా వుంటుందో, హృదయం అంత పాషాణం.

వయసు నలభై వుంటుంది. ఖరీదైన బట్టలు, బొంబాయి సెంట్లు వాడతాడు.

తన క్లాసులో విద్యార్థినులని ఏదో మందుపెట్టి లొంగ దీసుకొని, వాళ్ళ శీలాలని దోచుకొన్నాడు. ఇద్దరు ముగ్గుర్ని పెళ్ళిళ్ళు కూడా చేసుకొన్నాడు.

ప్రైవేట్లు చెప్పించుకోలేని తల్లి, తండ్రులు తమ కూతుళ్ళని మహా గాయినిలని చెయ్యాలన్న ఆశతో ఆ కాలేజీలో చేర్పిస్తే, కాస్త ఎర్రగా, బుర్రగా కనిపించే అమ్మాయిల అందాలని రుచిచూసేదాక వదలడు వెంకటమూర్తి.

నా ఫ్రెండ్స్, నేనూ ఇంకా కాలేజీ విద్యార్థులు ఆడ పిల్లల విషయంలో జాగ్రత్తగా వుండమని ఎన్ని వార్నింగ్ లెటర్స్ పంపినా వాటిని లెక్క చేసేవాడుకాడు.

వెంకటమూర్తి ఏం మాయ చేస్తాడో కాని వాడు కన్ను వేసిన ప్రతీ పిల్లా చిత్రంగా వాడికి లొంగిపోయేది. అందుకే వాడి ఆటలు సాగేవి.

ఓసారి నా ఫ్రెండ్ విశాల్ చెల్లెలు విజయ మీద వాడి కన్ను పడింది. విజయ నిప్పులాంటి ఆడపిల్ల. ఎలా పడిందో వాడి మాయలో పడింది. ఆఖరికి, విజయ, వెంకటమూర్తి పెళ్ళికి సిద్ధపడ్డారు.

ఇది సహించలేకపోయేను నేను. విజయని నా చెల్లెలితో

సమానంగా చూస్తున్నాను. వాడి వయస్సులో సగమైనా లేని విజయ వాడిని వెళ్ళాడటానికి సిద్ధపడటం భరించలేక పోయేను. నేనూ, వాసూ, ఇంకా చాలామందిమి వెళ్ళి ఆ పెళ్ళిని ఆపించి విజయని తీసుకొచ్చాం.

ఆ మర్నాడు వాసూ తనని తలఎత్తుకు తిరక్కుండా చేసినవాడిని అలా వదిలెయ్య లేనన్నాడు. వాడు మరో సారి మరో ఆడపిల్ల జోలికి రాకుండా దేహశుద్ధి చేసి వదిలి బెట్టాలన్నాడు. వాడి గుండె మంటలు చల్లారటం కోసం, వెంకటమూర్తిని చిత్తుగా తన్నేసాం.

ఆ తరువాత పదిరోజులు నా హాస్పటల్‌లో నా దగ్గరే ట్రీట్‌మెంట్ పొందాడు. అప్పుడే వాడికి, నాకు బీట్ పడింది.

"శ్యాంబాబూ! పెద్ద హీరోలా వచ్చి విజయని రక్షించావు. నన్ను చావుదెబ్బ తీసావు. పీటికి బదులు తీర్చుకోకుండా నిద్రపోను. ఈరోజు విజయని కాపాడగలిగావు. రేపు నీ చెల్లెలు నా క్లాసుకు రాదా. విజయకు కలిగించిన పరిస్థితినే దానికి కలిగించనా అప్పుడు చూస్తాను నీ చెల్లెల్ని ఎలా రక్షించుకొంటావో" అని అన్నాడు.

ఆ మాటలకు అతని చెంప పగిలిపోయేలా కొట్టాను.

"ఇడియట్! నా శాంతి జోలికి వచ్చేవంటే మాత్రం నీకు సజీవసమాధి కట్టిస్తాను. మైండిట్" అన్నాను ఉగ్రంగా.

విజయ వాడి మాయలోంచి కోలుకొన్న తరువాత తను కావాలని పతనం కాలేదని, నోట్సు ఇస్తానని తన ఇంటికి రప్పించి కాఫీ ఇచ్చారని, ఆనాటినుంచి తనని తనే మరచి పోయేనని ఏడుస్తూ చెప్పింది. ఆ తరువాత ఆమె స్లీపింగ్

టాబ్లెట్స్ తిని మరణించింది.

ఆ సంఘటన నన్ను చాలా బెదరగొట్టింది. వెంటనే శాంతిని కాలేజీ మాన్పించేసి, ఇంట్లోనే ప్రైవేటు పెట్టించాను.

శాంతిది చాలా చక్కని కంఠం. ఎన్నోసార్లు ఎందరో మ్యూజిక్ డైరక్టర్స్ చేత బహుమతులను అందుకొంది. దాని కంఠం విన్న ప్రతీవాళ్ళూ సంగీతం నేర్పించండి. పిసీగాయని అవుతుందని నాదగ్గర, అమ్మదగ్గర అంటుంటే సంగీత కాలేజీలో చేర్పించాను.

అప్పటికి వెంకటమూర్తిని గురించి అంత బాగా తెలియదు. శాంతి కాలేజీలో చేరాక అతన్నిగురించి కొద్ది, కొద్దిగా, తెలిసింది. అయితే శాంతికి అండగా నేను వుండగా అలాంటివాళ్ళు వందమంది వచ్చినా ఏం చెయ్యలేరు అని గర్వపడ్డాను.

విజయ చావుతో ఆ గర్వంపోయింది. ఆ గర్వంస్థానే నాలో భయం చోటు చేసుకొంది.ఎంత ఒడుపుగా పాములు పట్టేవాడైనా ఎప్పుడో ఒకసారి ఆ పాము కాటుకి గురికాక తప్పదు. నాకు పరపతివున్నా, నాకండల్లో బలమున్నా, నా చేతుల్లో పదిమంది ఫ్రెండ్స్‌వున్నా, వాడి చూపుపడ్డ శాంతిని ధైర్యంగా ఆ కాలేజీకి పంపలేను. అందుకే మాన్పించేసాను.

ఒకసారి వెంకటమూర్తిని నలుగురు హాస్పటల్‌కి తీసుకొచ్చారు.

నేను అతన్ని టెస్ట్‌చేసి చూసాను. హార్ట్ ఎటాక్, బ్లడ్‌ప్రెషర్ వున్నాయి. మరొక్కసారి హార్ట్ ఎటాక్‌వస్తే అతను బ్రతకడు.

'మాస్టారూ! ఈసారైనా ఏ ఆడపిల్ల జోలికి పోకుండా వుండండి. మీ ఆరోగ్యం అంతగా బాగోలేదు' అని చెప్పాను అతను విలన్‌లా ఆదోలా నవ్వాడు.

గత నెలలోనే హైదరాబాద్‌లో మంచి వుద్యోగం చేసుకొంటున్న రవికృష్ణతో చెల్లాయ్ పెళ్ళి ఖాయం చేసాను.

ఇంకా పెళ్ళి నెల్లాళ్ళు వుంది. ఏ అడ్డంకులు లేకుండా శాంతిని అత్తవారింటికి పంపేస్తున్నానని పొంగిపోతు న్నాను. అంతలోనే ఈ ప్రమాదం.

శాంతి కనిపించకపోవటానికి వెంకటమూర్తే బాధ్యుడై వుండాలి. వాడే చెల్లాయ్‌ని ఎత్తుకుపోయి వుండాలి.

నేను నా షర్ట్ బటన్స్‌ని తిరిగి పెట్టుకొని, శాంతి ఫోటో ఒకటి జేబులో పెట్టుకొన్నాను. అమ్మతో పోలీసు స్టేషన్‌కి వెళుతున్నానని చెప్పి బయటపడ్డాను.

ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే నమస్కరించి అతనికి ఎదు రుగావున్న కుర్చీలో కూర్చొని శాంతి ఫోటో నా జేబు లోంచి బయటికితీసి జరిగినది అంతా చెప్పాను.

"వినయ్‌భూషణ్ పేరుగల శత్రువులు ఎవరైనా వున్నారా మీకు?" అని ప్రశ్నించాడు.

"నా మిత్రుల్లోకాని, శత్రువుల్లోకాని ఆ పేరుగల వ్యక్తులు ఎవరూ లేరు ఇన్‌స్పెక్టర్."

"పోనీ మీ చెల్లెలు ఏ కుర్రాడినైనా ప్రేమించి, అత నితో ఎటైనా వెళ్ళిపోయి, మీకీ రిస్కుని కలిగించిం దేమో?"

నేను చిన్నగా నవ్వాను.

"ఇన్‌స్పెక్టర్, నా చెల్లాయ్ నచ్చుకొన్న వరుడితో

దాని పెళ్ళి నెల్లాళ్ళలో చెయ్యబోతున్నాను. మీ వూహ కరెక్ట్‌కాదు" అని అన్నాను.

ఇన్‌స్పెక్టర్ టేబిల్‌మీదున్న పేపర్‌వేట్ అటూ, ఇటూ తిప్పుతూ రెండుక్షణాలు మౌనం వహించాడు.

నేను గోళ్ళు కొరుక్కుంటూ ఆయన ముఖంలోకే చూస్తూండిపోయేను.

"శ్యామ్ ఇందాక అన్నారే వినయ్‌భూషణ్ అన్న పేరుతో శత్రువులులేరని. పోనీ మరో పేరుతో ఎవరైనా వున్నారా? వుంటే దాచకుండా చెప్పండి."

ఇన్‌స్పెక్టర్ మాటలకు వెంకటమూర్తి గుర్తుకొచ్చాడు అతని కారెక్టర్ ఎలాంటిదైనా అతనికి ఎంతటి పరపతి వుందో నాకు బాగా తెల్సు. అతనే చెల్లాయిని కిడ్నాప్ చేసాడంటే ఇన్‌స్పెక్టర్ నమ్ముతాడా?

నమ్మినా, నమ్మకపోయినా నా అనుమానాన్ని మ్రింగేసుకోవడం మంచిదికాదు.

నేను ఓసారి పొడిగా దగ్గి. "ఇన్‌స్పెక్టర్! మీకు సరస్వతీ కాలేజీ లెక్చరర్ వెంకటమూర్తి తెలుసా?"

"అరే ఆయన ఎందుకు తెలియదు. ఆయన కచేరీలంటే చెవికోసుకొంటాను. స్వీట్ వాయిస్ ఆయనది."

ఇన్‌స్పెక్టర్ అలా అంటుంటే నాకుఏదోలాఅనిపించింది.

ఏ వ్యక్తి మీదైనా మంచి అభిప్రాయాన్ని ఏర్పరచుకొంటే దాన్ని చెడుగా మార్చుకోవటం చాలా కష్టం. అయితే పోలీసుశాఖ న్యాయానికి మాత్రమే విలువనిస్తుంది. ఆ శాఖల్లో పనిచేస్తున్న వ్యక్తులు అవసరమైతే అయినవాళ్ళనైనా అనుమానించటానికి వెనుకాడరు. అందుకే నా మనసులో విషయాన్ని బయటపెట్టాను.

వెంకటమూర్తి నామీద పెంచుకొన్న కసిని, ఆ కసి పెంచుకొన్న కారణాన్ని వివరించి చెప్పాను ఇన్‌స్పెక్టరికి.

అంతా విని తలపంకించి. "ఆయనే మీ చెల్లాయ్‌ని కిడ్నాప్ చేసాడని వూహిస్తున్నారా" అని అడిగాడు.

"మీరు కాని పరిశోధనలోకి దిగితే నా వూహ కరక్టేనని ఋజువు కావచ్చు."

"ఒకే, మిస్టర్ శ్యామ్ నేను మీ కేసుని టేకప్ చేస్తున్నాను. ఇప్పుడే వెంకటమూర్తిని కల్సుకొంటాను. ఈలోగా మీకేమైనా తెలిస్తే నాకు వెంటన్ ఫోన్ చెయ్యండి" అని అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అలాగే అని తలవూపి ఇంటికి వచ్చాను. అమ్మతో పోలీస్ రిపోర్ట్ ఇచ్చిన సంగతి చెప్పి నా గదిలోకి వచ్చేసాను.

నా మదినిండా గుబులుగా వుంది నాచెల్లెలు నాకు పవిత్రంగా లభిస్తుందా? అది అపవిత్రురాలైతే ఈ సంఘం నన్ను విమర్శించకుండా వూరుకొంటుందా? వాసుని చాలా మంది వెనుకగా వాళ్ళ చెల్లెలేరా అదెవరితోనో వుండి, ఈ సంగతి తెల్సిపోతే చనిపోయింది, అని అనుకోవటం నాకు తెలియనిదికాదు.

నాచెల్లెలు మాయం అయిన సంగతి తెలిపి లోకం ఏమనుకొంటుంది? ఏవేవో ఆలోచనలు నన్ను ఆవరిస్తున్నాయి.

ఆ మర్నాడు హస్పటల్‌కి వెళ్ళాను. అప్పుడే ఎలా తెలిపోయిందో? ఈ సంగతి. నా కోడాక్టర్స్ కొందరు "శ్యామ్ మీ చెల్లాయిని ఎవరో కిడ్నాప్ చేసారట" అని ప్రశ్నించారు నన్ను చూడగానే.

వాళ్ళ ప్రశ్నకి ఏ రీతిలో బదులు చెప్పాలో అర్థం కాలేదు నాకు. జరిగినది అంతా చెప్తే జాలిగా చూస్తారు. ఆ జాలిని మాత్రం భరించటం నాతరం కాదు. అలా అని ఏంచెప్పకుండా వూరుకొంటే ఏదో జరిగిందని వూహాగానం చేస్తారు. అందుకే 'వూఁ' అని బరువుగా ముందుకు నడిచాను.

ఆ పూట హాస్పటల్‌లో సరిగానే పనిచెయ్యలేక పోయేను. నాపని అయిపోయేక పోలీస్ స్టేషన్ కెళ్ళాను.

"మాచెల్లాయ్ గురించి ఏమైనా తెల్సిందా ఇనస్పెక్టర్" ఎంత మామూలుగా అందామనుకొన్నా నా గొంతు నాకే క్రొత్తగా, బొంగురుగా, వినిపించింది.

"శ్యామ్, వెంకటమూర్తి ఇంటికి వెళ్ళాను. ఆయన మూడురోజుల క్రిందటే కచేరీ ఇవ్వటానికి హైదరాబాద్ వెళ్ళాడట. ఇంటికి తాళం వుంది. ఆ చుట్టుప్రక్కల వాళ్ళు చెప్పారు" అని చెప్పాడు.

"మరీ, ఇంకెవరు చెల్లాయ్‌ని కిడ్నాప్ చేస్తారు. బహుశా అతని మనుషులు ఈపని చేసి వుండవచ్చుకదా? ఆయన ఎలిబీ కోసం హైదరాబాద్ వెళ్ళవచ్చు కదా?"

"ఆ వివరాలన్నీ నేను తెల్సుకొంటాను. మీ చెల్లెలి గురించి తెలిస్తే మీకు ఫోన్ చేస్తాను" అని అన్నాడు ఇనస్పెక్టర్.

ఆ మర్నాటి వుదయం రౌండ్సుకి వెళుతుంటే కంపౌండర్ భార్గవరావు వచ్చి "డాక్టర్‌సాబ్, మీకు ఫోన్ వచ్చింది" అని చెప్పాడు.

అతని మాటలకు నా గుండెలు నిండా అలజడి చెలరేగింది.

జారిపోతున్న గుండె ధైర్యాన్ని బిక్కబట్టుకొంటూ టెలిఫోన్‌వైపు నడిచాను. రిసీవర్‌ని నాచెవికి ఆనించుకొని, "హలో, శ్యాంబాబు హియర్" అని అన్నాను.

"హలో మిస్టర్ శ్యామ్. మీరు ఇమిడియట్‌గా పోలీస్ స్టేషన్‌కి రాగలరా" అది ఇనస్పెక్టర్ గొంతు.

ఇప్పుడే బయలుదేరుతున్నానని చెప్పి, సూపరెండెంట్ గారికి చెప్పి, పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాను.

నన్ను చూడగానే ఇనస్పెక్టర్ నవ్వలేదు. గంభీరంగా వున్నాడు.

"ఇనస్పెక్టర్! మా చెల్లాయిని గురించి ఏమైనా తెలిసిందా?"

"సారీ మిస్టర్ శ్యామ్. ఈరోజు వుదయాన్నే మీ చెల్లాయ్ శవం సముద్రపు ఒడ్డున తేలింది. పోస్ట్‌మార్టమ్ చేసాం. ఆమెని ఎవరో రేప్ చేసారు. ఆమె చావు సహజ మైనదే అని తేల్చబడింది. మీకు తన ముఖాన్ని చూపించ లేక ఆత్మహత్య పాలబడింది."

ఇనస్పెక్టర్ మాటల్ని వింటూ ఆయన ముఖంలోకి వెర్రివాడిలా చూస్తున్న నేను. అది పోలీస్‌స్టేషన్ అన్న సంగతే మరచిపోయి, నారెండు చేతుల్లో ముఖాన్ని దాచు కొని వెక్కి, వెక్కి ఏడ్చేసాను. నా అందాల శాంతి, నెల్లాళ్ళలో పెళ్ళికూతురు కాబోతున్న నా చిట్టితల్లి, సముద్రం పాలు అయింది. ఈ దుఃఖాన్ని భరించటం నా తరమా?

"శ్యామ్, మీ చెల్లెలి పతనానికి కారకులెవరో తెల్సు కొనేదాకా నాకు శాంతి వుండదు."

ఏడుస్తున్న నన్ను బుజ్జగిస్తున్నాడు ఇనస్పెక్టర్.

* * *

చెల్లాయ్ దహన సంస్కారాలు అయాక నన్నూ, అమ్మని వూరడించటానికి మా మామయ్యా తదితర బంధువులు వచ్చారు.

ఓ వారం వున్నాక అంతా వెళ్ళి పోతామన్నారు. మామయ్యా తనతో, నన్నూ, అమ్మని రమ్మన్నాడు.

నాకు హాస్పటల్ వుంది. వెళ్ళటానికి వీలులేదు. అమ్మని వెళ్ళమన్నాను.

"ఒరే, శ్యామ్ నేను వెళ్ళిపోతే శాంతికోసం బెంగ పెట్టుకొని తిండిమానేస్తావు" అంది అమ్మ ఏడుస్తూ.

నేను విషాదంగా నవ్వాడు.

"అమ్మా! శాంతి పోవటంతోనే నా ఆశలు, పరువు, అన్నీపోయాయి. ఇంక నేను బ్రతికి వున్నాను అది నీ కోసం" అన్నాను.

అమ్మ నన్ను తన గుండెలకు హత్తుకొని ఏడ్చేసింది.

ఆ మర్నాడు అమ్మా, మామయ్యా అంతా వెళ్ళిపోయేరు.

ఇంట్లో నేను ఒంటరిగాణ్ణయి పోయేసరికి పిచ్చిఎత్తినట్లు అనిపించింది అడుగడుక్కీ చెల్లాయ్ గుర్తులు ఆ ఇంట్లో నన్ను ఎక్కువసేపు వుంచలేక పోతున్నాయి.

హాస్పటల్ పనికాగానే అలారోడ్ల వెంట తిరగసాగాను.

నా వాహనం లేకుండా, నలిగిన దుస్తులతో తిరుగుతున్న నన్ను చూపి నాఫ్రెండ్స్ నాకు మెంటల్‌షాక్ తగలవచ్చని భయపడి, నన్ను నిబ్బరంగా వుండమని పదే పదే హెచ్చరించసాగారు.

* * *

ఆ రోజు మామయ్య దగ్గర్నుంచి లెటర్ వచ్చింది. అమ్మ కులాసాగా వున్నాదని, ఆ లెటర్‌లో సారాంశం. మండే నా గుండెల్ని రవ్వంత చల్లార్చింది. అమ్మకు అక్కడే శాంతిగా వుంటుంది అని అనుకొన్నాను.

నేను కులాసాగా వున్నానని మామయ్యకి వ్రాసి, అది పోస్ట్ చెయ్యటానికి వీధిలోకి వెళ్ళాను. ఆ లెటర్ పోస్ట్ డొక్కులో పడేసి టైమ్ చూసుకొన్నాను. ఆరున్నర అవు తున్నది. ఇప్పుడే ఆ కొంపకిపోయి ఏం చేస్తానని అలా తిరగసాగాను.

అలా తిరుగుతున్న నాకాళ్ళు ఓ ఇంటిబోర్డు చూడగానే ఆగిపోయి.

వై. వి. వెంకటమూర్తి. ఆ పేరు చూడగానే నాలో ఆరిపోతున్న జ్వాలలు, తిరిగి రగులుకొన్నాయి. అతను చేసిన ప్రతిజ్ఞ గుర్తుకు వచ్చింది.

రాస్కెల్ నా చెల్లెలి చావుకు కారణం కాదుకదా? శాంతిని కిడ్నప్ చేసినప్పుడు వెంకటమూర్తి వూరిలోనే లేడు. అతను శాంతి చావుకి కారణం ఎలా అవుతాడు?

ఆలోచిస్తూ నెమ్మదిగా వెంకటమూర్తి ఇంటి దగ్గరగా వచ్చాను. తలుపులు వేసి వున్నాయి కిటికీ తలుపులు మాత్రం దగ్గరగా వేసివున్నాయి.

నేను ఓసారి చుట్టూవున్న పరిసరాలు గమనించాను. ఆ వీధిలో అట్టే జనసంచారం లేదు. ఇళ్లు కూడా వెంకట మూర్తి ఇంటికి కాస్త దూరంలో వున్నాయి.

నేను కిటికీ దగ్గరికి వెళ్ళి, నిలబడి, ఓ కన్ను పెట్టి లోపలకి చూసాను.

వెంకటమూర్తి మంచం మీద కూర్చొని వున్నాడు.

అతనికి ఎదురుగా ఇద్దరు వ్యక్తులు నిలబడి వున్నారు.

నాకు అధోముఖంగా వుండటంతో ఆ వ్యక్తుల ముఖాలు కనబడే అవకాశంలేదు.

"....రజాక్! శాంతికేసు ఏమైంది?" వెంకటమూర్తి గొంతు చాలా నెమ్మదిగా వినిపించింది.

"శాంతిది హత్య అని బ్రహ్మ కూడా నమ్మలేడుసార్. మనం తెలివి తప్పినదాన్ని సముద్రంలో తోసేసాం. అది ఎవరో రేప్ చెయ్యటం వల్లే ఆత్మహత్య చేసుకొందని తేల్చేసాడు ఇన్‌స్పెక్టర్."

ఆ మాటల్ని వింటుంటే నా ఒంట్లో రక్తం ఆవేశంతో సల, సలా కాగిపోసాగింది. పిడికిళ్ళు బిగించి, ఒక్క అడుగు ముందుకు వేసాను.

అంతలో నా వివేకం మెల్లగా హెచ్చరించింది నన్ను. పూర్ శ్యామ్ లోపల ముగ్గురు వ్యక్తులు వున్నారు. నువ్వు ఒక్కడివి. ఏ ఆయుధం లేకుండా లోపలకి ప్రవేశిస్తే నీ చెల్లెలి శవంలాగే, నీశవం సముద్రంలోకి చేరుకొంటుంది.

నిజమే, దెబ్బకి దెబ్బ తీసే సమయం కోసం వెయిట్ చెయ్యాలి.

నేను నా అడుగును వెనక్కి తీసుకొని మళ్ళీ శ్రద్ధగా విన్నాను.

"ఆ శ్యామ్‌గాడు పిచ్చివాడిలా వీధులు తిరుగుతున్నాడు సార్!"

"మరేమౌతుంది. నా స్వంత విషయాలలో తల దూర్చాడు, ఫలితం తన తలరాతనే చెరుపుకొన్నాడు."

వెంకటమూర్తి మాటల్ని ఇంకా వినాలని అనిపించ లేదు. అక్కడ నుంచి తిన్నగా నా ఇంటికి వచ్చేసాను.

డ్రెస్సు అయినా చేంజ్ చేసుకోకుండా కుర్చీలో కూల బడ్డాను. నాకళ్ళ ముందు వెంకటమూర్తి రూపం కదలాడ సాగింది.

వెంకటమూర్తి అన్నట్లు అతని స్వంత విషయాల్లో తలదూర్చి నిజంగా నా తలరాతని చెరుపుకొన్నానా? ఒక అమాయకురాలిని వశపరచుకొని, శీలాన్ని అపహరించి, తన కన్నా ఎంతో చిన్నదాన్ని పెళ్ళాడబోతున్న వెంకట మూర్తి రాక్షస చర్యని అరికట్టటం ఒక భారత పౌరుడనైన నా బాధ్యతకాదా? అది నేరమా? ఆ నేరం చేసినందుకే నా శాంతి శ్మశానంలో కలిసిపోయిందా? నాకు అశాంతి మిగిలి పోయిందా?

ఇక్కడితో శాంతి మరణంతో, నా ఆవేదనతో ఈ ఆట ఆగిపోతుందా? మళ్ళీ మరో అమాయకురాలి చరిత్ర పతన మౌతుందా? ఆ అన్న నాలాగే చరిత్రహీనుడౌతాడు?

నో, వీల్లేదు. నాచెల్లెల్లాంటి నిర్భాగ్యురాలిగా మరో స్త్రీ తయారుకాకూడదు. అంటే వెంకటమూర్తి చరిత్ర రూపు మాపిపోవాలి? వెంకటమూర్తి ఈ లోకంలో జీవించి వుండ కూడదు? నేను వెంకటమూర్తిని హత్య చేయాలి? ఆ ఒక్క ఆలోచనే నా మెదడు నిండా ఆక్రమించుకొంది.

*   *   *

వెంకటమూర్తి ఇంటికి తాళంవేసి వుండటంతో, మళ్ళీ మరోసారి నా ప్రయత్నం ఫలించక పోవటంతో చిరాకుగా నడిచాను.

అలా, అలా, నడుస్తూ ఎంతదూరం వచ్చానోగాని హఠాత్‌గా ఆలోచనలనుంచి మేల్కొని చుట్టూచూసేసరికి నేను ఏ వీధిలోవచ్చి పడ్డానో తెల్సుకొన్నాను, ఆ వీధిలో

వ్యభిచారం చేసుకొనేవాళ్ళు నివసిస్తారని చాలమంది అను కోవటం విన్నాను.

ఆ వీధిలోంచి వస్తే చూసే ప్రతికళ్ళూ చీదరింపుగా, నీ సంగతి నాకు తెల్సులే అన్నంత హేళనగా చూస్తుంటే తలకొట్టేసినట్లు అనిపిస్తుంది. ఆ వీధిని గురించి తెలిశాక ఆ వీధిలోంచి పోవటం మానేశాను.

నేను వెనక్కు మళ్ళాను వెళ్ళిపోదామని. అంతలో బయటకి వస్తున్న వెంకటమూర్తి కనిపించాడు.

అప్రయత్నంగా నా నోటినుంచి చిన్నగా విజిల్ వెలు వడింది.

వెతకబోయిన తీగె కాళ్ళకు తగిలిందంటారు. ఇదే కాబోలు. వీడికోసం వెతికి వెతికి వేసారిపోయేను. మృత్యువు దగ్గర పడిందేమో ఇలా యెదురుపడిపోయేడు.

వెంకటమూర్తి ఎందుకో తలయెత్తి నన్ను చూశాడు. ఆ కళ్ళలో వెటకారం నిండిన నవ్వు తొంగిచూస్తుంది. నేను ఓసారి అతన్నిచూపి నడకసాగించాను, క్లోరోఫారమ్ తడిపిన రుమాలున్న జేబులోకి నాచేతిని పోనిచ్చి.

వెంకటమూర్తి పక్కగావెడుతూ జనసంచారంలేనిచోట రుమాలుతీసి అతని ముక్కు దగ్గరుంచాను. ఆ వాసన పీల్చినవెంటనే ముందుకు ఒరగబోయేడు. నేను అతన్ని పట్టుకొని నేలమీద పడుకోబెట్టి, మెయిన్‌రోడ్ మీదకి వచ్చాను.

మెయిన్‌రోడ్‌మీద ఒక్కటే టాక్సీవుంది. ఆ టాక్సీ డ్రైవర్ దగ్గరకి "డ్రైవర్ మా అన్నయ్య ఆ వీధిలో మూర్ఛబోయాడు. ఓసారి వస్తావా" అన్నాను ఖంగారు నటిస్తూ.

"పదండి సార్" అన్నాడు వాడు.

వెంకటమూర్తి పడివున్నచోట టాక్సీ ఆపించి, డ్రైవర్ సహాయంతో వెంకటమూర్తిని టాక్సీలో యెక్కించాను.

డ్రైవర్‌కి ఎడ్రస్‌చెప్పి హాయిగా వెనక్కివాలాను. ఇప్పుడు నాకెంతో రిలీఫ్‌గావుంది. ఏదో సాధించలేనిది సాధించినంత ఆనందంగావుంది. వెంకటమూర్తిని చూస్తూ వుంటే అక్కడే పీకపిసిగెయ్యాలన్నంత ఆవేశం కలుగు తూంది.

టాక్సీ వెంకటమూర్తి ఇంటిదగ్గిర ఆగింది.

డ్రైవర్ సాయంతో వెంకటమూర్తిని ఇంట్లో పడుకో బెట్టి, డ్రైవర్‌కి డబ్బులిచ్చి పంపేశాను. అతను వెళ్లాక వెంకటమూర్తిని తాళ్ళతో కట్టేశాను.

ఆ ఇంట్లో అతనొక్కడే ఉంటాడని నాకు తెలుసు.

నెమ్మదిగా వెంకటమూర్తికి తెలివి తెప్పించాను. తల విదిలించి, చుట్టూచూసిన అతను నన్నుచూపి బెదిరి పోయాడు.

నేను జేబులోంచి ఓ బాటిల్, సిరంజ్ బయటకు తీసాను.

ఆ బాటిల్ మీద అక్షరాలు అతనికి స్పష్టంగా కనిపిస్తు న్నాయి.

"శ్యామ్, పా....పాయిజన్ ఎందుకు? ఏమిటి నీ ఉద్దేశ్యం?"

వెంకటమూర్తి కంఠంలో విపరీతమైన వణుకు గమ నించి కసిగా నవ్వుకొన్నాను.

"చెప్పు నన్ను ఏంచేస్తావ్? లేక....లేక" ఆవేశంలో మరి మాట్లాడలేక పోయాడు.

నేను బాటిల్ ఓపిన్‌చేసి, మందు సిరంజ్‌లోకి ఎక్కించాను.

"మైడియర్! మాష్టారూ! నీస్వంత విషయంలో జోక్యం కలిగించుకొన్నందుకు నాకు శిక్షను విధించావు. నా చెల్లెల్ని హత్యచేసి నన్ను అశాంతికి గురిచేశావు, కాని నేను నా చెల్లెల్నేకాదు. నా చెల్లెల్లాంటి అమ్మాయిలు నీ కామజ్వాలలకు గురై మసైపోకుండా వుండేందుకు నీకు ఏంశిక్ష విధించబోతున్నానో తెలుసా? ఈ ఇంజెక్షన్ నీ జబ్బలోకిదింపి నిన్ను పరలోకానికి పంపబోతున్నాను. నా శాంతిలాంటి మరో శాంతికి ఇక భయంవుండదు.

సరస్వతీ నిలయమైన ఆ కాలేజీలోంచి నీలాంటి చీడ పురుగును ఏరిపారేసి ఆ కాలేజీ పవిత్రతను నిలబెడతాను. నిన్ను ఒక్క ఇంజెక్షన్‌తో పైకి పంపి, నా శాంతి ఆత్మకి శాంతిని చేకూరుస్తాను. మరో అన్నకి మనశ్శాంతిని కోల్పోయే అవకాశం కలిగించను. నాచేతిలో నీ ఆట కట్టాలి" అంటూ నేను సిరెంజిలోకి మందుని యెక్కించి బాటిల్ టేబుల్‌పై పెట్టి తలెత్తాను.

అంతే! నాచేతిలో సిరెంజి జారిపోయింది. ఒక్క పరుగున వెంకటమూర్తి దగ్గరికివచ్చి వాలిపోయివున్న అతని తలని యెత్తిచూసాను. ఆ ముఖంలో జీవకళలేదు.

ఆత్రంగా పల్సుపట్టుకుని చూశాను. ప్రాణంపోయి అప్పుడే రెండు నిముషాలయింది.

నాకు మతిపోయినట్లయింది. నేను చంపాలని అను కొన్న వెంకటమూర్తికి బి. పి. హార్ట్‌ఎటాక్‌వున్న సంగతి మరచిపోయాను. నేను ఇంజక్ట్ చేసేలోగా గుండెపోటుతో చనిపోయాడు.

అతని చావుతో నాలో నశించిపోయిన వివేకం అప్పుడే ఒళ్ళువిరుచుకొని, నిద్ర మేల్కొంది.

ఒక్క రెండునిముషాలముందు ఇంజెక్ట్ చేసివుంటే, నేను కటకటాల వెనక వుండేవాడిని. నా తల్లికి కూతురు పోయిన దుఃఖమేగాక సంఘంలో పేరున్న డాక్టరుగా చెలామణి అవుతున్న తన కొడుకు హంతకుడు అనే దుఃఖాన్ని జీవితాంతం మిగిల్చి ఉండేవాడిని.

ఆ భగవంతుడు కరుణామయుడు. నా తప్పుని సరి దిద్దాడు. అతని పాపాన్ని పండించాడు. నేను చిన్నగా విట్టూర్చి టైమ్ చూసుకున్నాను. పన్నెండు కావస్తోంది. అతన్ని మంచంమీద పడుకోబెట్టి, తలుపులు దగ్గరగావేసి నా ఇల్లుచేరాను. తెలతెలవారబోతుండగా ఓ విద్యార్థి నా యింటికి వచ్చాడు- తమ గురువుగారు యెంత పిలిచినా పలకటం లేదని.

నేను, ఆ కుర్రాడు వెళ్ళేసరికి చాలామంది పోగయి వున్నారు.

మాష్టారి దగ్గర సంగీత పాఠం నేర్చుకుందుకు వచ్చాడట ఆ కుర్రాడు. ఆయన పలకక పోవటంతో నన్ను పిలిచాడు.

నాకు తెలుసు మంచం మీదున్నది శవమని. అయినా ఓసారి పరీక్షించి—"గుండె ఆగి చనిపోయాడు" అని చెప్పాను.

అయన్ని గురించి ఏడ్చేవాళ్ళు లేరేమో? ఎవరి యేడుపులు వినిపించలేదు.

నాలో నేనే చిన్నగా నవ్వుకొంటూ, వుషారు నిండిన మనస్సులో ఇంటివైపు నడిచాను. □□□

డబ్బుతో పేచీ!

వసుంధర

ఏడేళ్ళ కొడుకుని దగ్గరగా తీసుకుని ఆప్యాయంగా నుదుటి మీద ముద్దెట్టుకుని—"నువ్వు చాలా గొప్పవాడి వౌతావురా...." అన్నాడు జగ్గడు.

అప్పాయమ్మ కిసుక్కున నవ్వింది. భార్యవంక అదోలా చూసి—"ఎందుకే నవ్వుతావ్? నీ కడుపున ఓ కాయ కాస్తే వాణ్ణీ ఇలాగే ముద్దులాడతాలే...." అన్నాడు జగ్గడు.

అప్పాయమ్మ మళ్ళీ నవ్వింది. ఆ నవ్వులో కవ్వింపు వుంది.

అప్పాయమ్మ జగ్గడి రెండో పెళ్ళాం. ఏణ్ణర్థం క్రితం అతని మొదటి భార్య చనిపోయింది. ఆర్నెల్ల క్రితం జగ్గడు అప్పాయమ్మని పెళ్ళిచేసుకున్నాడు. జగ్గడికి కొడుకు సుబ్బన్నంటే చాలా యిష్టం. వాణ్ణి చాలాచాలా గొప్పవాణ్ణి చేసేయాలని తరచుగా కలలు కంటూంటాడు. కొత్తగా వచ్చిన అప్పాయమ్మకు సుబ్బన్నపట్ల రాగద్వేషా

లేమీ లేవు కానీ—సినిమా హీరోయిన్లా ఉండాలని మాత్రం మహాతాపత్రయపడిపోతూంటుంది.

ముఖం చాలా అందంగా వుంటుం దప్పాయమ్మది. మనిషికూడా చాలా నాజుగ్గా వుంటుంది. ఎటొచ్చీ చదువు కోనందువల్లనూ, పెద్దింటి ఫ్యాషన్లు తెలియనిమూలానూ మామూలువాళ్ళకి చూడ్డానికి మామూలుగానే కనబడుతుంది కానీ ఓ మాదిరి రసికతున్న వాళ్ళుకూడా ఆమె అందాన్ని గుర్తించడం చాలా సులభం.

జగ్గడు కాయకష్టం చేసి బ్రతికేమనిషి కాడు. వాడో ధనవంతుణ్ణాశ్రయించి బ్రతుకుతున్నాడు. ఆ ధనవంతుడి పేరు రంగారావు. జగ్గడు అవసరాలన్నీ ఆయనే చూస్తాడు ఆయన చెబితే జగ్గడు మనుషుల్ని కొడతాడు—చంపుతాడు కూడా। జగ్గడికి తన యజమానంటే చాలా గౌరవముంది.

రంగారావు ప్రస్తుతం జగ్గడికోసం కబురుపెట్టాడు. వెళ్ళేముందు కొడుకును ముద్దులాడి మరీ బయల్దేరాడు. అతను వెళ్ళేసరికి రంగారావు చాలా ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు.

"ఒరేయ్ జగ్గా—రాత్రంతా బాగా ఆలోచించేక చివరికి నీకీ విషయం చెప్పాలనుకుంటున్నాన్రా—నువ్వేమీ అనుకో కూడదు...." అన్నాడు రంగారావు.

"చెప్పండి బాబూ...." అన్నాడు జగ్గడు.

"నీ పెళ్ళాంమీద మనసైందిరా నాకు...." అన్నాడు రంగారావు తటపటాయించకుండా.

జగ్గడు తెల్లబోయాడు. అతని రక్తం వుడికింది. ఆవే శంతో నోటమాటరాలేదు.

"ఆవేశపడకురా-నువ్వు కనిపెట్టావో లేదో కానీ నీపెళ్లాం

అంతస్థిరమైనది కాదు. అదెలాగూ ఒక మగాడికి కట్టుబడే రకంకాదు. నా విషయంలో చూసీ చూడనట్లూరుకున్నావో అది నిన్నూనన్నూ తప్ప మరొకణ్ని పట్టకుండా కట్టుదిట్టం చెప్తాను. నీ కొడుకును చదివించడానికి అన్ని ఖర్చులూ నేను భరిస్తాను. ఒకసారి నా దగ్గరకొచ్చేక—దాన్నింక నీ పెళ్ళాంగా చెప్పుకొనేందు కిష్టంలేకపోతే—దాన్ని పూర్తిగా నాకే వదిలేసి—ఇంకొకా త్తిని కట్టుకో. బాగా ఆలోచించు...."

"బాబూ—మీరు చెప్పిన ఎదవపన్లు చేస్తున్నానని—నన్నుత్తి ఎదవకింద కట్టేశారా—తాళికట్టి పెళ్ళాడినదాన్ని పరాయిమగాడి కప్పగించేటంత నీచుణ్ని కాదు బాబూ నేను. అది నన్ను పెళ్ళాడింది బోగందానిగా మారడాని క్కాదు, ఇల్లాలిగా బ్రతకడానికి. తమరేమీ అనుకోనంటే ఒక్కముక్క అంటాను" అన్నాడు జగ్గడు.

"చెప్పరా...."

"మీయావిడ గురించడిగితే నాకేం చెబుతారు బాబూ మీరు?"

రంగారావేమీ ఆవేశపడలేదు-"అంతేనా? అది ఆవిడకు సంబంధించిన విషయం. నా మూలంగా ఆవిడకు సమాజంలో వున్నతస్థానం లభించింది, అదవసరం లేదనుకుంటే వెళ్ళిపోతుంది...."

తన యజమాని ఆవేశపడిపోతాడనుకున్న జగ్గడికేం మాట్లాడాలో తోచలేదు "దొరా—నేను చదువుకున్నోణ్ని కాదు. ఆవేశాన్నదుపు చేసుకోవటం నాకు చేతకాదు. ఇంకో సారిలాంటి మాటలాడ్డం మీకూ నాకూ కూడా మంచిది కాదని మాత్రం చెబుతున్నాను...."

2

"అప్పీ—"

"బాబూ...."

"నాతో వుండిపోకూడదుటే...."

"నేనడిగినవన్నీ ఇస్తే వుండిపోతాను బాబూ ..." అంది అప్పాయమ్మ.

"అడిగినవన్నీ ఇవ్వడంకాదే! నీకు చదువు కూడా చెప్పిస్తా. నా ఇంట్లోనే సెక్రటరీగా వుంటావన్న మాట" అన్నాడు రంగారావు.

అప్పాయమ్మ కళ్ళు మెరిసాయి.

"ఆ బీరువా తెరు. నీక్కావల్సిన బట్టలు కట్టుకో...." అన్నాడు రంగారావు.

అప్పాయమ్మ ఉత్సాహంగా వెళ్ళి బీరువా తెరిచింది. అందులో వున్నబట్టలు చూస్తుంటే ఆమెకు పిచ్చెక్కినట్లయింది. ఏమి సెలక్ట్ చేసుకోవాలో కూడా తెలియ లేదామెకు. రంగారావే ఆమెకు కొన్ని మ్యాచింగ్ బట్టలు తీసిచ్చాడు. అప్పటికప్పుడా బట్టలు వేసుకొన్నాక రంగా రావామెకు నిలువుటద్దంముందుకు నడిపించాడు. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుని అదిరిపడింది అప్పాయమ్మ ఆ తర్వాత మురిసిపోయింది.

"ఇప్పుడు మీ ఆయనొస్తాడు. భయపడతావా—నేను చెప్పినట్లు చేస్తావా?"

"వాడంటే నాకు భయం బాబూ...." అంది అప్పాయమ్మ.

"నేనుండగా కూడానా?"—అన్నాడు రంగారావు.

మరి కాసేపట్లో అక్కడికి జగ్గడు రానేవచ్చాడు.

వస్తూనే చూసిన దృశ్యానికి అతని శరీరం కుతకుతలాడి పోయింది.

"నేనేం తప్పుచేయలేదురా జగ్గా—అంతా అంగీకారం మీదనే జరిగింది."

"అవునా?"—అంటూ ఉమ్మాడు జగ్గడు భార్యవంక చూసి.

అప్పాయమ్మ భయపడలేదు — "ఎంత కష్టపడితే మాత్రం నువ్వు నాకిలాంటి బట్టలు కొనగలవా? నాకేమో ఇలాంటివి కట్టుకుని షోగ్గా తిరగాలని వుంటుంది. నువ్వడిగినప్పుడల్లా కాదనను. నీతోనే వుంటాను. ఎవడితోపడితే వాడితో తిరగను. ఒక్క— ఈ బాబు విషయంలో చూసీచూడనట్లూరుకోరా—హాయిగా జీవిద్దాం. మన సుబ్బన్నను కూడా పై చదువులు చదివిద్దాం...." అంది ధైర్యంగా.

జగ్గడి ఆవేశం అణగారిపోయింది. వాడు దిగాలు పడిపోయి — "మీ డబ్బున్నవాళ్ళన్ని మాయల్చేస్తారు బాబూ—క్షణాలమీద నా ఆడదాన్ని వల్లో వేసుకున్నారు" అన్నాడు.

"జగ్గా—వెధవ సెంటిమెంట్లుకు పోకుండావుంటే నీకిప్పుడొచ్చిన బాధేమీలేదు. అసలేమీ జరగలేదనుకో. ఆవేశపడి నీ పెళ్ళాన్నేమైనా చేస్తే—నువ్వు జైలుకిపోయి నీ కొడుకు భవిష్యత్తులో అంధకారం నింపడం మినహా ఏం వుపయోగముండదు. విషయం చెప్పడంకోసం పిలిచాను. ఇంటికి పోయి పడుకో — నీ పెళ్ళాం ఇంకో అర గంట పోయింతర్వాతొస్తుంది...."

3

"ఎందుకురా జగ్గా యేడుస్తున్నావ్?"

"బావయ్యా—నీచెల్లెలు చచ్చి నా(బ్రతుక్కి పూర్తిగా అన్యాయంచేసి వెళ్ళిపోయింది. నేనేమైపోతానో తెలియదు నా కొడుకును నువ్వే కాపాడాలి...." అన్నాడు జగ్గడు.

"అసలేమయిందిరా? నాచెల్లెలుచచ్చి యేణ్నర్ధమైంది. నువ్వు మళ్ళీపెళ్ళి చేసుకొని అప్పుడే ఆర్నెల్లవుతోంది. ఇప్పుడెందుకు గుర్తొచ్చింది—?" అన్నాడు వెంకడు.

"నేనూ నీకులా రిక్షాలాగి బతుకుతుంటే బాగుండేదిరా-కానీ డబ్బునోళ్ళ వల్లోపడిపోయి చెడిపోయాను. నేనుత్త ఎదవని. నామీద యెవరికి జాలివుండదు. నాకే అన్యాయం జరిగినా ఎవరూ నాకు సాయానికిరారు...." అంటూ జరిగినదంతా చెప్పాడు వెంకడు.

"అయితే ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?"

"పగ—పగతీర్చుకుంటాను. అందులో నేనేమైపోతానో తెలియదు. కానీ నాకొడుకుని నువ్వే కాపాడాలి. వాణ్ని నువ్వేసాకాలి...."

"నీ కొడుక్కేం భయంలేదురా—నేను చూస్తాను. కానీ ఇంకేం ఆలోచించకుండా వెళ్ళి నీపగ తీర్చుకో—యేం చేద్దామనుకొంటున్నావ్—నీ పెళ్లాన్ని చంపేస్తావా?"

"దాన్నని లాభమేముంది బావయ్యా—చేసిందంతా ఆ రంగారావు చేశాడు. వాడికి నమ్మినబంటుగావున్న నాకింత ద్రోహంచేస్తే చీమకుట్టినట్లైనా లేదువాడికి. నా పగ వాడిమీదే...."

"శభాషైన మాటన్నావ్.... వెళ్ళు" అన్నాడు వెంకడు.

జగ్గడక్కణ్నించి బయలుదేరాడు. కాసేపు వీధులన్నీ తిరిగాడు. తర్వాత యింటికి వెళ్ళాడు. అప్పటికి అప్పా

యమ్మ ఇంట్లోనే వుంది.

"ఎంతసేపయిందే వచ్చి!"—అన్నాడు తాపీగా.

చెప్పింది—"సుబ్బన్నేడిరా?"—అంది.

జగ్గడు జవాబివ్వకుండా—"నాతోవచ్చి నేను చెప్పినట్లు చేస్తావా—లేక చస్తావా?"—అనడిగాడు.

అప్పాయమ్మ తెల్లబోయింది. అప్పటికి జగ్గడు చేతిలో పదునయినకత్తి మెరుస్తోంది.

"నువ్వు చెప్పినట్లే చేస్తాను" అంది అప్పాయమ్మ.

ఇంట్లో మూలనున్న చేంతాడుతీసి మొలకు ఏడెనిమిది చుట్లు చుట్టుకున్నాడు జగ్గడు-"పద"-అన్నాడు పెళ్లాంతో.

ఇద్దరూ బయలుదేరి రంగారావిల్లు చేరారు. అప్పటికి సమయం రాత్రి పదకొండు గంటలు కావచ్చు. జగ్గడా యింటికి పరిచయస్తుడే కావడంవల్ల గేటుదగ్గర వాచ్‌మన్ అతన్ని ఆపలేదు.

అతను తిన్నగా రంగారావు బెడ్రూం దగ్గరకు వెళ్లాడు. తలుపులు జారగిల వేసివున్నాయి. తోశాడు జగ్గడు.

లోపల సన్నగాదీపం వెలుగుతోంది. రెండు మంచా లొకదానికొకటి దగ్గరగా వేసివున్నాయి. ఒక మంచంమీద రంగారావు పడుకొని వున్నాడు. రెండో మంచంమీద రంగారావు భార్య అనసూయ తనకూతురును దగ్గరగా హత్తుకొని పడుకొనివుంది.

"వెళ్ళి లేపు నీ ప్రియుణ్ని...." అన్నాడు జగ్గడు.ఆమె కదిలింది. జగ్గడు తలుపులు గడియవేశాడు.

అప్పాయమ్మ రంగారావుని తట్టిలేపింది. రంగారావుకు వెంటనే మెలకువ వచ్చింది! కళ్ళుతెరచి అప్పాయమ్మను చూసి చటుక్కున కౌగలించుకొని-"ఇప్పుడెలా వచ్చావ్" అన్నాడు.

అప్పటికి జగ్గడా మంచాన్ని సమీపించాడు. అప్పాయమ్మ కౌగిలి విడిపించుకొని—జగ్గణ్ని చూపించింది రంగారావుకి. రంగారావు తడబడ్డాడు.

"భయంగా వుందా?" అన్నాడు జగ్గడు.

"ఆకారం పెద్దదయినా దున్నపోతు సింహానికి భయం కలిగించదు...." అన్నాడు రంగారావు కంగారు పడకుండా.

"సరేలే—దున్నపోతుబలం చూద్దువుగాని...." అని రంగారావును లేచినిలబడి వెనక్కి తిరగమన్నాడు. అతని చేతిలో కత్తి రంగారావును చెప్పినమాట వినేలా చేసింది. తాడుతో అప్పాయమ్మ—రంగారావును మంచానికి కట్టేసింది. మిగిలిన తాడుముక్కతో జగ్గడు అప్పాయమ్మను మంచానికి మరోవైపు కట్టేశాడు.

"దొంగ నాయాలా—డబ్బు చూపించి నా పెళ్ళాన్ని వల్లో వేసుకున్నావ్. కత్తిచూపిస్తే అదే నిన్ను కట్టేసింది. నాదగ్గర కత్తుంది. నీదగ్గర డబ్బుంది. కత్తి చూపిస్తే నీ పెళ్ళాం ఏం చేస్తుందో చూదాం...." అంటూ జగ్గడు నెమ్మదిగా అవతల మంచాన్ని సమీపించి అనసూయను తట్టి లేపాడు.

మంచి గాఢనిద్రలోవున్న అనసూయకు మెలకువ వచ్చింది. నాలుగేళ్ళ ఆమెకూతురుకి మెలకువ రాకుండా అనసూయను జాగ్రత్తగా మంచంమీదనుంచి ఎత్తిదింపి—"అరవకు—అరిస్తే కత్తిగుండెల్లో దిగుతుంది" అన్నాడు జగ్గడు.

అనసూయ మాట్లాడలేదు. జగ్గడు ఆమెచేయి పట్టుకుని రంగారావు కెదురుగా తీసుకెళ్లాడు—"ఎవరు అరచినా మాట్లాడినా కుక్కచావు చస్తారు. నాజీవితం ఏమైపోయిన

సరే పగతీర్చుకోవాలని వచ్చాను. కత్తి నీ పెళ్లాన్నెలా లొంగదీస్కుంటుందో చూడు" అన్నాడు.

"జగ్గా నీకిది తగదురా...." అన్నాడు రంగారావు.

"చూడు బాబూ—అదేమాట నేనూ నా పెళ్లాం గురించి చెబితేనువ్వు వినలేదు. నీకున్న ఆయుధం డబ్బు. దాన్ని చూపించి నీవల్లో వేసుకున్నావ్. ఆయుధాలున్నాయిగదా అని మనిషి విచ్చలవిడిగా ప్రవర్తిస్తే ఏమౌతుంది? నా ఆయుధం నాకూవుంది. నీహద్దుల్లో నీవులేవు. నా హద్దులు నేనూ దాటుతున్నాను...." అని అనసూయవంక తిరిగి —"ఊఁ బట్టలువిప్పు...." అన్నాడు.

అనసూయచలించలేదు. జగ్గడు కత్తి దురుసుగా గాలి లోకి లేచింది — "చెప్పినట్లు చేస్తావా — లేదా—?" అన్నాడు.

అనసూయ కళ్ళలో ప్రాణభయం కనబడింది. అసహాయంగా భర్తవంక చూపింది. అతని కళ్ళలోనూ అసహాయత కనబడగా జగ్గడి వంక చూపింది.

"ఊఁ బట్టలు విప్పు. త్వరగా...." అన్నాడు జగ్గడు.

తన భర్త ప్రవర్తన సరైనది కాదనీ—అతను చాలా మంది ఆడవాళ్ళని మరిగాడనీ అనసూయకు తెలుసును. అయినా అందుకామె ప్రతీకారాన్ని తలపెట్టలేదు.మగవాడికీ. ఆడదానికీ, సాంఘిక న్యాయాలు వేరని ఆమెకు మెదడులో బాగా నాటుకుపోయింది. భర్తయెన్ని తప్పుడు పనులు చేసినా తనుమాత్రం శీలాన్ని పవిత్రంగా కాపాడుకోవాలని ఆమె విశ్వసిస్తోంది. అందువలననే ఇప్పటి పరిస్థితి జీవన్మరణ సమస్యగా తోచిందామెకు. లేకపోతే భర్తచేసే తప్పులకు తనే ఇప్పుడు జగ్గణ్ని ప్రోత్సహించి వుండాలి.

"ఉఁ ఇంకా మొదలు పెట్టలేదు. లేకపోతే నేనే...." అంటూ ముందుకు నడిచి ఆమెను సమీపించి పైటకొంగు పట్టుకున్నాడు జగ్గడు.

"అన్నయ్యా...." అంది చటుక్కున అనసూయ—"నాకెవ్వరూ అన్నయ్యలు లేరు. నాభర్త నీకేదో ద్రోహం చేశాడని నా కన్యాయం తలపెట్టవద్దన్నయ్యా చంపదల్చు కుంటే నన్ను చంపేసేయ్. కానీ నీ అన్యాయం కొన సాగితే ఆ తర్వాత ఈ చెల్లి ఎలాగూ బ్రతకదన్నయ్యా."

జగ్గడు తగబడ్డాడు—"ఏమిటీ అర్థంలేని వరసలు...." అన్నాడు విసుగ్గా.

"నా భర్త పరమ దుర్మార్గుడు కావచ్చు. కానీ నా అన్నయ్య అలాంటివాడు కాకూడదు. నిన్ను నా మానం కాపాడిన అన్నయ్యగా జీవితాంతం గుర్తుంచుకుని పూజి స్తాను. నన్ను వదిలిపెట్టు అన్నయ్యా...." అంది అనసూయ.

జగ్గడు ఆగిపోయాడు. అనసూయ కళ్ళు మూసుకుంది.

"ఫరవాలేదు—కళ్ళు తెరు...." అన్నాడు జగ్గడు. అనసూయ కళ్ళు తెరిచింది.

"అన్నయ్యా అని పిలిచిన ఆడదాని ఒంటిమీద చెయ్యే సేటంత ఎదవకాడీ జగ్గడు. కానీ నన్ను అన్నయ్యా అని పిలిచావుగదా—మరి నా పెళ్ళాం నీకేమవుతుంది!"— అన్నాడు జగ్గడు.

అనసూయ మాట్లాడలేదు.

"అదీ నీకు చెల్లెలే అవుతుంది. ఎలాగో నీ మొగణ్ని డుగు. నేను వెడతాను...." అని అక్కణ్ణించి కదిలి వెళ్ళే ముందు—"ఒపేవ్ అప్పి—నువ్వు గనుక మళ్ళీ నా

ఇంటి గడప తొక్కావో—ప్రాణాలు తీసేస్తాను. అందు కింకేమీ అనుమానంలేదు....” అన్నాడు.

4

జైల్లో ఉన్న జగ్గడిని వెంకడు కలుసుకున్నాడు.

“ఒరేయ్ వెంకా—ఒక్కటేరా నాకోరిక. నా కొడుకు గొప్పవాడు నానక్కర్లేదు. రాజ్యా లేలక్కర్లేదు. వాడికి సెంటిమెంటుండ కూడదురా. ఆ ఎదవ సెంటిమెంటే నన్నీగతికి తెచ్చింది....” అన్నాడు.

జగ్గడి ఏణ్నర్థం జైలు శిక్షపడింది. కోర్టులో అతని మీద మానభంగ ప్రయత్నం నేరంగా మోపబడింది. అప్పాయమ్మ, అనసూయ, వాచ్‌మెన్, రంగారావు అత నికి వ్యతిరేకంగా సాక్ష్య మిచ్చారు. చక్కని కట్టుకధ అల్లబడింది. జగ్గడు అప్పాయమ్మకూ, రంగారావుకూ ఉన్న పవిత్రానుబంధాన్ని శంకించి ప్రతీకారంగా అన సూయమీద అత్యాచారం చేయబోయాడనీ—రంగారావు సమయస్ఫూర్తి ఆమెను కాపాడిందనీ కోర్టులో తేలింది.

అవసరానికి అన్నయ్యా అనిపిలిచిన అనసూయ కోర్టులో జగ్గణ్ణి కర్కోటకుడనీ, దుర్మార్గుడనీ, నీచుడనీ—అన్నా అనిపించినా చలించని దుర్మార్గుడనీ అంది. ఆమె ఆరోపణలు విన్న జగ్గడి మనసు అవమానంతో కుంచించుకు పోయింది.

“ఒరేయ్ వెంకా-అవన్నీ చేసినా నాకు దానిమీద అత్యా చారం చేయాలని లేదురా, అన్నయ్యా అని పిలిచిందిరా అది. దానిజోలికి నేనింక వెళ్ళలేను. ఆ పిలుపు నన్ను కట్టేసింది. ఎదవ సెంటిమెంట్లు చంపుకోమన్నాడు రంగా రావు నన్ను—నా పెళ్ళాన్ని తననుభవించినప్పుడు. ఆ

ఎదవ సెంటిమెంటే వాడి పెళ్ళాన్ని రక్షించింది. ఈ డబ్బునోళ్ళ ఆటలు కట్టాలంటే మనకు సెంటిమెంటుండ కూడదురా-అందుకే నా కొడుకుని ఇప్పట్నించీ సెంటి మెంటు లేకుండా పెంచాలిరా...."

వెంకడు మాట్లాడలేదు.

ఏణ్నర్థం తర్వాత జగ్గడు జైల్నించి తిరిగొచ్చేదాకా సుబ్బన్న వెంకడిదగ్గరే పెరిగాడు. జైల్నించి తిరిగొచ్చేక జగ్గడిలో కొన్ని మార్పులొచ్చాయి. అతనో కిళ్ళీబడ్డీ తెరిచాడు. కొడుకుని బడి మానిపించేశాడు.

బళ్ళో చెప్పిన పాఠాలేవీ నమ్మొద్దన్నాడు. ఈ ప్రపంచమంతా డబ్బుమీదే నడుస్తోందన్నాడు. డబ్బు కోసం ఏంచేసినా తప్పులేదు. కానీ పోలీసులకు దొర క్కుండా జాగ్రత్త పడాలన్నాడు. ఎవడైనా ఎప్పుడైనా చేతికి చిక్కితే ఏమాత్రం కనికరించకూడదన్నాడు. మన కపకారం చేసిన వాడిమీద ఏ పరిస్థితుల్లోనూ జాలిపడకూడ దన్నాడు. ప్రపంచ వ్యవహారాల్లో వావివరుసలూ, బంధు త్వాలూ గురించి పట్టించుకోకూడదన్నాడు.

తండ్రి చెప్పినవన్నీ సుబ్బన్న పసి హృదయంమీద బాగా పనిచేశాయి. ఎదుగుతున్నకొద్దీ అతను బాగా మొరటు వాడుగా తయారయ్యాడు. డబ్బుకోసం ఏమైనా చేస్తా డతను. తను చేయబోయే పని—ఎలాంటిదీ అన్న ఆలో చన కూడా ఉండదు సుబ్బన్నకు.

సుబ్బన్న కిరవై ఏళ్ళు వచ్చేసరికి అతను ఊళ్ళో మంచి పేరు సంపాదించాడు. సుబ్బన్న అంటే చాలామందికి భయం. అతను నేరాలవలీలగా చేస్తాడని ఎక్కువమంది చెప్పుకుంటారు. కానీ అతను పోలీసుల కెన్నడూ దొరక లేదు.

సుబ్బన్నకి తండ్రి చిన్నతనంనుంచీ ఇచ్చిన శిక్షణవల్ల సెంటిమెంటు తెలియదు. తనకు సాయంచేసిన వాడి కపకారం చేయడాని కతనేమాత్రమూ సంకోచించడు. అతను తలపెట్టిన దారుణాన్ని కన్నీళ్ళాపలేవు. జాలి పలు కులు వారించలేవు. కానీ చేసేదేదో చాలా తెలివిగా, రహస్యంగా చేస్తాడు.

కొడుకు ప్రవర్తన జగ్గడికి చాలా తృప్తిగావుంది. అన్ని విధాలా తన కొడుకు వృద్ధిలోకి వచ్చేడని రూఢి చేసు కున్నాక కొడుకుని పిలిచి—"ఒరేయ్ సుబ్బన్నా-నువ్వు నాకో పని చేసిపెట్టాలిరా...." అన్నాడు.

"చెప్పు...." అన్నాడు.

"రంగారావు తెలుసుగదా—వాడి కూతుర్ని వాడి కళ్ళ ముందే అనుభవించాలి నువ్వు...." అన్నాడు జగ్గడు.

సుబ్బన్న చలించలేదు—"అలాగే జేస్తాను. కానీ ఇలాంటి పనులూరికే చేసే అలవాటు లేదు నాకు...." అన్నాడు.

జగ్గడు ఆశ్చర్యంగా—"నేను నీ బాబువిరా...." అన్నాడు.

"వ్యవహారం దగ్గర మనకి సెంటిమెట్లు పనికిరావు...." అన్నాడు సుబ్బన్న.

జగ్గడికి చాలా సంతోషమయింది. తన కొడుకో పని సాధించగలడని అతనికి పూర్తిగా రూఢి అయింది— "మామూలుగా కాదురా—మీ ఇద్దరూ వ్యవహారంలో ఉండగా నేను ఫోటో తీస్తాను. ఎంతకావాలో చెప్పు...." అన్నాడు.

"రెండువేలు...."

"సరే అలాగే ఇస్తాను...."

"ఇస్తానంటే కాదు. ఒక వెయ్యి అడ్వాన్సివ్వాలి...." అన్నాడు సుబ్బన్న.

జగడికి చాలా ముచ్చటయింది—"ఇస్తాను కానీ—నేను ఫోటో తీసుకుందు కెక్కడికి రావాలంటావ్?"

"పిల్లదాన్ని మనింటికే తీసుకొస్తాను. ఫోటో తీసుకుందుకు నీకు బాగా వీలుగా ఉంటుంది...." అన్నాడు సుబ్బన్న.

5

సుబ్బన్న చాలా సులభంగా తననుకున్నది సాధించాడు. అతను సూటూ బూటూ వేసుకుని కాలేజీ దగ్గర రంగారావు కూతురు కళ్యాణిని కలుసుకున్నాడు. చాలా నమ్మకంగా మాట్లాడి ఆమె తండ్రి ఫలానాచోట ఉన్నాడు—రమ్మంటున్నాడని చెప్పాడు. అతని వేషధారణ, ఉచ్చారణ ఆమెను మోసం చేశాయి. అతనొక చిన్న పెంకుటింటికి తీసుకువెడితే ఆమె కనుమానంరాగా—అతను తెలివిగా ఆమెను నమ్మించి లోపలకు రప్పించాడు. అతని సంభాషణా చాతురి అద్భుతం.

లోపలకు రాగానే కళ్యాణికి కత్తి చూపించాడు సుబ్బన్న. ఆమె హడిలిపోయింది. అతను చెప్పినట్లు విని లొంగిపోవడాని కామె కెంతో సమయం పట్టలేదు. ఏ మాత్రమూ ప్రతిఘటించలేదామె. ప్రతిఘటిస్తే చంపేస్తాడేమోనని భయపడిందామె.

జగ్గడు చాలా హాయిగా, తాపీగా వాళ్ళిద్దరినీ ఫోటోలు తీశాడు. ఇదేదో బ్లాక్ మెయిల్ వ్యవహారం కానున్నదని కళ్యాణికి తెలిసిపోయింది. ఇష్టంలేకపోయినా ఆమెకు తప్పలేదు.

తన అవసరం తీరేక సుబ్బన్న ఆమెను వదిలిపెట్టే శాడు. తండ్రి దగ్గర ఇంకో వెయ్యి వసూలు చేసుకున్నాడు.

రెండ్రోజులు పోయాక జగ్గడు రంగారావుని కలుసుకుని—"కులాసాగా ఉన్నారా బావగారూ...." అనడిగాడు.

రంగారావు మండిపడి—"తప్పనిసరై ఒకసారి నా పెళ్ళాం నిన్ను అన్నా అందిగా అని వరస కలుపుతావుట్రా వెధవా...." అన్నాడు.

"మాటలు జాగ్రత్తగా రానీండి. నేను బావగారూ అన్న కారణంవేరు. ఈ ఫోటో బాగా చూడండి. ఇందులో ఉన్న మగాడు మా అబ్బాయి. అమ్మా యెవరో చూడండి. నేను బావగారూ అనెందుకు పిలుస్తున్నానో తెలుస్తుంది...."

ఫోటో చూసి రంగారావు మ్రాన్పడిపోయాడు. అతనికి నోట మాట రాలేదు.

"ఏయ్ రంగా—పగ. ఒకటికాదు—రెండుకాదు—పదమూడేళ్ళుగా రేగుతున్న పగ. నా కొడుకు సుబ్బన్న నాకులా ఎదవకాదు. నీకు చెల్లెనని దణ్ణంపెడితే ఆడదాన్నొదిలిపెట్టే రకంకాదు వాడు. వాడేంచేస్తాడో వివరంగా తెలుసుకోవాలంటే నా దగ్గరింకా చాలా ఫోటోలున్నాయి. నేనడిగింది నీదగ్గర్నుంచి దొరక్కపోతే ఈ ఫోటో లింకా చాలామంది చూస్తారు...." అన్నాడు జగ్గడు.

"ఏంకావాలి నీకు"—అన్నాడు రంగారావు.

"దెబ్బకు దెబ్బ. రక్తానికి రక్తం...."

"అంటే"

"నీ పెళ్ళాం కావాల్నాకు. అన్నా అని పిలిచిందని

వదిలిపెట్టేశాను. అది నన్ను జైలుకి పంపించింది. నా పెళ్ళాన్నెలాగూ వాడుకున్నావ్ నువ్వు. కాబట్టి నీ పెళ్ళాం నాకూ వరసే అవుతుంది. ఏ బలవంతం నేరంమీద నన్నది జైలుకు పంపించిందో—అదేనేరం ఇప్పుడు నీ యొక్క, దానియొక్క అనుమతిలో జరగాలి...."

రంగారావు పళ్ళు కరకరలాడాయి.

"అలా చప్పుళ్ళు చేయకు. నీ కూతురు బ్రతుకు నా చేతిలో ఉంది...." అన్నాడు జగ్గడు.

రంగారావుకేం జవాబివ్వాలో తోచలేదు.

6

జగ్గడికి చాలా సంతోషంగా ఉంది. రేపే అనసూయ తనతో ఉండడానికి ఒప్పుకుంది. దాని మొగుడు దాని ఎదురుగా ఉండి దానిచేత ఆ మాట లనిపించేడు. దాని కళ్ళలో పేళ్ళున్నా తన కంటివేడి ఆవిరుల కవి ఇగిరిపోయాయి.

డబ్బుంది కదా అని తన జీవితంతో ఆటలాడబోయిన రంగారావుకు జీవితాంతం గుర్తుండిపోయే అవమానం జరుగుతోంది. ఇందుకు సుబ్బన్న తనకు చాలా సాయపడ్డాడు.

భోజనం చేయడానికి కొడుకుకోసం ఎదురుచూస్తున్నాడు. సుబ్బన్న కాస్త ఆలశ్యంగా వచ్చాడు. తండ్రీ కొడుకులిద్దరూ కలిపి భోంచేశారు.

భోజనాలయ్యేక సుబ్బన్న తండ్రికి స్వయంగా మజ్జిగ దాహం ఇచ్చాడు.

జగ్గడు తాగడం పూర్తికాగానే విరుచుకు పడిపోయాడు. సుబ్బన్న చలించలేదు. తండ్రిని మంచంమీద చేర్చాడు.

పడుకోబెట్టి దుప్పటి కప్పాడు. తర్వాత పెట్టెలు వెదికాడు. దొరికిన కొన్ని కవర్లు తీసుకుని అన్నీ పరిశీలించి తృప్తిగా తలాడించి—వాటిని పాంటు జేబులోకి తోసేశాడు.

ఇంకో పదినిముషాలుండి—ఇల్లు తాళం వేసుకుని రంగారావింటికి వెళ్ళాడు.

రంగారావు సుబ్బన్నకోసం ఎదురు చూస్తున్నాడు.

"ఏమయింది?" ఆత్రంగా అడిగాడు రంగారావు.

"మీరిచ్చిన పొడి మజ్జిగలో కలిపి మా నాన్నకిచ్చాను. విరుచుకు పడిపోయాడు. బహుశా చచ్చిపోయాడను కుంటాను. శ్వాస ఆడ్డంలేదు...." అన్నాడు సుబ్బన్న.

రంగారావు ఆశ్చర్యంగా సుబ్బన్నవంక చూసి-"అంటే-మీ నాన్నను చంపేశావన్నమాట! నీకు బాధగా లేదూ?"—అన్నాడు.

"ఎదవ సెంటిమెంట్లు గురించి నాదగ్గర మాట్లాడకండి. అన్నప్రకారం తక్కిన పదిహేనువేలూ ఇవ్వండి...." అన్నాడు సుబ్బన్న. వాడి కళ్ళలో విషాదం ఏమాత్రమూ లేదు.

రంగారావు అన్నీ వందరూపాయల నోట్లు నూటయాభై ఇచ్చాడు—"మరి నెగెటివ్వు తెచ్చావా?"

సుబ్బన్న జేబులోని కవర్లు అందించి—"అన్నీ ఇవ్వ లేదు. ఇంకా రెండు నా దగ్గరున్నాయి...." అన్నాడు.

"ఎందుకని?"

"మా నాన్న చావుగురించి ఎవరికీ ఏ అనుమానమూ రాకుండా ఉండేలా చూస్తాననీ—అంత్యక్రియాలవీ మీరే జరిపిస్తాననీ చెప్పారు. వ్యవహారం పూర్తయి అన్నీ సక్ర మంగా ముగిసేదాకా—ఆ రెండు నెగెటివులూ నా దగ్గరే

ఉంటాయి"—అన్నాడు సుబ్బన్న.

సుబ్బన్న ముఖ కవళికలు చూపిన రంగారావు నమ్మ లేక పోతున్నాడు. వీడు మనిషా? పశువా? తండ్రిని చంపే శాడు డబ్బుకోసం. ఇంతపిసరు విచారం వాడి ముఖంలో కనపడ్డంలేదు.

"సరే-అలాగే-కానీ మరి నువ్వు మా అమ్మాయి జోలికి రాకూడదు...."

"బాగుంది. ఆ పిల్ల నాకెందుకు? డబ్బిస్తే అంతకంటె మంచి పిల్లలు దొరుకుతారు నాకు. మీ అమ్మాయికోసం మా నాన్న నాకు రెండువేలిచ్చాడు. అందుకని తప్పితే లేకపోతే మీ అమ్మాయి జోలికి నేను వచ్చేవాడినేకాదు" అన్నాడు సుబ్బన్న.

"సెహబాష్ సుబ్బన్నా-నీలాంటి మనిషే నాక్కావాలి, అప్పుడప్పుడు కనిపిస్తూండు...." అన్నాడు రంగారావు.

"అలాగే. సరైన ధర ముట్టచెబితే ఏ పనైనా చేసే స్తాను...." అన్నాడు సుబ్బన్న.

ధనికులపై కత్తికట్టి తన కొడుకుని అమానుషుడిగా తయారుచేసేడు జగ్గడు.కానీ తన కొడుకు అమానుషత్వమే వారికి శ్రీరామరక్ష కాగలదని అతనెన్నడూ ఆలోచించ లేదు.

సెంటిమెంటు కారణంగా జైలు పాలయ్యానని బాధ పడి-కొడుకును సెంటిమెంట్సుకు అతీతంగా పెంచితే— అదీ తన ప్రాణానికే వచ్చింది జగ్గడికి. నిప్పును తాకితే కాల్చక మానదన్నట్లు, డబ్బున్నవాడితో పేచీపడే పేదల బ్రతుకులంతే!!

□□□

జరుగబోయే దారుణం!

వాసవదత్త

బంగళా పైని టెర్రేస్ మీదికొచ్చి నిలబడి గార్డెన్ని చూస్తున్నాడు తపన్ సిన్హా.

గంభీరమైన హేండ్సమ్ పర్సనాలిటీ అతనిది. లేత పసుపు రంగు ఫుల్ సూట్ పొడుగైన అతని విగ్రహాన్ని మరింత పొడవుగా కన్పించేట్టు చేస్తోంది.

అతను మెడ్రాస్ ఫిల్మ్ పరిశ్రమలో పేరుమోసిన ఆర్ట్ డైరెక్టర్.

తపన్ సిన్హాకి అతని గార్డెన్ అంటే ప్రాణం. అతను ఎక్కడెక్కడి నుంచో రంగురంగుల పూలమొక్కలు, లతలు సంపాదించి గార్డెన్ని ఆకర్షణీయంగా ఒక రంగు రంగుల చిత్రపటంలా తీర్చిదిద్దుతూ ఉంటాడు. సినిమా సెట్స్లోని సీన్కి కావలసిన ఎఫెక్ట్స్ కోసం ఆలోచిస్తున్నాడు.

తపన్‌సిన్హా ఆర్ట్‌డైరెక్షన్ చేసిన ప్రతి చిత్రంలోను ఒక స్పెషాలిటీ ఉండి తీరుతుంది. ముఖ్యంగా పిక్చర్‌లోని లాస్ట్‌సీన్ ఒక రంగుల కాన్వాస్‌లాగా ఉండేట్లు చాలా శ్రద్ధ వహిస్తాడు.

కిర్రుమని తలుపు తెరుచుకోగానే అటువైపు చూసేడు సిన్హా. అతని ముఖంమీద ఆశ్చర్యం తాండవించింది. ఫౌంటెన్ చుట్టూ ఉన్న పిమెంట్ వాక్‌పైగా నడిచి వస్తున్న భారీమనిషిని చూడగానే గబగబా క్రిందికి వచ్చేడు.

డార్క్‌బ్లూ సూట్‌లోని భారీమనిషి ఫేమస్ సైకాలజిస్ట్ ప్రొఫెసర్ వామ్.

"వేళకాని వేళ ఇలా వచ్చారేమిటి" అనడిగాడు సిన్హా.

"ఈ ప్రాంతంకి వచ్చినప్పుడు ఓసారి రమ్మని మీరు ఆహ్వానించేరు. మీ ఆహ్వానం పురస్కరించుకొని ఇలా వచ్చేను" అన్నారు వామ్.

"యు ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్ ప్రొఫెసర్. రండి అలా మేడమీది కెళ్దాం" అంటూ ముందుకి దారితీసేడు సిన్హా.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

ఓమూలగా అమర్చిన స్టీరియో నుండి అలీ అక్బర్‌ఖాన్ లాంగ్ ప్లేరికార్డ్ నుండి మ్యూజిక్ వినవస్తోంది. గార్డెన్‌లో నుండి సన్న సువాసనలు గాల్లో తేలుతూ వారి వైపుకి వస్తున్నాయి.

ప్రొఫెసర్ వామ్ చుట్టూ కలయజూచి తపన్‌సిన్హా టేస్ట్‌ని మెచ్చుకున్నారు.

తపన్‌సిన్హా గదిలో నుండి చిన్న చక్రాల తోపుడు బండి మీద పేర్చిన పానీయాల సెట్‌ని తీసుకుంటూ వచ్చేడు.

"ఏం తీసుకుంటారు ప్రొఫెసర్!" అడిగేడు.

"ప్లెయిన్ సోడావాటర్‌లో కొంచెం లైమ్‌జ్యూస్ కలిపి ఇవ్వండి." అన్నారు వామ్.

"మీరు ఏదో విశేషముంటేనేగాని రారు" డ్రింక్ సిప్ చేస్తూ అన్నాడు పిన్హా.

ప్రొఫెసర్ అవునన్నట్లు తలూపి, "ఒక క్రైమ్ గురించి ఇన్‌వెస్టిగేట్ చేద్దామని వచ్చేను." అన్నారు.

కూల్ డ్రింక్ తాగుతూన్న తపన్‌పిన్హా గ్లాసు మధ్యలోనే ఆగిపోయింది.

"ఏదైనా దారుణం జరిగిందా?" అడిగేడు. ప్రొఫెసర్ అతని ముఖంలోకి నిదానంగా చూపి "ఊహుం. ఇంకా జరగలేదు" అన్నారు.

పిన్హా ఆశ్చర్యపోయేడు.

"మీరు హాస్యమాడుతున్నారు. ఇంకా జరగని క్రైమ్‌ని గురించి ముందుగా ఎలా పరిశోధిస్తున్నారు" అడిగేడు.

వామ్ మౌనంగా లైమ్‌జ్యూస్ తాగి, బల్లమీద గ్లాస్ నుంచేరు. టైమ్ చూసుకున్నారు.

సాయంత్రం ఏడు అవస్తోంది. ఆకాశంలోకి అప్పుడే చంద్రుడు పైకివస్తున్నాడు. ఉండుండి ఒక్కొక్క నక్షత్రం తళుక్‌మంటున్నది. గార్డెన్ నుండి వస్తున్న గాలి మరి కాస్త చల్లగా సోకుతోంది.

"ఇంత చక్కని వాతావరణంలో ఏదైనా క్రైం జరిగితే ఎంత భీభత్సంగా ఉంటుంది!!" అన్నాడు వామ్.

"అలాంటిదేదైనా జరుగుతుందని మీకెలా తెలిసింది" అడిగేడు తపన్‌పిన్హా.

"తెలిసింది కనుకనే ఆ దారుణకృత్యాన్ని జరుగకుండా ఆపాలని వచ్చేను. మీరు నాకు సహకరించాలి"

అన్నారు వామ్.

"ష్యూర్. మీకు సాయపడ్డానంటే నాకు గర్వంగా ఉంటుంది" అన్నాడు సిన్హా.

స్టీరియోలో రికార్డ్ మారింది. రవిశంకర్ సితార్ సన్నగా మ్రోగుతోంది.

ప్రొఫెసర్ టాపిక్ మార్చి "చూడండి. అటువైపు చెట్టుకొమ్మ దిగువ కందిరీగల పట్టు ఉంది కదూ" అన్నారు గార్డెన్‌వైపుకి చూస్తూ.

తపన్‌సిన్హా కుర్చీలో ముందుకి వంగి, "యస్. దాన్ని తీసేయమని రమేశ్‌చంద్రకి చెప్పేను. ఈరోజు వచ్చి తీస్తానని కూడా అతను ప్రామిస్ చేసేడు" అన్నాడు.

"మీకు తోటపనిలో బాగా ప్రవేశం ఉంది. కందిరీగ పట్టుని ఎలా తొలగిస్తారో చెప్పగలరా?" అడిగేడు వామ్.

"పిచికారిలో పెట్రోల్ నింపి జల్లితే కందిరీగలు చచ్చిపోతాయి. పెట్రోల్, పిచికారితెస్తానని రమేష్ చెప్పేడు."

"అదికాక మరో పద్ధతికూడా ఉంది. సైనేడ్ ఉపయోగిస్తే కూడా ఫలితం కనిపిస్తుంది" అన్నారు వామ్.

తపన్‌సిన్హా ఉలిక్కిపడ్డాడు. "కాని....కాని....సైనేడ్ చాల తీవ్రమైన పాయిజన్. ఉపయోగించడంలో అజాగ్రత్తగా ఉంటే రిస్క్ ఉంటుంది" అన్నాడు.

సంభాషణ గంభీరంగా సాగుతూండే సరికి టాపిక్ మార్చాలని "మనని సాధించే అత్తగారిలాంటి వారిని అడ్డుతొలగించాలంటే మాత్రం సైనేడ్ చాలా పనికొస్తుంది" అన్నాడు తపన్‌సిన్హా నవ్వుతూ.

ప్రొఫెసర్ మాత్రం అతని నవ్వులో పాలు పంచుకోలేదు.

"రమేష్ చంద్ర ఉపయోగిస్తానన్నది పెట్రోల్ మాత్రమేనా?" అడిగేరాయన.

"యస్. నిన్న సాయంత్రం ఇలా కూర్చొని మాట్లాడుకుంటున్నాం. ఓ కందిరీగ జుఁయ్‌మంటూ వచ్చి అతని చేతిని కుట్టింది. ఇక ఆ కందిరీగల్ని తొలగించకపోతే చాలా న్యూసెన్స్‌గా ఉందని రమేష్‌తో అన్నాను. పెట్రోల్ పిచికారితో తీసేస్తానని నాతో అన్నాడు. అయినా....మీరు ఎందుకు అడుగుతున్నారు" అడిగేడు సిన్హా.

"నిన్న చైనాబజార్‌లో కెమిస్ట్ షాప్‌కెళ్ళి ఓ మందు తీసుకున్నాను. పాయిజన్ మందుల్ని కొన్నవారు రిజిస్టర్‌లో సంతకం చెయ్యాలి. రిజిస్టర్‌లో సంతకం చేస్తూ పైన రాసిన పేరు చూసేను. రమేష్‌చంద్ర పేరున సైనేడ్ కొన్నట్లుగా రాసి ఉంది" అన్నారు వామ్.

తపన్‌సిన్హా నిర్ఘాంత పోయేడు.

"చాలా ఆశ్చర్యంగా ఉంది.... కాని....రమేష్ సైనేడ్ కొంటానని నాతో చెప్పలేదు" ఏదో ఆలోచించుకొని....

"నో....ప్రొఫెసర్ రమేష్ ఎవరికీ అపకారం చేసే మనిషి కాదు. బహుశా పెట్రోల్ ఉపయోగిస్తే ఫలితం కనిపించక పోవచ్చని. ఉద్దేశ్యం మార్చుకుని సైనేడ్ కొని ఉంటాడు. అంతమాత్రం చేత...." అన్నాడు సిన్హా.

ప్రొఫెసర్ వామ్ టెర్రేస్ నుంచి కనిపించే రోజ్ పొదలని చూస్తూ అడిగేరు.

"రమేష్ చంద్ర అంటే మీకు యిష్టమా?"

తపన్‌సిన్హా దగ్గేడు కర్చీఫ్ తీసి అడ్డుపెట్టుకుని "రమేష్ నాకు కాలంగా తెలుసు. అతనంటే నాకు మంచి నమ్మకం ఉంది." అన్నాడు. ఇంకేం చెప్పాలో అతనికి తోచలేదు.

ప్రొఫెసర్ పైప్ తీసి, టిన్‌లోని టొబాకో దానిలో నింపసాగేరు. నిండినది లేనిది చూసి, ముట్టించి నింపాదిగా పొగవదిలేరు.

తీగలుగా గాల్లో తేలుకున్న పొగల్లోకి చూస్తూ "మృణాళినితో మీ పెళ్ళి నిశ్చయమయింది కదూ?" అన్నాడు.

సిన్హా తలూపాడు.

"నైస్ గర్ల్. ఆమెకు మీతో పరిచయం కాకపూర్వం రమేష్‌చంద్ర ఆమెని ప్రేమించేవాడని మీకు తెలుసా?" అడిగేరు ప్రొఫెసర్.

"తెలుసు. కాని, పాత విషయాన్ని మనస్సులో వుంచుకుని మగ్గిపోయే సంకుచిత భావం రమేష్‌చంద్రకి లేదు. మీకా అనుమానం ఉండనక్కరలేదు" అన్నాడు.

"అతను పైకి అలా ప్రవర్తిస్తున్నా, లోపల ఎక్కడో అతనిలో ఈర్ష్య పేరుకునివుంది. ఈర్ష్య భయంకరమైన విషంలాంటిది" అన్నారు వామ్.

"కాని రమేష్‌కి లోపల ఈర్ష్యవున్నా ప్రాణాలు తీసేంతటి కసాయికాడని నా నమ్మకం" అన్నాడు సిన్హా.

పైప్‌తో కందిరీగల పట్టుని చూపించి—

"కాని ఆ రమేష్‌చంద్రయే ఈ రోజు వందలాది కందరీగల ప్రాణాలు చిటికలో తుడిచేస్తానని అన్నాడు." అన్నాడు ప్రొఫెసర్ వామ్.

తపన్‌సిన్హా విస్పహాయంగా నిట్టూర్చి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు.

"అదిసరే రమేష్‌చంద్ర ఈ రోజెన్ని గంటలకి వస్తానన్నాడు?" అడిగేడు ప్రొఫెసర్.

"తొమ్మిది గంటలకి వస్తానన్నాడు" జవాబిచ్చేడు సిన్హా.

ప్రొఫెసర్ చేతికున్న వాచి చూసుకున్నారు. పావు తక్కువ ఎనిమిదయింది. ఆయన లేచి నిలబడ్డారు.

తపన్‌సిన్హా కూడా లేచాడు. "అంటే మీరు నన్ను హెచ్చరిద్దామని ఇంతదూరం వచ్చేరన్న మాట.... చూడండి.... ప్రొఫెసర్.... ఇది సినిమాలో కథ కాదు.... భగ్న ప్రేమికుడు విషం ప్రయోగించి తను ప్రేమించిన యువతికి కాబోయే భర్తని హత్య చేసేందుకు...." గబగబా అన్నాడు.

కాని అప్పటికే ప్రొఫెసర్ వామ్ చకచకా నడిచి గార్డెన్‌ని నాలుగంగల్లో దాటుకుని బయటకొచ్చేరు.

వీధిమలుపు తిరిగేసరికి ఆయన నడక మందగించింది. నీలాకాశంలోకి చూస్తూ నెమ్మదిగా నడవసాగేరు. అంటే ఆయన ఆలోచనలు తీవ్రంగా ఎక్కడో కేంద్రీకృతమై ఉన్నాయి.

దాదాపు గంటసేపు చల్లగాలిలో తిరిగి పావు తక్కువ తొమ్మిదికి, మళ్ళీ సిన్హా ఇంటిముందుకొచ్చి ఆగేరు.

లోపలినుండి సన్నగా పొడుగాటి వ్యక్తి హడావుడిగా తలుపు తీసుకుని ప్రొఫెసర్‌కి ఎదురయ్యేడు. దట్టమైన ఉంగరాల జుత్తు నుదురుమీద పడుతుంటే సర్దుకొని ప్రొఫెసర్‌ని చూసి "గుడీవెనింగ్ ప్రొఫెసర్. అర్జంటు పనుండి వచ్చేను. టెర్రేస్‌మీద సిన్హా వున్నాడు, వెళ్ళండి" అన్నాడా వ్యక్తి.

అతను రమేష్‌చంద్ర.

"ఐసీ.... సిన్హా టెర్రేస్ మీదనే ఉన్నాడన్న మాట. ఐ వండర్...." అంటూ మీదికి నడిచేడు.

తపన్‌పిన్హా మొదట తాను చూచినట్లే అదే కుర్చీలో విశ్చలంగా కూర్చుని వున్నాడు.

బాల్కనీలోని లైట్లు వెలగడంలేదు. స్టీరియో సెట్ కూడా ఆఫ్ చేయబడివుంది.

ప్రొఫెసర్ వెళ్ళి స్టీరియో ఆన్ చేసేరు. మ్యూజిక్ చెవుల పడగానే తపన్‌పిన్హా ఉలిక్కిపడి లేచేడు.

"ఒంట్లో ఎలావుంది?" అడిగేడు వామ్.

తపన్‌పిన్హా తొట్రుపడి "ఆఁ .... యస్....ఎలా వుంటుంది....మామూలుగానే వుంది" అన్నాడు. అతని ముఖం వాలిపోయింది ముఖాన్ని చెమటలు పట్టేయి.

ప్రొఫెసర్ టేబిల్‌లాంప్ స్విచ్ వేసి కూర్చున్నాడు.

"ఏమైనా విపరీతమయిన లక్షణాలు కనిపిస్తున్నాయా" అడిగేరాయన పిన్హా ముఖంలోకి చూస్తూ.

"ఎలాంటి లక్షణాలు?" అడిగేడు తపన్‌పిన్హా.

"ఉండుండి వాంతి వచ్చినట్లుండడం....కడుపులో.... ఏదో చికాకుగా ఉండడం....అంటూ" చిన్నగా నవ్వి "వాంతికోసం వాషింగ్ సోడా తీసుకుంటే అలాగే వుంటుంది" అన్నారు ప్రొఫెసర్ వామ్.

"వాషింగ్....సోడా! ఏమిటి...మీరంటున్నది" అడిగేడు తపన్‌పిన్హా.

"అవును....ఇందాకా వెళ్ళటోయే ముందు మీ కోటు జేబులో సైనేడ్ బదులు నేనుంచినది వాషింగ్‌సోడా పొట్లాం" అన్నాడు వామ్.

పిన్హా విశ్చేష్టుడై ప్రొఫెసర్‌కేసి చూసి ఆగిపోయేడు.

తిరిగి ప్రొఫెసర్ మాట్లాడేడు.

"చేతికి అందుబాటుగా ఉండాలంటే—పాయిజన్‌ని

కూల్‌డ్రింక్‌లో కలపాలనుకున్నపుడు-కుడిచేతివైపు కోటు జేబులో ఉంచుకుంటారు. అది గ్రహించి మీ జేబులోని సైనేడ్‌ని తీసి దానిస్థానే వాషింగ్‌సోడా వుంచేను" అన్నారు.

తపన్‌సిన్హా కుర్చీలో జేరబడి కళ్ళు మూసుకున్నాడు.

"రమేష్‌చంద్ర ఇక్కడికి ఎనిమిన్నరకే వచ్చేడు. కాని తొమ్మిదికి గాని రాడని మీరు చెప్పారు. నిజానికి అతన్ని సైనేడ్ తెమ్మని పురమాయించేరు. మొన్న రిజిస్టర్‌లో అతని సంతకం చూసి రమేష్‌ని అడిగేను. మీరే కావాలని అతని ద్వారా తెప్పించేరని చెప్పేడు. దీనికి కారణం——?" ఆగేరు వామ్.

స్టీరియోలో నుండి యిప్పుడు బిస్మిల్లాఖాన్ షహనాయి వినిపిస్తోంది.

"కారణం ఏమిటంటే మీరు ఆత్మహత్య చేసుకుని ఆ అపరాధాన్ని రమేష్‌చంద్రపై ఆరోపించాలని." అన్నారు వామ్.

తపన్‌సిన్హా కళ్ళుతెరిచి, "అలా చేస్తే నాకేం లాభిస్తుంది" అన్నాడు.

"ఏమీ లాభించదు. ఒక రకమయిన కసిచల్లారుతుంది. మృణాళిని, రమేష్‌చంద్రలు ఏదో గిల్లికజ్జాలు పెట్టుకుని విడిపోయేరు. తిరిగి వారిద్దరూ కలుసుకుని ఒకటి కాబో తున్నారు. అది మీరు సహించలేరు.

ఇంకో విషయం; మీకు టి. బి. విషమించిందని మీ డాక్టరు చెప్పేడు. మీరు నిస్పృహతో డాక్టరు నుండి వస్తూండగా మీ ముఖంలోని భావాల్ని చూసేను. సమయాని కొచ్చి మీరేఘోరం తలపెట్టకుండా అపుదామని వచ్చేను"

అన్నాడు వామ్.

తపన్‌పిన్హా కళ్ళు నీళ్ళలో చెమర్చాయి.

"నాకు బతకాలని లేదు ప్రొఫెసర్. నేను ఓడిపోయేను" అన్నాడు నిరాశగా.

"అదే వెరీ బేడ్. మీరు మంచి కళాకారులు. మీరు కుమిలిపోయి చేసేదేమీ లేదు. రేపే మిమ్మల్ని నా ఫ్రెండ్ వద్దకి తీసుకెళ్తాను. మొన్న మీ ఎక్స్‌రే రిపోర్టు చూసేను. ఇంకా ఒక లంగ్ పూర్తిగా ఆరోగ్యంగా వుంది.

మనిషి జీవించి వుండడానికి లంగ్‌లోని ఒక లోబ్ చాలు. అంటే మీరు ఇంకా జీవితాంతం చీకూచింతా లేకుండా గడిపేసేంతటి లంగ్ కెపాసిటీ ఉందన్నమాట. రేపు నాతో రావడానికి రెడీగా వుండండి. గుడ్‌నైట్" లేచి షేక్‌హేండిచ్చేరు వామ్.

ఆయన వెళ్ళినవైపునే చూస్తూ వుండిపోయేడు తపన్‌పిన్హా. □□□

అప్పు—?

"ఏమండీ, మీ స్నేహితుడి దగ్గర అప్పుచేసి లాట్రి కట్టిన రూపాయివల్ల ఐదువేలు ప్రయిజు వచ్చింది గదా! పాపం ఆ మాటన్నా అతనికి చెప్పరేం?"

"ఓసి వెర్రిదానా, ఆ మాట చెబితే యిప్పుడా 'రూపాయి' తెమ్మని కూర్చోడూ!"

—ఎస్. సాయికృష్ణప్రసాద్, హైద్రాబాదు-34.

కలిసిరాని గ్రహకూటమి!

అజీజ్

"ఈరోజు నటరాజ్ టాకీసులో ఓ కొత్తపిక్చర్ రిలీజ్ అయింది వెళదామా?" అడిగేడు రమ్యనాథ్ స్నేహితుడు. ఆఫీసులోంచి బయట పడ్డాక.

"ఏ పిక్చర్?" ప్రశ్నించేడు రమ్యనాథ్.

"గన్స్ ఆఫ్ నవరోన్. గ్రెగరీపెక్, ఆంథోనీక్వీన్ నటించేరు. పాపులర్ పిక్చర్. చూసి తీరాలి."

"ఆల్ రైట్, పద. నేనూ చాలారోజులయింది సినిమా కెళ్ళి. మా తమ్ముడు పరీక్షలు రాయడానికి మద్రాసు వచ్చేడుగా. వాణ్ని ఒంటరిగా ఇంట్లో వదలి ఎలా వెళ్ళాలని మానేశాను సినిమాలు. ఈరోజు మరీ బోర్ కొడుతోంది" అన్నాడు రమ్యనాథ్. స్నేహితుడి ఆఫర్ని స్వీకరిస్తూ.

స్నేహితులిద్దరూ నటరాజ్ టాకీస్ జేరుకున్నారు. ఆవరణలో జనం క్రిక్కిరిసి వున్నారు. అప్పుడే టికెట్లివ్వడం ప్రారంభించేరు కూడా.

"టికెట్స్ దొరుకుతాయా?" అన్నాడు రమ్యనాథ్ అనుమానంగా.

"నాలుగు పర్కస్ ఫీట్లుచేస్తే సరి! దొరుకుతాయి." అన్నాడు స్నేహితుడు బుకింగ్‌ను సమీపిస్తూ.

చచ్చీచెడీ చివరికి రెండు టికట్లు దక్కించుకుని, హాల్లో ప్రవేశించారు.

సినిమా యింకా ప్రారంభం కాలేదు. హాల్లో లైట్లు వెలుగుతున్నాయి. ఇద్దరూ కూర్చున్నారు అనువయిన చోట.

అప్పుడే ఫస్ట్‌బెల్ మ్రోగింది. ఉబుసుపోక చుట్టూ కూర్చున్న జనంపైపు చూస్తూన్న రమ్యనాథ్, ముందు వరసలో కాస్త యెడంగా కూర్చున్న వ్యక్తిని చూడగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

అనుకోకుండా కరెంటుషాక్ తగిలితే ఒంట్లోని నరాలన్నీ ఝల్లుమంటాయి. శరీరంలో రక్తస్రావం స్తంభించి మనిషి స్తబ్దుడై పోతాడు క్షణంపాటు. సరిగ్గా అటువంటి స్థితికే గురయ్యాడు రమ్యనాథ్.

కాసేపటికి తేరుకొని. అతనేనా? అన్న సంధిగ్ధంతో కళ్ళు చిట్లిస్తూ పరీక్షగాచూశాడు ఆ వ్యక్తిని. దాదాపు ముప్పయ్యేళ్ళుంటా యతనికి. నుదుటిమీద జీరాడే ఉంగరాలజుత్తు, నిండయిన బుగ్గలు. కోటేరు ముక్కు.

అతనే! రఘుకాంత్!

రమ్యనాథ్ గుండెలో వెయ్యిగుర్రాలు ఒక్కసారి దౌడు తీశాయి. అంత వరకు ప్రశాంతంగా వున్న అతని మస్తిష్కం పెనుతుఫానుకు గురయ్యింది.

అప్పుడే సెకెండ్‌బెల్ మోగి హాల్లో లైట్లారిపోయాయి.

స్క్రీన్ మీద న్యూస్‌రీల్ ప్రారంభమయింది. రమ్యనాథ్ కంటికి దృశ్యాలేవీ కనిపించడంలేదు. అతని మస్తిష్కం తెరమీద యింకేవో ఘట్టాలుకదిలి మాయమౌతున్నాయి.

ఇంటర్వెల్లో అతను తనని ఎక్కడ గుర్తుపడతాడోనని రుమాలుతీసి మొహం తుడుచుకుంటున్నట్టు నటించసాగేడు రమ్యనాథ్.

పిక్చర్ వదిలేక అతనిదృష్టిలో పడకుండా, స్నేహితుడి వెంట హాల్లోంచి బయటపడ్డాడు. ఓరగా రఘుకాంత్‌ని గమనిస్తూనే వున్నాడు. జనంలో ఎక్కడ తప్పిపోతాడోనని.

"సరే, ఇహ వెళతాను. మాయిల్లు యిక్కడికిదగ్గరేగా గుడ్‌నైట్." అంటూ రమ్యనాథ్ దగ్గిర సెలవు తీసుకుని జనంలో కలిసిపోయేడు అతని స్నేహితుడు.

తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ రఘుకాంత్ వెళుతున్న వైపు చూసేడు రమ్యనాథ్. పార్కింగ్‌లో ఆగివున్న ఆటో ఎక్కుతున్నాడతను. ఆటో కదిలింది.

పక్కనేవున్న మరో ఆటోయెక్కి ముందు వెళుతున్న ఆటోనుఫాలో జెయ్యమని చెప్పేడు రమ్యనాథ్ డ్రైవర్‌తో.

పట్టుదల, పంతం అతని నరనరాన్ని దహించి వేస్తున్నాయి. ఎక్సయిట్‌మెంట్‌తో అతని ఒళ్ళు వేడెక్కుతుంది క్షణక్షణానికి.

ముందు వెడుతున్న ఆటో, కొన్నిరోడ్స్ కట్‌చేసి అబిడ్స్‌దరిలోవున్న అజంతా హోటల్ కాంపౌండ్‌లోకి తిరిగింది. తన ఆటోని బయటే ఆపించేడు రమ్యనాథ్.

ఆటోవాడికి బిల్ పేజేసి హోటల్‌వైపు నడుస్తున్నాడు రఘుకాంత్.

అలోగా తనూ డ్రైవర్‌కు డబ్బిచ్చి హోటల్‌వైపు కదిలేడు రమ్యనాధ్.

హాల్లో అడుగుపెట్టగానే కనిపించేడు రఘుకాంత్ మెట్లెక్కుతూ.

అతన్నికాస్త పైకివెళ్ళనిచ్చి, రుమాలుతో మొహం తుడుచుకుంటున్నట్టు నటిస్తూ ఫాలో చెయ్యసాగేడు రమ్యనాధ్. అతను తిన్నగా రెండో అంతస్థు జేరుకొని నడవా కిరుప్రక్కలావున్న గదులు చూసుకుంటూ వెళ్ళి ఓ గది ముందాగేడు.

రమ్యనాధ్ చటుక్కున సిగరెట్ పాకెట్ తీసి, సిగరెట్ అంటించుకుంటున్న సాకుతో అక్కడే నిల్చుని ఓరగా చూడసాగేడు.

రఘుకాంత్ తలుపు తాళంతీసి, గదిలో కెళ్ళాడు. తిరిగి తలుపు మూసుకున్న చప్పుడు.

అడుగులో అడుగు వేసుకుంటూ అటునడిచేడు రమ్యనాధ్. అంతక్రితం అంటించిన సిగరెట్ కింద పడేసి, బూటుతో నలిపేడు. అతని గుండెలో యిప్పుడు సన్నగా దడ ప్రారంభమైంది.

గదికి గజం యివతల ఆగి, జేబులోంచి తాళంచెవుల గుత్తితీశాడు. గుత్తిలో రెండుమూడు తాళం చెవులతో బాటు చిన్న మడతకత్తికూడా వేలాడుతోంది.

గుత్తిలోంచి దాన్ని వేరుజేసి తాళం చెవుల్ని తిరిగి జేబులో తోసేడు.

తనచర్యలు ఎవరయినా గమనిస్తున్నారా అని జాగ్రత్త కోసం అటూ ఇటూ చూసేడు ఓరగా. అదృష్టం కొద్దీ నడవాలో ఎవ్వరూ తిరగడంలేదు.

గుండెలో రగులుతున్న అగ్ని ఖాండాన్ని అదుపులో పెట్టడం అతనికి సాధ్యపడటంలేదు. సంకోచించకుండా కత్తిమడత విప్పేడు. నాలుగంగుళాల ప్యూర్ స్టీల్‌నైఫ్! అవసరానికి ఈ మాత్రమైన వుంది.

కాకతాళీయంగా, ఇన్నేళ్ళ తరవాత దొరికిన వేటను వదలకూడదు! కత్తిచిన్నదైనా ఫరవాలేదు. వరుసగా నాలుగయిదుపోట్లు తీస్తేచాలు! మనిషి హరీ మనడానికి.

కత్తిని కుడిచేతి పిడికిట్లో అనువుగా పట్టుకుని, చెయ్యి జేబులో దూర్చేడు. ఎడంచేత్తో మెల్లిగా తలుపు తట్టేడు.

"ఎవ్వరు?"

"వెయిటర్ సర్!"

తలుపు దగ్గరకు వస్తున్న అడుగుల శబ్దం, గడియ తీస్తున్న సవ్వడి.

తలుపులు తెరుచుకుంది.

మెరుపులా లోనికిదూరి తలుపుమూసేడు రమ్యనాథ్. అటువంటి స్థితికి సిద్ధంగాలేని రఘుకాంత్ కళ్ళు దిగ్భ్రాంతితో విప్పారేయి.

"ఎవరు నువ్?"

నవ్వి—"కాస్త పరీక్షగా చూడు. గుర్తు వస్తాను." అన్నాడు రమ్యనాథ్. రఘుకాంత్ కనుబొమలు ముడి వడ్డాయి. గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఇంకా జ్ఞాపకం రాలేదా? ఔను, ఆరేళ్ళమాటకదూ? పైగా నీకలాటివి మామూలే! ఎలా గుర్తుంటాం మేము?"

రఘుకాంత్ మొహం కొద్దికొద్దిగా పాలిపోసాగింది. ఇప్పుడతని జ్ఞాపకశక్తి కవాటాలు తెరుచుకున్నాయికాబోలు!

"నీకు జ్ఞాపకం లేకుంటే, నేనే గుర్తుచేస్తాను. విజయ

నగరంలో ....సుభద్రపద ...."

రఘుకాంత్ మొహం పూర్తిగా పాలిపోయింది. "ను.... ను....రమ్య... " అతని కంఠంలోంచి మాటలు పూర్తిగా ఇవతలికి రావడంలేదు. భయంతో చిత్రవిచిత్ర శబ్దాలువిన వస్తున్నాయి.

"ఔను రమ్యనాధ్‌ని. సుభద్రపద అన్ననుః పండంటి మా సంసారంలో నువ్వు నిప్పులు గుమ్మరించి పారి పోయావ్. నలుగురన్నదమ్ముల నడుమ పుట్టిన బంగారం లాంటి మా చెల్లెల్ని నామరూపాలు లేకుండా జేశావ్!" అడుగు ముందుకువేశాడు రమ్యనాధ్.

అతని చెయ్యి ఇంకా జేబులోనే వుంది.

ఊహించని విధంగా ఎదురయిన ఆ సంఘటన షాక్ లోంచి రఘుకాంత్ యింకా తేరుకోలేక పోతున్నాడు.

"ఆనాడే నీవు మాచేతికి చిక్కివుంటే నలుగురంకలపి నిన్ను నరికి ముక్కలుజేసి కుక్కలకీ నక్కలకీ వేసేవాళ్ళం కాకతాళీయంగా ఈరోజు చిక్కావ్ నా చేతికి. ఇహనిన్ను ఆ పరబ్రహ్మకూడా కాపాడలేడు" రమ్యనాధ్ చెయ్యి జేబు లోంచి బయటకి వచ్చింది.

ఆ చేతిలో మెరుస్తున్న కత్తిచూడగానే రఘుకాంత్ నోరు తెరుచుకుంది. అతనిలో ప్రమాదాన్ని పసిగట్టే యే కాస్త ఇంగితజ్ఞానంవున్నా ఆత్మరక్షణకోసం తక్షణచర్య తీసుకునేవాడు. అతను పూర్తిగా తేరుకునేలోగా ఆలస్యం జరిగిపోయింది.

ఒకే ఒక్కపోటు!

రఘుకాంత్ నోట్లోంచికేక యివతలికి వచ్చేలోగా మరో పోటు! బయటకు వస్తున్న అరుపు తిరిగిలోనికి దొర్లి

పోయింది. కత్తిని పొట్టలోదింపి జిప్‌లాగినట్టు కిందికి లాగాడు రమ్యనాథ్.

వెలగపండు విచ్చుకున్నట్టువిచ్చుకుంది కడుపు. లోపల కదులుతున్న అవయవాలు!

అటకమీంచి కిందపడ్డ పిండిబస్తాలా నేలకూలేడు రఘుకాంత్.

రక్తసిక్తమైన కత్తినీ, చేతినీ జేబురుమాలుతో తుడిచి కత్తికర్చీఫ్‌లోచుట్టి జేబులో వేసుకుంటూ తేలిగ్గా నిట్టూర్చాడు రమ్యనాథ్.

నేలమీద నిశ్చలంగా పడున్న రఘుకాంత్ శవాన్ని చివరిసారి చూపి వెనుదిరిగేడు.

తలుపు కొద్దిగా తెరిచి నడవాలోకి చూసేడు. సరిగ్గా అదే క్షణంలో నడవాగుండా వెయిటర్ వెళుతూ కనిపించేసరికి చటుక్కున తలుపుమూసేడు.

ఈస్థితిలో తన నెవ్వరూ చూడకూడదు. పోలీసులకు ప్రత్యక్ష సాక్ష్యంగనక లభించిందంటే తను పట్టుబడటానికి అరక్షణం పట్టదు.

అడుగుల శబ్దం దూరమవగానే, తిరిగి రెక్కతెరిచి చూసేడు. నడవాలో ఎవ్వరూలేరు. చటుక్కున తలుపు తెరచి ఇవతలపడి, తిరిగి మూసేడు.

గబగబ మెట్లవైపు నడిచేడు. అదృష్టం బావుంది. మెట్లు దిగుతుండగా ఎవ్వరూ ఎదురుపడలేదు.

కౌంటర్లో కూర్చున్న క్లర్క్ తనని స్పష్టంగా చూడకుండా అరచేత్తో మొహం నిమురుకుంటూ వడివడిగా హోటల్లోంచి బయటపడ్డాడు.

దార్లో మసకచీకటిగావున్న ప్రదేశంచూసి కర్చీఫ్‌లో

చుట్టివున్న కత్తితీసి, రోడ్డుపక్క పారుతున్న మురుక్కాలవలోకి విసిరేడు.

ఇహ ఫరవాలేదు. ఫుట్ పాత్ మీదపడి గబగబ అడుగులు వెయ్యసాగేడు ఇంటివైపు.

ఒకనాడు ఉరితాడుమధ్య వేలాడుతూ వికృతంగా కనిపించిన సుభద్రపదరూపం ఇప్పుడు హాయిగా నవ్వుతూ కదులుతోంది అతని కళ్ళలో.

నలుగురన్నదమ్ముల మధ్య లేకలేక పుట్టిన ఆ కుందనపు బొమ్మను ఎంతో అల్లారు ముద్దుగా చూసుకునేవారు. తాము త్వరగా చదువులు పూర్తిజేసుకొని, ఉద్యోగాలు సంపాదించి, ఆ పసిడిబొమ్మని ఓ అయ్యచేతిలో పెట్టి, మూడు పువ్వులూ ఆరుకాయల్లా జీవిస్తుంటే చూసి ఆనందించాలని కలలుగనేవారు.

కాని, విధి మరోవిధంగా మలుపు తిప్పింది కథని!

తమ ఇంటికెదురింట్లో నివసించే రఘుకాంత్‌కు మనసిచ్చింది సుభద్రపద, రహస్యంగా. మాయమాటలతో ఆ అమాయకురాలిని వశం జేసుకున్నాడు. పెళ్ళి జేసుకుంటానని గాలిబాసలుచేసి మోహపాశాలు రగిల్చి, మలినంజేసి రాత్రికిరాత్రి చడీచప్పుడు కాకుండా మాయమయ్యాడు.

అప్పుడు తెరుచుకున్నాయి సుభద్రపద కళ్ళు, ఎంతో ఆలస్యం జరిగిపోయాక! లోకానికి మొహం చూపలేక తనకుతానే మరణశిక్ష విధించుకుంది. ఆత్మహత్య చేసుకుంటూ ఆమె రాసిపెట్టిన ఉత్తరంద్వారా తెలిసేయి అసలు విషయాలు.

అప్పుడుజేశారు నలుగురన్నదమ్ములు కలసి ప్రతిజ్ఞ,

రఘుకాంత్ ఎవరికి ఎక్కడ ఎప్పుడు కనిపించినాసరే. వరికి ముక్కలుజేసి సుభద్రద ఆత్మకు శాంతికలిగించాలని.

ఆ అదృష్టం తనతే దక్కింది.

అతను ఇల్లుచేరగానే. "దేనికన్నయ్యా అలావున్నావ్" అడిగేడు అతని తమ్ముడు.

రమ్యనాధ్ అతి కష్టంమీద నవ్వి—"ఎలావున్నాను?" అన్నాడు.

"దాచక! తెలుస్తూనేవుంది. ఏం జరిగింది?"

"ఏమీ జరగలేదే?"

"ఏమీ జరక్కుంటే యేమిటివి?" తమ్ముడు చూపించిన వైపు చూసుకున్నాడు రమ్యనాధ్.

రక్తపు మరకలు! షర్టుమీద అక్కడక్కడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇహదాచి లాభంలేదు.

"ముందా తలుపు మూయ్! చెబుతాను." అన్నాడు కుర్చీలో చతికిలబడుతూ.

తమ్ముడు తలుపుమూసి కూర్చోగానే చెప్పసాగాడు రమ్యనాధ్.

2

ఉదయం పదిగంటలకల్లా తయారై ఆఫీస్‌కెళ్ళబోతున్న రమ్యనాధ్ బైటనుంచి ఇంట్లోకి వస్తున్న ఓ కుర్రవాణ్ణి చూసి ఆగిపోయాడు.

"వీధిలో ఒకాయన మీకివ్వమని ఈ ఉత్తరం యిచ్చారండి.'' అంటూ అందించేడు రమ్యనాధ్‌కు కవర్ని.

రమ్యనాధ్ కళ్లు ఆశ్చర్యంతో విప్పారాయి. "యెవరతను?" అడిగేడు కవర్ అందుకుంటూ,

"ఏమోనండీ, వీధులో ఆడుకుంటుంటేపిల్చి, మీ ఇల్లు చూపెడుతూ వివరాలడిగి, నా చేతిలో పావలాపెట్టి, దీన్ని ఆ ఇంట్లోయివ్వు. అని వెళ్ళిపోయాడండి" అన్నాడు కుర్రాడు.

కవర్ అటూయిటూతిప్పి చూసేడు రమ్యనాధ్. ఏమీ రాపిలేదు! చింపి లోపలి కాగితంతీపి ఆతృతగా చదవ సాగాడు.

"మిష్టర్ రమ్యనాధ్!

రాత్రి నీవుచేసిన నిర్వాకం నా కళ్లారాచూసాను కాకతాళీయంగా. నిజానికి ఆపని నేనే జెయ్యా ల్సింది నీవే పూర్తిచేసి పుణ్యం కట్టుకున్నావు. థాంక్సు!

నాలుగేళ్ళక్రితం బొంబేలో నేనూ, రఘుకాంత్ కలపి ఓ వ్యాపారం ప్రారంభించాం. తొలిదశలో లాభాలు బాగానేవచ్చేవి. తరవాత బిజినెస్ మంద కొడిలోకి దిగింది.

దాంతో రఘుకాంత్ నన్నుమోసంచేపి, నా తాలూకు పదివేల నగదు తీసుకుని బొంబేనుంచి పరారయ్యాడు. అతను మద్రాసులో వున్నాడని తెలిపింది, తక్షణం బయలుదేరి వచ్చాను.

అజంతా హోటల్లో అతన్ని కలుసుకోడానికి, హోటల్ చేరుకునేసరికి, రఘుకాంత్ ఆటో ఎక్కు తుండటం కనిపించింది. మరో ఆటోలో అతన్ని ఫాలోచేశాను. సినిమాహాలు దగ్గర దిగాడు,టికెట్ తీసుకుని లోపలకు వెళ్ళగానే నేనూవెళ్ళి, లోపల అతన్ని ఓకంట కనిపెడుతూ కూర్చున్నాను.

సినిమా వదిలేక బైటికి వచ్చి ఆటోఎక్కి తిరిగి అజంతా ముందు దిగేడు. అప్పుడే నీవూ అతన్ని వెంబడిస్తూ హోటల్లో ప్రవేశించడం కనిపించింది. నీ వెనకే నేనూ వున్నానని నీకు తెలీదు.

రఘుకాంత్ తన గదిలోకెళ్ళిన కొద్దిసేపటికి నీవు అతని గదిలో ప్రవేశించావు. నేను బైట నిల్చుని, నీ రాకకోసం ఎదురుచూడసాగేను. అర గంట తరవాత బైటపడి గబగబ వెళ్ళిపోయావ్.

రఘుకాంత్ గదిలోకెళ్ళిచూస్తే అతను చచ్చి పడున్నాడు. తక్షణం హోటల్ బైటికెళ్ళి నీకోసం చూశాను, అప్పుడే నీవు గేటుదాటుతున్నావ్, నిన్ను వెంబడించాను. నీవు ఈ ఇంటికి జేరుకుని లోని కెళ్ళడం చూసి, వెనుదిరిగాను.

ఇక అసలు విషయం! నిన్ను బ్లాక్‌మెయిల్ జేయాలనే దురుద్దేశం నాకు లేదు. నేను రఘుకాంత్ నించి నా డబ్బు వసూలు జేసుకున్నాక నీవతన్ని నరిగి పోగులుపెట్టినా నా కభ్యంతరం ఉండేది కాదు. కాని, అతని అకాల మరణంతో నా డబ్బు నాకు దక్కకుండాపోయింది.

కనుక, దయచేసి వాడిద్వార రావలసిన నా పది వేలూ ఇప్పించేవంటే, నా నోరు శాశ్వతంగా మూసుకుంటాను. డబ్బివ్వడానికి వ్యవధి రెండు రోజులిస్తున్నాను. సరిగ్గా రెండోరోజు డబ్బు తీసుకుని, రాత్రి ఎనిమిది గంటలకి లాటిస్ బ్రిడ్జి దగ్గరికి రా!

లేదా నీ ఇష్టం .... నేను ప్రత్యక్షసాక్షినని మరిచిపోక!

ఉంటాను.

నీ శ్రేయోభిలాషి!"

ఉత్తరం ముగించిన రమ్యనాథ్ గుండెలో రేసుగుర్రాలు పరుగుపందెం మొదలుపెట్టేయి. ఒళ్ళంతా సన్నగా చమట బిందువులు పేరుకోసాగేయి.

"ఏం జరిగిందన్నయ్యా? దేనికలావున్నావ్? అడిగేడు అతని తమ్ముడు.

రమ్యనాథ్ మౌనంగా ఉత్తరాన్ని అతనికందించేడు.

అంతా చదివిన అతని తమ్ముడి మొహం పాలిపోయింది. "మన పగ నిర్విఘ్నంగా నెరవేరిందని రాత్రంతా సంబరపడ్డాం.... ఇప్పుడెలా?" అన్నాడు అయోమయంగా.

రమ్యనాథ్ పలకలేదు. అతని బుర్ర తీవ్రంగా ఆలోచిస్తోంది.

3

"ఇక్కడ ఆపు!"

రోడ్డుపక్క బ్రేక్ వేసేడు ఆటో డ్రైవర్.

లెదర్ బ్యాగ్ అందుకుని దిగేడు రమ్యనాథ్, జేబులోంచి పర్సు తీసి, మీటర్ బిల్ పేచేసేడు. ఆటో వెనుదిరిగి వెళ్ళిపోయింది.

రిస్టు వాచీ చూసుకున్నాడు.

రాత్రి ఏడున్నర! అక్కడికి అరఫర్లాంగు దూరంలోనే వుంది లాటిస్ బ్రిడ్జి. బ్రిడ్జికింద నగరంలోని మురుగునీళ్ళని సముద్రంలోకి చేరవేసే చిన్న కాలవ పారుతుంది.

ఆ రోడ్డుమీద అట్టే జనసంచారం వుండదు. సిగరెట్

అంటించి నడక సాగించేడు రమ్యనాథ్.

ఇరవై నిమిషాల్లో బ్రిడ్జిని సమీపించేడు. రోడ్డు ఆవైపు నించిగానీ, ఈ వైపునించిగానీ ఎలాటి వాహనాలు రావడం లేదు. చుట్టూ నిశ్శబ్దం.

బ్రిడ్జి కట్టమీద చేతులు ఆనించి, కాలువలోకి చూస్తూ ఎవ్వరో నిల్చున్నట్టు లీలగా కనిపించింది.

అతనే అయుంటాడు!

వడివడిగా అడుగులు వేస్తూ అతన్ని సమీపించేడు రమ్యనాధ్.

"వచ్చారా?" అన్నాడతను నవ్వుతూ.

రమ్యనాథ్ తలూపి "ఔను, డబ్బు తెచ్చాను" అన్నాడు లెదర్ బాగ్ ఎత్తి చూపుతూ.

"వెరీగుడ్ తెస్తారని నాకు తెలుసు. ఇది బ్లాక్ మెయిల్ అనుకోకండి, న్యాయంగా నాకు రావలసిన డబ్బు!" అన్నాడతను నవ్వుతూ.

రమ్యనాథ్ అతనికి బ్యాగ్ అందిస్తూ—"ఎంచుకోండి సరిగ్గా పదివేలు!" అన్నాడు.

అతను బ్యాగ్ జిప్‌లాగి, లోన చెయ్యిపెట్టి, ఓ కట్ట యివతలికి తీసి—"ఏమిటిది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"కనిపించడంల్లా? తెల్లకాగితాల కట్ట!" అన్నాడు రమ్యనాథ్ నింపాదిగా. అతని చేతిలో కత్తి తళుక్కు-మంది.

అతను భయంతో ఏడో అనబోయాడు. కానీ—

ఒక్క-పోటు!

గావుకేక.

అతని గుండెలో దింపిన కత్తిని అలాగే వదిలి వెనక్కి జరిగేడు రమ్యనాథ్, రక్తం బట్టలమీద పడకుండా.

గుండె పట్టుకుని బోర్లా పడబోతున్న అతన్ని అమాంతం ఎత్తి బ్రిడ్జి కాలవలోకి గిరాటేసేడు.

పెద్ద శబ్దం!

కిందపడ్డ బ్యాగ్ అందుకుని, వడివడిగా నగరంవైపు నడకసాగించేడు రమ్యనాథ్.

ఇల్లు చేరగానే గుమ్మంలో నిల్చుని ఎదురు చూస్తున్న తమ్ముడు ఎదురువచ్చి—"ఏమైంది?" అడిగేడు ఆతృతగా.

"విఘ్నం లేకుండా ముగిసింది! ఉదయంలోగా వాడి శవం సముద్రంలో కలిసి చేపలకాహారమైపోతుంది." అన్నాడు రమ్యనాథ్ లోనికి నడుస్తూ.

4

తలుపు తట్టిన చప్పుడు విని- "ఎవ్వరో చూడు!" అన్నాడు రమ్యనాథ్ తమ్ముడితో.

పుస్తకం బల్లమీద పడేసి లేచాడు జీవనాథ్.

ఆలోగా మరోసారి వినిపించింది శబ్దం. గడియతీసి తలుపు తెరిచేడు.

మెట్లమీద నిల్చున్న ఇద్దరు అపరిచితుల్ని చూడగానే అతని కనుబొమలు ముడివడ్డాయి.

"రమ్యనాథ్‌గారి ఇల్లు ఇదేనా?" అడిగేడొకతను.

జీవనాథ్ తలూపేడు.

"ఆయన్నోసారి చూడాలి. ఉన్నారా ఇంట్లో?"

"కాస్త నలతగా ఉంటే ఈరోజు ఆఫీసు కెళ్ళలేదు."

"దయచేసి ఒకసారి ఆయన్ని పిలుస్తారా?"

జీవనాథ్ తలూపి లోనికెళ్ళాడు. రెండు నిమిషాల తర వాత వచ్చేడు రమ్యనాథ్ బైటికి.

"మీతో కాస్త మాట్లాడాలి!" అన్నాడా అపరిచితుడు.

"ఇంతకీ....మీ గురించి చెప్పనేలేదు" అన్నాడు రమ్యనాథ్ అసహనంగా.

"చెబుతాను! నా పేరు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి. ఇతను సార్జంట్ డేవిడ్. మాది క్రయింబ్రాంచి విభాగం!" అన్నాడతను నవ్వుతూ.

రమ్యనాథ్ గుండె గుభిల్లుమంది.

"చెప్పండి! నాతో ఏమిటి పని?" అన్నాడు తేరుకుంటూ.

రమ్యనాథ్ గుండె దడ క్షణక్షణానికీ ఉధృతమవు తోంది.

"మిస్టర్ రమ్యనాథ్! మొన్నరాత్రి అజంతా హోటల్లో రఘుకాంత్ అనే వ్యక్తినీ, నిన్నరాత్రి లాటిస్ బ్రిడ్జి దగ్గిర శశిధర్ అనే వ్యక్తినీ చంపిన నేరం కింద నిన్ను అరెస్ట్ జేస్తున్నాం!

రఘుకాంత్ హత్యలో ప్రత్యక్ష సాక్షి అయిన శశి ధర్‌ను మట్టుబెట్టి, చట్టాని కందకుండా తప్పించుకుందా మనుకున్నావుకదూ? ఆ ప్రత్యక్షసాక్షి జేసిన ఏర్పాట్లే మమ్మల్ని నీ దగ్గరికి జేర్చాయి!

శశిధర్, రఘుకాంత్ కోసం మద్రాసు వచ్చి శాంతా లాడ్జిలో బసజేశాడు. రఘుకాంత్ ద్వారా తనకి రావలసిన

డబ్బు రాబట్టుకోక ముందే అతన్ని నీవు చంపడం కళ్ళారా చూసేడు.

ఆ డబ్బే నీ ద్వారా రాబట్టుకుని, తన మానాన వెళ్ళిపోదామని నీకు ఉత్తరం రాసేడు. ఉత్తరం రాశాడేగాని, నీవు డబ్బు తెస్తావో లేక సాక్ష్యాన్ని నిర్మూలించడానికి తనిసీ మట్టుబెడతావో అన్న అనుమానం అతనిలో తలెత్తింది.

అందుకే, లాటిస్ బ్రిడ్జి దగ్గరికెళ్ళే ముందు నీ గురించిన వివరాలూ, నీ నిర్వాకం అంతా ఓ కాగితం మీదరాపి, దాన్ని కవర్లో సీలుజేపి, తను పదిగంటల్లో తిరిగి రాకుంటే దాన్ని పోలీసుల కప్పగించవలసిందిగా, లాడ్జి మేనేజర్కిచ్చేడు.

అతని అనుమానమే నిజమైంది. నీవు అతన్ని చంపి, శవాన్ని బ్రిడ్జికింద కాలవలోకి తోశావ్. ఆ శవం కాలవలో కొట్టుకుపోయి సముద్రంలో కలుస్తుందనుకున్నావ్.

నీ గ్రహాలు బాగులేవు. శవం బ్రిడ్జి గోడకి తగిలి, ఉదయం వరకూ అక్కడే నిలిచిపోయింది. దారినపోయే వారు చూసి పోలీసులకు తెలిజేశారు.

అప్పటికే, లాడ్జి మేనేజరు రాత్రి పదిగంటల వరకూ శశిధర్ కోసం ఎదురుచూసి, అతను రాకపోయే సరికి, అతనిచ్చిన కవర్ను పోలీసుల కందజేసేడు.

మా ఇన్వెస్టిగేషన్లో నీవు రఘుకాంత్ను చంపడానికి గల కారణాలు బైటపడక మానవు. ప్రస్తుతం నిన్ను కస్టడీలోకి తీసుకుంటున్నాను!" అన్నాడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి జేబులోంచి హాండ్కప్స్ తీస్తూ. □□□

కొత్త సీరియల్



అప్పుడే స్కూలు వదిలిపెట్టారు. స్కూలు పిల్లలందరూ ఒకొక్కరే బయటకు వస్తున్నారు.

అతను స్కూలు గేటువద్ద నిలబడి ఒకొక్కరినే పరీక్షగా చూస్తున్నాడు. అతనికి సుమారు పాతికేళ్ళుండవచ్చును. నీలం బెల్‌బాటమ్ పాంటుమీద డార్క్ కలర్ పువ్వుల చొక్కా టక్ చేశాడు. మనిషి పొడగరి అవి చెప్పవచ్చు. మనిషి చాలా అందంగా, హుందాగా—

హిందీ సినిమా హీరోలా ఉన్నాడు.

"హలో—నీపేరు విశ్వంకదూ—" అన్నాడతను ఓ పధ్నాలుగేళ్ళ కుర్రాడిని పలకరిస్తూ.

"కాదు. నా పూర్తిపేరు వీరవెంకట సత్య సూర్య విశ్వమోహన్—" అన్నాడా కుర్రాడు.

"కావచ్చు. కానీ నిన్నింట్లో అందరూ విశ్వం అనే పిలుస్తూంటారు-అవునా?"

ఈసారి ఆ కుర్రా డాశ్చర్యంగా చూసి—"నీకెలా తెలుసూ?" అన్నాడు.

"సరస్వతి చెప్పిందిలే ..."

"సరస్వతి ఎవరూ?"

"ఓహో—సరస్వతి ఎవరో నీకు తెలియదుకమా—అయినా ఫరవాలేదు. మీ ఇంట్లో ఎవరినడిగినా చెబుతారు ...." అన్నాడతను.

"సరస్వతి ఎవరైతే నాకేంలేగానీ-నువ్వు నన్నెలా గుర్తుపట్టావ్? నేను నీకుముందే తెలుసా?"—అన్నాడు విశ్వం.

అతను జేబులోంచి ఒక ఫోటో తీశాడు. విశ్వానికి అందించాడు. విశ్వం దాన్నిచూపి ఆశ్చర్యంగా—"ఇది నాదేలే—నీ దగ్గరకెలా వచ్చింది?"—అనడిగాడు.

"సరస్వతి ఇచ్చింది...." అన్నాడతను.

"మా ఇంట్లో నేనెప్పుడూ ఈ పేరు వినలేదే? ఈ సరస్వతికి నా ఫోటో ఎలా వచ్చిందో?"—అస్పష్టంగా గొణుక్కున్నప్పటికీ విశ్వం మాటలు అతనికి వినపడ్డాయి.

"ఈ ప్రపంచంలో సరస్వతికి సాధ్యంకానిదిలేదు. ఏంచేయాలన్నా చేయగలదు, ఏంకావాలన్నా సంపాదించ

గలడు? నీ ఫోటో ఒక లెక్కా?"

విశ్వం కళ్ళు ఆశ్చర్యంతో మెరిశాయి—"ఏం చేయాలన్నా చేయగలడా—చాలా ఆశ్చర్యంగా ఉందే—నీ సరస్వతిని నాకోసారి చూపిస్తావా?"

"సరస్వతి అందరికీ కనిపించదు...."

"ఎందుక్కనిపించదు? ఆవిడ మనిషి కాదా?"

"అవును. ఆమె మనిషికాదు...." అన్నాడతను గంభీరంగా.

విశ్వం కళ్ళలో బెదురు కనిపించింది-"మరి నువ్వు?" అన్నాడు తడబడుతూ.

అతను నవ్వి—"కంగారు పడకు. నేను మనిషినే. ఈ వేళ నీ పుట్టినరోజు కదా. అందుకని నిన్ను పలకరించడానికి వచ్చాను. పద హోటల్లోకి పోదాం. నీక్కావలసినవీ, కోరుకునేవీ కడుపుపట్టినన్ని తిను...." అన్నాడు.

విశ్వం కంగారుపడుతూ—"ఈవేళ నా పుట్టినరోజా-ఎవరు చెప్పారు?" అన్నాడు.

"సరస్వతి...." అన్నాడతను.

"సరస్వతి మనిషి కాదన్నావ్. మరి నీకెలా కనిపిస్తుంది?"

"మంచివాళ్ళకు కనిపిస్తుంది. మంచిపనులు చేయమని చెబుతుంది. అవసరపడితే చెడ్డవాళ్ళకూ కనిపిస్తుంది. వాళ్ళు చేసే చెడ్డపనులకు శిక్ష విధిస్తుంది...."

ఇంకా వివరంగా అడగాలని విశ్వానికి కుతూహలంగానే ఉందికానీ ధైర్యం చాలడం లేదతనికి—"సరేకానీ-నా పుట్టినరోజైతే నువ్వు హోటల్‌కు తీసుకెళ్ళడమెందుకు?"—అనడిగాడు.

"సరస్వతి సంతోషిస్తుంది...."

"చాలాబాగుంది. పుట్టినరోజు నాది. హోటల్‌కు తీసుకు వెళ్ళేది నువ్వు. మధ్యలో ఈ సరస్వతి కెందుకూ సంతోషం?"

"సరస్వతి నీ తల్లి...."

"అబద్ధం-మా అమ్మ పేరు సత్యవతి...." అన్నాడు విశ్వం.

"సత్యవతి నీ తల్లికాదు...." అన్నాడతను.

విశ్వం ఆశ్చర్యపోతూ—"మా అమ్మెవరో నాక్కా-కుండా నీకెలా తెలుస్తుంది?"—అన్నాడు.

"మనుషులైతే అబద్ధాలు చెబుతారు. కానీ సరస్వతి అబద్ధం చెప్పదు...."

"ఏమని చెప్పింది సరస్వతి?"

"తనే నీ తల్లినని చెప్పింది. నీ ఫోటో నా కిచ్చింది. ఈరోజు నీ పుట్టినరోజనీ-హోటల్‌కు తీసుకువెళ్ళి కడుపు నిండా ఏమైనా పెట్టించమని కోరింది. అందుకే నేను వచ్చాను...."

"ఇందులో ఏదో మోసముంది. మా అమ్మ పేరు సత్య వతి. నిజం తెలుసుకోవాలంటే మా ఇంటికిరా. మా అమ్మను చూపిస్తాను. నా పుట్టినరోజు కూడా ఈవేళకాదు. నాకు సరిగా గుర్తులేదు కానీ దీపావళి ప్రాంతంలో వస్తుంది. నేను నీతో హోటల్‌కు రాను...."

"నేను మీ ఇంటికి రాను. వచ్చేరోజు ముందుంది. అప్పుడు తప్పక వస్తాను. కానీ నేను వస్తానని తెలిసినా-నేనెవరో తెలిసినా మీ ఇంట్లో చాలా పెద్ద గొడవవుతుంది. మీ తాతయ్య. బామ్మ. నాన్న. బాబాయి. అమ్మ. విధ

వ త్తయ్య. రాధ త్తయ్య....వీళ్ళలో ఓ ఒక్కరికీ నేను మీ ఇంటికి రావడం ఇష్టముండదు. అయినా ఒకరోజు మీ ఇంటికి వస్తాను. కానీ నువ్వు నాతో హోటల్‌కు రావాలి. ఇందులో ఏ మోసమూలేదు, నువ్వు ఏ హోటల్‌కు కావాలంటే ఆ హోటల్‌కు తీసుకువేడతాను. ఏంకావాలంటే అవి ఇప్పిస్తాను. టిఫిన్ తీసుకోవడం కాగానే-ఎవరిదారిన వాళ్ళం వెళ్ళిపోదాం...."

విశ్వం కళ్ళలో విపరీతమైన ఆశ్చర్యం తొంగి చూస్తోంది—"మా ఇంట్లో వాళ్ళంతా మీకెలా తెలుసు? సరస్వతి చెప్పిందా...." అన్నాడు.

"అవును. ఆ సరస్వతి సంతోషం కోసమే నేనిప్పుడు నిన్ను హోటల్‌కు తీసుకువెడుతున్నాను...."

"పోనీ సరస్వతికి అబద్ధం చెప్పవచ్చుగా...."

"సరస్వతికి అన్నీ తెలుస్తాయి. ఆమె మనల్ని గమనిస్తూనే ఉంటుంది...."

"ఇప్పుడు కూడా సరస్వతి మనల్ని చూస్తోందా — నీక్కనిపిస్తోందా?"—భయంగా అడిగాడు విశ్వం.

"లేదనుకో. కానీ నాకు తెలుసు...."

"ఏం తెలుసు? నీకు తెలిపినవన్నీ అబద్ధాలే. మా అమ్మ పేరు సరస్వతంటున్నావ్. నా పుట్టిన రోజీవేళ అంటున్నావ్...."

"మళ్ళి మొదటికొ స్తున్నావ్ విశ్వం! నాకు తెలిపిన నిజాలన్నీ చెబితే విని తట్టుకునే శ క్తి నీ వయసుకు లేదు. టె స్తుక్లాసు కుర్రాడి కింతకంటె వివరాలనవసరం. నీ పుట్టిన రోజు విషయం, తల్లి పేరు విషయంలోనూ సందేహాలుంటే—మీ అమ్మనడిగి చూడు. నిజం బయట పడు

తుంది. నువ్వు హోటల్‌కు రానని మాత్రం అనకు. సరస్వతి బాధపడుతుంది. ఆమె చాలా మంచిది. మంచి వాళ్ళను బాధపెట్టడం మంచిది కాదు...."

"సరే....అసలు నువ్వెవరు?"—అన్నాడు విశ్వం.

"నీ మామయ్యని?"

విశ్వం ఆశ్చర్యంగా అతని కళ్ళలోకి చూశాడు — "మామయ్యా—అదెలా?"

"సరస్వతి నీకు అమ్మ కదా—నేను సరస్వతి తమ్ముడిని!"—అన్నాడతను.

"నీ పేరు....?"

"ప్రసాద్!"

2

"ఈ రోజు కూడా క్రికెట్ ఆడేవా?" అంటూ గుమ్మంలోనే విశ్వాన్ని పలకరించాడు రాఘవరావు. ఆయన విశ్వం తాతగారు.

"క్రికెట్ ఆడానో లేదో నా బట్టలు చూస్తే తెలియడం లేదూ!"—అన్నాడు విశ్వం.

"బట్టలు చూసి తెలుసుకునేదేముంది? ఆలశ్యాన్ని బట్టి అనుకున్నాను. నేను క్రికెట్ ఆడేరోజుల్లో వికెట్ కీపింగ్ చేసినా ఇ స్త్రీమడత నలిగేదికాదు...."

"క్రికెట్లో మనం కాపాడుకోవలసింది ఇ స్త్రీమడతలు కాదు తాతయ్యా—రన్సు...." అంటూ లోపలకు పరుగెత్తాడు విశ్వం. వెళ్ళడం వెళ్ళడం తిన్నగా వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళాడు.

ఇంటి దొడ్లో నూతి పళ్ళెం దగ్గర అత్తా కోడళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కొడుకును చూస్తూనే—"ఏరా.

రోజూ ఆటలేనా?"—అంది మృదువుగా ఆలశ్యానికి మందలిస్తూ—సత్యవతి.

"ఈరోజు ఆటలు కాదే — మామయ్యని కలిశాను స్కూలు దగ్గర..."

"మామయ్యెవ్వడా—ఇంటికి రాలేదేం మరి?"

"ఈ మామయ్య కొత్తాయనమ్మా. పేరు ప్రసాద్. ఈవేళ నా పుట్టిన రోజని చెప్పి హోటల్‌కు తీసుకువెళ్ళి కడుపునిండా టిఫిన్ పెట్టించాడు...."

సత్యవతి ముఖంలో కోపం కనబడింది—"సిగ్గులేని వెధవా—అడ్డమైన వాళ్ళతోటీ హోటల్‌కు వెళ్ళి...."

ఆమె మాటలు పూర్తికాకుండానే విశ్వం గట్టిగా అన్నాడు—"నిజం చెప్పు అమ్మా—ఈ వేళ నా పుట్టిన రోజుట కదూ?"

"కాదు...."అంది దృఢంగా సత్యవతి.

"నువ్వలాగే అంటావన్నాడు మామయ్య. ఎందుకంటే నీకు నా అసలు పుట్టినరోజు తెలియదట. అసలు నువ్వు నా అమ్మవు కాదుట. నా అమ్మ పేరు...." క్షణం ఆగేడు విశ్వం.

కొడుకు విపరీతధోరణికి సత్యవతి ముఖంలో చిరాకుతో పాటు ఆశ్చర్యంకూడా కనబడింది—"చెప్పరా—నేను నీ అమ్మను కాకపోతే అసలు అమ్మ పేరేమిటిట?" అందామె.

"సరస్వతి...." అన్నాడు విశ్వం.

సత్యవతి స్రాన్పడిపోయింది. అంతవరకూ ఈ సంభాషణ చోద్యంగా వింటున్న విశ్వం బామ్మ నరసమ్మగారు నోరు తెరిచి—"ఆఁ" అంది.

తల్లి, బామ్మ అంతలా ఆశ్చర్యపోతారని విశ్వం

అనుకోలేదు. దాంతో అతనికి అనుమానం పెరిగింది—"అమ్మా—నువ్వు నా అమ్మవు కావా—నిజంగా సరస్వతేనా నా అమ్మ...." అన్నాడు ఆదుర్దాగా. ఇంత కాలమూ తనను సాకుతూ వచ్చిన మనిషి తన తల్లి కాదనుకోవాలంటే అతనికి బాధగానే వుంది.

సత్యవతి కొడుకును దగ్గరగా లాక్కుని-హృదయానికి హత్తుతుంది-"ఎవరన్నా నా కొడుకు నువ్వే. కానీ అసలేం జరిగిందో వివరంగా చెప్పు."

విశ్వం అంతా వివరంగా చెప్పి—"అబద్ధమాడే వాళ్ళను సరస్వతి క్షమించదట. ఆమె అన్నిచోట్లావుండి అందర్నీ గమనిస్తూనే వుంటుందిట. అందుకని నువ్వు అబద్ధం చెప్పవద్దమ్మా. నిజం చెప్పు. ప్రసాద్ నాకు మామయ్యేనంటావా? అతను చెబుతున్నవన్నీ నిజాలే నంటావా?" అన్నాడు.

విశ్వానికి పధ్నాలుగేళ్ళు నిండుతాయి దీపావళి ప్రాంతంలో—స్కూల్లో వేసిన పుట్టిన తేదీప్రకారం. అటూ ఇటూ కాని వయసు. ఆ వయసుకు రాకూడని సమస్య వచ్చిందతనికి.

"అన్నీ అబద్ధాలు కానీ నువ్వువెళ్ళి బట్టలు మార్చుకో. దీనిగురించి ఎక్కువగా ఆలోచించకు. ఎప్పుడైనా ఆ ప్రసాద్ పలకరించినా వెళ్ళకు. వాడెవడో మోసగాడై వుంటాడు. జాగ్రత్తగా వుండు...." అంది సత్యవతి.

విశ్వం అక్కణ్ణించి వెళ్ళేక "నాకేదో భయంగా ఉందత్తయ్యా...." అంది సత్యవతి.

నరసమ్మ క్షణం ఆలోచించి—"కుర్రాడు ప్రాజ్ఞుడవు తున్నాడు. అన్నీ వాడిముందు మాట్లాడుకోవడం మంచిది

కాదు. సరిగదా—ప్రమాదం కూడా. ఈ విషయం రాత్రి విశ్వం పడుకున్నాక మగాళ్ళతో చర్చించాలి...." అంది.

"చర్చలంటున్నారేమిటే .... " అంటూ వచ్చింది యమున.

యమునకు అయిదారేళ్ళ క్రితం భర్తపోయాడు. అప్పట్నించీ పుట్టింట్లోనే వుంటోంది. పాపం ఆమె భర్తతో పట్టుమని రెండుమూడేళ్ళైనా కాపరం చేయలేదు. కడుపున ఓ కాయైనా కాయకుండా భర్తపోయాడు. ఆమె వయస్సు సుమారు పాతికేళ్ళుంటుంది.

"ఏమీ లేదులే—అన్నీ రాత్రికి చర్చిద్దాం కానీ పద—ఇంట్లోకి పోదాం...."అంది నరసమ్మ.

3

రాత్రి విశ్వం నిద్రపోయాక ఇంట్లో అంతా సమావేశమయ్యారు.

రాఘవరావుగారు, నరసమ్మగారు, విశ్వం తండ్రి జగన్నాధం, సత్యవతి, జగన్నాధం తమ్ముడు మోహనరావు, యమున, ఆమె చెల్లెలు అందరూ అక్కడ చేరారు.

సత్యవతి గొంతు సవరించుకుని—"విశ్వాన్నీరోజున ప్రసాద్ అనే యువకుడు కలుసుకుని—ఈ రోజు నీవు పుట్టినరోజని చెప్పి హోటల్‌కు తీసుకువెళ్ళి కడుపునిండా టిఫిన్ పెట్టించాడట. అంతటితో ఊరుకోక సత్యవతి నీ తల్లికాదు-సరస్వతి అని చెప్పాడుట...." అంది.

ఆమె తగ్గుస్వరంలోనే చెప్పినప్పటికీ ఎవరి ముఖాల్లోనూ కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

"జరిగినదంతా వివరంగా చెప్పవే!" అంది నరసమ్మగారు.

సత్యవతి నెమ్మదిగా విశ్వం తనకు చెప్పిన వివరాలన్నీ అందరికీ చెప్పింది.

క్షణంసేపు ఎవరికీ నోటమాటరాలేదు.

"వాడెవడో కానీ—చాలా పెద్ద ఎత్తుమీదనే వచ్చాడు" అన్నాడు రాఘవరావు.

"అది తెలుస్తూనే వుంది కానీ వాడికి తెలియకూడని విషయాలేమైనా తెలిశాయా అని అనుమానంగా వుంది" అన్నాడు జగన్నాథం.

అందరూ ముఖముఖాలు చూసుకున్నారు.

"ఒకటి మాత్రం నిజం. జరిగినదేమిటో మన ఏడుగురికీ తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. తెలిసే అవకాశంకూడాలేదు. విషయం బయటకు వెళ్ళిందంటే మన ఏడుగురిలో ఎవరో ఒకరు మిగతా ఆర్గురికీ వ్యతిరేకంగా పని చేస్తున్నారని అర్థమవుతుంది. అది ఎవరికీ మంచిది కాదు...." అన్నాడు జగన్నాథం.

"ఎవరుమాత్రం ఎందుకు చెబుతార్రా!"—అన్నాడు రాఘవరావు.

"తెలిసి చెప్పకపోవచ్చు. ఉదాహరణకు రాధను తీసుకోండి. ఆరేడేళ్ళ లేత వయసులో చూడకూడని దృశ్యం చూపిందది, దాని గుండెల్లో అది బలంగా నాటుకుపోయుంటుంది. ప్రస్తుతం యూనివర్సిటీలో చదువుకుంటోంది కదా—ఏమైనా పరిచయాలుండవచ్చు. అంటే హద్దుమీరుతుందని నా అభిప్రాయం కాదు. ఆడవాళ్ళతో కానీ, మగవాళ్ళతోకానీ అనుకోకుండా ఇది నోరు జారవచ్చు...."

"నేనెప్పుడూ నోరు జారలేదు. నిజం చెప్పాలంటే నేనా విషయం మరచిపోయాను. ఇప్పుడు మీరు గుర్తు

చేస్తుంటే హృదయం జలదరిస్తోంది....” అంది రాధ.

“నువ్వంటే నువ్వనికాదు. మోహనరావు సంగతి తీసుకో—ముప్పయ్యోపడిలో పడబోతున్నాడు. ఇంకా పెళ్ళి చేసుకోనంటాడు. ఉద్యోగంలో వున్నాడు. సంపాదించు కుంటున్నాడు. సంపాదనలేకపోయినా మనకు తరగని ఆస్తి ఉంది. పెళ్ళికి విముఖంగా వున్నా ఏవో పరియాలుండే వుంటాయి. ఒకోసారి మనం మాట్లాడే మాటల అర్థం మనకే తెలియదు. మైకంలో మనమేం మాట్లాడుతున్నామో తెలుసుకోగలిగితే మనకే ఆశ్చర్యం వుండవచ్చు.”

“నాకు కాస్త మందలవాటున్న మాటలు నిజమే కానీ నాకూ కొన్ని హద్దులున్నాయి. అందరిలో అన్నీ మాట లాడను....” అన్నాడు మోహనరావు.

“ఏది ఏమైనా ముందా ప్రసాదెవరో తెలుసుకోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాలు తెలుస్తాయి....” అన్నాడు రాఘవరావు.

“ఇక్కడున్న ఏడుగురిలోనూ కనీసం ఒక్కరికైనా ఆ ప్రసాద్ తెలిసుండాలని నా నమ్మకం....” అన్నాడు జగన్నాధం.

“నీ నమ్మకం సంగతి అటుంచన్నయ్యా—రేపీపాటికి ఆ ప్రసాద్‌గాడి ఆరా తీసుకుని నీ దగ్గరకు వస్తాను....” అన్నాడు మోహనరావు దృఢంగా.

“ఎలా?”

“వాడట్నుంచి నరుక్కు వస్తున్నాడు. విశ్వం స్కూలు వదిలే టైముకు రేపుకూడా గేటుదగ్గర కాయకపోడు— అప్పుడు వాణ్ణి పట్టుపడతాను....”

“జాగ్రత్త. ఆవేశపడి ప్రాణాలు మీదకు తెచ్చుకోకు”

అన్నాడు జగన్నాథం.

"ఆవేశపడినా పడకపోయినా ఇప్పటికే ప్రాణాల మీదకు వచ్చినట్లుంది...." అన్నాడు మోహనరావు.

4

నీలం బెల్‌బాటమ్ మీద డార్క్‌కలర్ పువ్వులషర్టు టక్ చేసిన అందమైన యువకుడు స్కూల్ గేటుముందు పచార్లు చేస్తూండగా అతని భుజంమీద వెనకనుంచి ఎవరిదో చేయిపడింది. అతను చటుక్కున వెనుదిరిగి ఆ వ్యక్తిని చూసి—"ఓహ్—నువ్వా — ఎవరో అనుకున్నాను?" అన్నాడు.

అతను ఆశ్చర్యంగా—"నువ్వెవరవో నేనెరుగను. నేను నీకు తెలుసా?" అన్నాడు.

"తెలియకపోవడమేం-నీ ఫోటో కూడా నాదగ్గరుంటే," అన్నాడతను. అతను మాట పూర్తిచేస్తూనే జేబులోకి చేయిపోనిచ్చి ఒక ఫోటోతీసి అతని కందించి—"మిస్టర్ మోహనరావ్—నిజంగా నేనెవరో నీకు తెలియదూ?"— అన్నాడు.

మోహనరావు నవ్వి—"బహుశా నీ పేరు ప్రసాదై ఉంటుంది...." అన్నాడు.

"కరెక్ట్—నన్నెరక్కుండా అంత ఖచ్చితంగా పేరు చెప్పడం కష్టం...."

"నీగురించి విన్నాను నిన్ననే. ఇంతకీ నేనెలా తెలుసు-నీకు?"

"సరస్వతి చెప్పింది...."

"ఎవరు—సరస్వతి?"

"ఏమో-నాకంటే నీకే బాగా తెలియాలి. నీ గురించి

ఆమె చాలా చెప్పింది...."

"ఎక్కడుందామె?"—అన్నాడు మోహనరావు.

"తెలియదు...." అన్నాడు ప్రసాద్.

"మరి నీతో ఎప్పుడు మాట్లాడింది!"

"ఎప్పుడేమిటి—రోజూ మాట్లాడుతుంది!"

చిరాగ్గా ప్రశ్నార్థకంగా చూశాడు మోహనరావు ప్రసాద్ వంక.

"అలా చిరాకు పడకు. కావాలంటే నువ్వూ నాతో రూముకి రా. ఎక్కడుందో తెలియకుండా సరస్వతి నాతో ఎలా మాట్లాడుతుందో తెలుసుకుందువుగాని...." అన్నాడు ప్రసాద్.

"ఎక్కడ నీ రూమ్...."

"చెబుతాను వస్తావా?"—అన్నాడు ప్రసాద్.

మోహనరావు కాసేపు ఆలోచించి- "రాను" అన్నాడు.

"భయపడుతున్నావా?"—అన్నాడు ప్రసాద్.

"లేదు – అయినా భయమెందుకు?"

"ఎందుకో అలా అనిపించింది. అయినా సరస్వతి చెప్పకుండా ఏ దారుణమూ చేయను నేను. ఏ దారుణం చేసినా కనీసం ఇరవైనాలుగు గంటలైనా టైమిస్తాను. ముందుగా హెచ్చరిస్తాను...."

మోహనరావు అదోలాచూసి—"నేను రూముకు వస్తానంటే నీకు భయంగా లేదా?" అన్నాడు.

ప్రసాద్ నవ్వి—"నాది ప్రొటెక్టెడ్ లైఫ్. నా ప్రాణానికి ముప్పు వాటిల్లితే అందుకు కారణభూతులు కాగల కొంతమంది ఫోటోలూ, కారణాలూ వివరించే ఉత్తరమూ ఒక కవర్లో ఉన్నాయి. ఆ కవరు నా స్నేహితుడి దగ్గ

రుంది. నాకే ప్రమాదం జరిగినా ఆ కవరు పోలీసులకు చేరుతుంది. అందుకని నన్ను గురించి నాకే బెంగాలేదు. అన్నట్లు ఆ కవర్లో నీ ఫోటోకూడా ఉందనిగుర్తు. పద—నా గదికి పోదాం...." అన్నాడు.

ఇద్దరూ నడక ప్రారంభించారు. అక్కడికి మరీ దూరంగా లేదు ప్రసాద్ ఉండే గది.

దాన్ని గది అనడంకంటె ఇల్లంటేనే బాగుంటుంది. విశాలమైన హాలు. దాన్నానుకుని ఒక చిన్న కిచెన్, లెట్రిన్, బాత్రూమ్ ఉన్నాయి. హాలు చాలా అందంగా నీటుగా ఉంది. చూడ్డానికి గొప్పింటి వాళ్ళ డ్రాయింగ్ రూమ్‌లాగుంది.

"ఎప్పుడైనా టేపు రికార్డర్ చూశావా?" — అన్నాడు ప్రసాద్ గదితలుపులు వేస్తూ.

"చూశాను. వాడాను. వాడుతున్నాను కూడా...." అన్నాడు మోహనరావు.

"గుడ్—అయితే పద నా టేపు రికార్డర్ చూద్దువుగాని...." అన్నాడు ప్రసాద్.

ఇద్దరూ ఒక టేపు రికార్డర్ దగ్గరకు వెళ్ళారు. మోహనరావు దాన్ని పరీక్షగా చూశాడు. చాలా సింపుల్ గానే ఉంది చూడ్డానికి. రికార్డింగ్‌కు ఒక స్విచ్ వుంది. టేపును ముందుకు వేగంగా తిప్పడానికి ఒకటీ, వెనక్కు వేగంగా తిప్పడానికి ఒకటీ, ప్లే చేయడానికి ఒకటీ, ఆపు చేయడానికి ఒకటీ, కాసేట్టేని బయటకు తీసుకునేటందుకు ఒకటీ స్విచెస్ ఉన్నాయి.

"రికార్డర్ సింపుల్‌గానే వుందికదా — దీన్ని అందులో వుంచి రివైండ్ చేసి మొదట్నుంచీ ఏం వస్తుందో ప్లేచేయి"

అన్నాడు ప్రసాద్.

మోహనరావు కాసేట్టే అందుకుని రికార్డులో ఉంచాడు. రీవైండ్ చేసి ప్లేబటన్ నొక్కాడు. పదిసెకండ్ల అనంతరం పాట మొదలయింది — ము....ము....ము....ముద్దంటే చేదా....

"ఇది చాలాసార్లు విన్నాను. బోరు...." అన్నాడు మోహనరావు.

"నిజమే—వినడమే కాదు. చేయడం కూడా చాలా సార్లు నేసరికి బోరుగా వుంటుంది. అందుకే కొంతమంది ఎన్నో మహాదారుణాలు చేయగలిగి ఉండీకూడా ఒక్క సారితోనే ఆపేస్తూంటారు. అందువల్ల బోరుకూడా మంచిదే—యామై కరెక్ట్!"—అన్నాడు ప్రసాద్.

మోహనరావు కంగారుగా ప్రసాద్ ముఖంలోకి చూశాడు. అతను పాట సౌండ్ తగ్గిస్తున్నాడు. అతని ముఖంలో ఏ విధమైన భావమూలేదు.

కాసేపిద్దరూ ఏవేవో మాట్లాడుకున్నారు. రెండుమూడు పాటలయ్యేక—"టేపు మళ్ళీ రీవైండ్ చేయి...."అన్నాడు ప్రసాద్.

"నువ్వే చేయి—" అన్నాడు మోహనరావక్కణ్ణించి తప్పుకుని.

ప్రసాద్ టేపు రీవైండ్ చేసి మళ్ళీ ప్లేచేశాడు. పది సెకండ్ల అనంతరం మళ్ళీ—ము....ము...ము....ముద్దంటే చేదా పాట మొదలయింది. ఒక నిముషం పాడనిచ్చి మళ్ళీ రీవైండ్ చేసి—"మీకు దెయ్యాల మీద నమ్మక ముందా?"—అన్నాడు.

హఠాత్తుగా సంభాషణ దెయ్యాలమీదకు మళ్ళడంతో

మోహనరావు ఆశ్చర్యపడ్డాడు. "లేదు—" అన్నాడు.

"అయితే యిప్పుడు కలగవచ్చు...." అని ఆగాడు.

అతను టేప్‌రికార్డరు మీద చేతులు తీసేసి —"మిస్టర్ మోహనరావ్—ఇందాక ముద్దంటే చేదా పాట విన్నావే. అదే టేపులో అదే చోట ఇప్పుడేం వస్తుందో విను...." అని ప్లేబటన్ నొక్కాడు.

టేపు స్టార్టయింది. సుమారు ఇరవై సెకండ్లవరకూ నిశ్శబ్దం. అప్పుడు వున్నట్లుండి పెద్దనవ్వు వినబడింది. ఆ నవ్వు ఎవరో ఆడదానిది. చాలా భయంకరంగా పెద్దగా నవ్వుతోంది. రికార్డర్ సౌండ్ చాలా బాగుంది. అందువల్ల గదిలో నిజంగా ఎవరో ఉండి నవ్వుతున్నట్లుంది.

ఆ నవ్వలా సుమారు రెండు నిముషాలసేపుంది. ఆ తర్వాత ఎవరో గొంతు సవరించుకున్న శబ్దం "ఒరేయ్-వచ్చేవురా?" అంటూ ఘర్జించింది స్త్రీ కంఠస్వరం.

"మోహనరావ్ — నువ్వొక్కడివే వచ్చేవా? నాతో మాట్లాడాలని మిగతా వాళ్ళకి లేదా—అందరూ వస్తే మనసులో మాట చెప్పేదాన్ని. సరేలే—బాగా ఆలోచించు వీలుంటే మీరందరూ ఒకసారిక్కడకు రండి. అందరూ అంటే ఎవరో తెలుసుగా.... వీలైనంత త్వరగా రండి. ఆలశ్యం చేస్తే మిమ్మల్నందర్నీ ఒక్కసారి కలుసుకోవడం వీలుపడుతుందో పడదో...."

మాటలు ఆగిపోయాయి నవ్వు మొదలయింది. ఆ నవ్వు అలా రెండు నిముషాలసేపుదాక సాగింది. ఆ తర్వాత నవ్వు ఆగిపోయింది. ప్రసాద్ టేపు ఆపి మోహనరావు వంక చూశాడు.

మోహనరావుకు ముచ్చెమటలు పోశాయి. అతని

ముఖంలో భయం స్పష్టంగా కనబడుతోంది.

"ఇలా మాట్లాడుతుంది సరస్వతి నాతో...." అన్నాడు ప్రసాద్.

మోహనరావు చటుక్కున లేచి నాలుగడుగులు వేసి ప్రసాద్‌ని సమీపించి టేపురికార్డర్ మీద చేయివేశాడు. అతను టేపుని రీవైండ్‌చేసి మళ్ళీ ప్లే చేశాడు.

పది సెకండ్ల అనంతరం—"ముముము ముద్దంటే చేదా...." అని పాట ప్రారంభమైంది. అతను టేపు ఆపి "ఏమిటీ ఇంద్రజాలం" అన్నాడు.

"అదే నేను విన్నదగాలనుకుంటున్నాను. సరస్వతి నీకూ తెలుసా! ఆమె అన్న ఆ అందరూ అంటే ఎవరు?" అన్నాడు ప్రసాద్ అమాయకంగా ముఖం పెట్టి.

"త్వరలోనే నీ సందేహాలు తీర్చడానికి ప్రయత్నిస్తాను" అని అక్కణ్ణించి కదిలాడు మోహనరావు.

5

రాత్రి విశ్వం పడుకున్నాక ఇంట్లో మళ్ళీ చర్చ మొదలయింది.

"ప్రసాద్ చాలా ప్రమాదకరమైన వ్యక్తిలా కనబడుతున్నాడు...." అన్నాడు మోహనరావు.

"జరిగినదేమిటో అందరికీ వివరంగాచెప్పరా అబ్బాయ్" అన్నాడు రాఘవరావు.

మోహనరావు గొంతు సవరించుకుని తన అనుభవాన్ని వివరించి చెప్పాడు. అందరూ నోళ్ళు తెరిచివిన్నారు.

"అయితే దెయ్యం టేపురికార్డర్లో మాట్లాడిందంటావా?" అంది రాధ.

"అది దయ్యమా కాదా అన్నది కాదు నా బాధ. మనంద

రమూ ఎంతో భద్రంగా దాచుకున్న రహస్యం ప్రసాద్ కే కాదు—ఇంకో ఆడదానికి కూడా తెలిసిపోయిందే అన్నది బాధగావుంది. ఆ ఆడదెవరో మనమిప్పుడు తెలుసుకోవాలి" అన్నాడు జగన్నాధం.

"ఏం—?"

"నీచేతుల్తో నువ్వే టేపు రివైండ్ చేశానంటున్నావు. నీ చెవులతో నువ్వే స్వయంగా విన్నానంటున్నావు? టేపు మీద పాట ఆడదాని మాటగా ఎలామారిపోతుంది? అది తప్పకుండా దయ్యం ప్రభావమే? ఆ తర్వాత నిన్ను ఒరేయ్ మోహనరావ్ అంటూ పిలిచిందంటున్నావు. అది నిజమైతే నువ్వక్కడికి వస్తావని ముందుగా ఊహించి అలాంటి టేపు రెడీగా తయారుచేసి పెడతారనుకోలేంగదా — ఏదో మానవాతీతశక్తి నిన్ను చూసి మాట్లాడిందనే అనుకోవాలి" అన్నాడు జగన్నాధం.

మోహనరావు నవ్వి—"మనం ప్రసాద్‌ను తక్కువ అంచనా వేయకూడదు. అతనుచాలా తెలివైనవాడు. నిన్నటిరోజున విశ్వాన్ని కలుసుకున్నాడు గదా. దానిప్రభావంగా తన నెవరైనా కలుసుకునేందుకు ప్రయత్నిస్తారని ఊహించి వుంటాడు. సాధారణంగా ఇంట్లోని మగవాళ్ళే అతన్ని కలుసుకునేందుకు ప్రయత్నిస్తారు.

మగవాళ్ళలో నాన్నగారెలాగూ వృద్ధులు. అందువల్ల మనిద్దరిలో ఒకరు వస్తామని అనుకుంటాడు. ఇద్దరిలోకీ చిన్నవాణ్ని నేనుకాబట్టి—నేనే వస్తానని అనుకొని వుండవచ్చు. లేదా మనిద్దర్నీ వుద్దేశించినట్లు ఒక స్త్రీ మాట్లాడినట్లు—రెండు కాసెట్టే టేపులు సిద్ధంచేసి వుంటాడు. ఎవరువస్తే ఆ కాసేట్టే తీద్దామని అనుకుని వుంటాడు. ఆ

ఏర్పాటు చేసుకోవడమంత కష్టంకాదు. కానీ అదే కాసేట్టే ఏమార్పు లేకుండా ఒకసారి పాటా, ఒకసారి మాటా ఎలా పలికిందా అన్నదిమాత్రం నా కాశ్చర్యంగా వుంది" అన్నాడు.

"నువ్వు చెప్పినదంతా బాగానేవుంది. ఏ విధంగా ఆలోచించినా ఆ ప్రసాద్ గురించి మనమింకా చాలా ఎక్కువగా తెలుసుకోవాలనిపిస్తోంది. ఈ విషయంలో అతనికి సహాయపడుతున్న ఆ ఆడదెవరు? చేపు మాట ఒకసారి, పాట ఒకసారీ పలకడంలోని రహస్యమేమిటి? ప్రసాద్ కి నిజంగా మానవాతీత శక్తి సహకరిస్తోందా?—ఇవన్నీ తెలుసుకోవాలి మనం. ఈ విషయాలమీద మన జీవితాలూ, జీవిత సౌఖ్యాలూ ఆధారపడి వున్నాయి...." అన్నాడు రాఘవరావు.

"ఆలోచిస్తూంటే నాకో ఉపాయం తోస్తోంది—...." అన్నాడు జగన్నాధం...."ఆ ప్రసాద్ రేపుకూడా మనలో ఎవరో ఒకరు తనని కలుసుకుంటారని ఊహిస్తాడు. ఈసారి నేను వస్తాననుకోవచ్చు. కానీ ఏ పరిస్థితుల్లోనూ, రాధ తనను కలుసుకునేందుకు వస్తుందని ఊహించలేడు. ఆ పరిస్థితుల్లో అతనేం చేస్తాడో—ఎలా ప్రవర్తిస్తాడో తెలుసుకోవాలి. అతనికి మనం తప్పులుచేసే అవకాశమిస్తే కానీ మనిషి దొరకడు...."

"బాబోయ్ నేను వెళ్ళను. మనిషిని చూడకపోయినా అతనంటే నాకు చాలా భయంగావుంది...." అంది రాధ.

"అలాగంటే కుదరదు. మనందరి భవిష్యత్తూ ఈ ప్రసాద్ చేతిలోవుంది. ఆ ప్రసాద్ నో పట్టుపట్టడానికి మనందరమూ ఏమైనాసరే చేయాల్సొంటుంది...."అన్నాడు జగన్నాధం—ఏమైనా అన్నపదాన్ని నొక్కి పలుకుతూ.

6

"వాటే స్టన్నింగ్ బ్యూటీ...." అన్నాడతను.

"రోజూచూపినా అలాగే అంటావు ప్రకాష్—"అంది రాధ సిగ్గుపడుతూ.

"శతాబ్దాలుగా చూస్తున్నాకూడా తాజమహల్ ప్రపంచాద్భుతం కాకుండా పోతున్నదా? అలాంటిది ఈ రాధ— సృష్టిలోని అందాన్నంతటినీ రంగరించి తయారుచేయబడిన రాధ....రోజూ చూస్తూన్న కారణంగా స్టన్నింగ్ బ్యూటీ కాకుండా పోతుందా?" అన్నాడు ప్రకాష్.

"ఎంత చక్కగా మాట్లాడుతావు ప్రకాష్? నువ్వు నీ సమయాన్ని యూనివర్సిటీలో వృథా చేయకుండా-ఉమర్ ఖయ్యాంలా కవిత్వం చెబుతూ గడపవలసిన వాడివి...."

"నిజమే— కానీ నా కవిత్వానికి నువ్వుకావాలి. నువ్వు లేనిదే నా నోరు మూగవోతుంది. ఎప్పుడూ నువ్వు నా దగ్గరే వుంటానని మాటివ్వు. ఈ క్షణమే యూనివర్సిటీ వదిలేస్తాను...."

"మాటివ్వడానికేముంది? నువ్వు మా యింటికి రా. అన్నయ్యున్నాడు. నాన్నగారున్నారు. వాళ్ళతో మాటలాడి నన్ను తీసుకుపో. జీవితాంతం నువ్వుపొమ్మన్నా పోకుండా నీ దగ్గరుండి నా స్టన్నింగ్ బ్యూటీతో నీనోట కవిత్వం పలికిస్తూంటాను. సరా?"

ప్రకాష్ మౌనం వహించాడు.

"ఎప్పుడూ ఈ పాయింట్ దగ్గరే నీమౌనం మొదలవుతుంది....'' అంది రాధ.

"అవును రాధా .... పెద్దవాళ్ళతో మాట్లాడ్డానికి నాకు భయం. నేను చెప్పిన ఉపాయం నీకు నచ్చదు...."

"బాగుందిలే. చాలా చచ్చు వుపాయం చెప్పావు. అంత కంటే వేరే ఏం దొరకలేదా?"

"ఇంకేమీ పని చేయవు. నీకు నెల తప్పిందంటే పెద్ద వాళ్ళు హడలిపోయి నన్ను వెతుక్కుంటూవచ్చి మరి పెళ్ళి చేసేస్తారు...."

"అప్పుడు నువ్వు దొరుతుతావా-అన్నది అనుమానం. ఈ స్టన్నింగ్‌బ్యూటీ నీకు పెళ్ళయితేకానీ అనుభవానికి దొరకదు. అనవసరపు టాశలుమాత్రం పెట్టుకోకు...." అంటూ రాధ లేచింది.

"రాధా—వెళ్ళిపోతున్నావా—" అన్నాడు బాధగా ప్రకాష్.

"అవును. చిన్న అపాయింట్ మెంటుంది—...." అంది రాధ.

"ఎవరు—ఎక్కడ?"—అన్నాడు ప్రకాష్. అతని కళ్ళలో అసూయలాంటిది చూసి నవ్వుకుంది రాధ.

"అతనిపేరు ప్రసాద్. వయసు పాతికేళ్ళుంటాయి. కావాలని నేను అతనితో పరిచయం చేసుకోబోతున్నాను."

"ఎక్కడ?"

చెప్పింది రాధ.

"ఎందుకు?"

"చెప్పను. చెప్పకూడదు. కానీ అతను చాలా ప్రమాదకరమైన మనిషి. అయినా తప్పదు. వెళ్ళాలి. వెళ్ళికలుసుకోవాలి...."

"ఏం—బ్లాక్ మెయిల్ చేస్తున్నాడా?"

"లేదు. ఇదే మొదటిసారి కలుసుకోబోవటం...."

ప్రకాష్ కళ్ళలో అనుమానం కనపడింది—"నువ్వేదో

దాస్తున్నావు రాధా—నువ్వేదో ఇబ్బందిలో వున్నావని నాకు తోస్తోంది. నేనూ వస్తాను నీతోటి."

"వద్దు—రావద్దు—...." అంది రాధ.

"అలాగనకు రాధా—నన్నూరానివ్వు...." అన్నాడు ప్రకాష్. రాధ అన్యమనస్కంగా తలూపింది. ఇద్దరూ రిక్షాయెక్కారు.

రిక్షా స్కూల్‌గేటు దగ్గర ఆగింది. రాధ టైముచూసుకుంది. గేటుదగ్గర అసలు యువకుడంటూ ఎవరూ కనబడలేదు.

"స్కూలు వదిలేటైము కావస్తోంది. అతనింకా వచ్చినట్లులేదే—" అంది రాధ.

"సరిగ్గా ఈటైముకే అతనిక్కడకు వస్తాడా? నీకోసమేనా?"....అడిగాడు ప్రకాష్.

"అబ్బ—నీకెలా చెప్పాలో తెలియడంలేదు. కొన్ని కొన్ని విషయాలు నువ్వడగకూడదు, నేను చెప్పకూడదు. ఇది ప్రేమకు సంబంధించిన వ్యవహారం కాదని చెప్పాను గదా—" అంది రాధ విసుగ్గా.

"నా మనసు మనసులో లేదు రాధా! పాతికేళ్ళ యువకుణ్ణి నీకు నీవై కలుసుకుంటానంటుంటే ఎందుకో నాకు విచారంగా ఉంది ...." అన్నాడతను.

ఇద్దరూ అక్కడ చాలాసేపు నిలబడ్డారు.

ఆ గేటు ముందుకు ఎవ్వరూ రాలేదు. స్కూలు వదిలిపెట్టేక పిల్లలు బయటకు రావడం ప్రారంభమైంది. ప్రేమికులిద్దరూ గేటు సమీపంలో ఉన్న చెట్టు ప్రక్కకు వెళ్ళారు. రాధ మాత్రం బయటకు వచ్చే పిల్లలందర్నీ ఒకొక్కరినే గమనిస్తోంది. గేట్లోంచి బయటకువస్తున్న విశ్వం కూడా

ఆమెకు కనబడ్డాడు.

విశ్వాన్నెవ్వరూ పలకరించలేదు. అటకాయించలేదు. అతను నెమ్మదిగా రోడ్డెక్కాడు. తనకు తెలిపిన దారి పట్టాడు. స్కూల్నించి ఇంటికి మరీ ఎంతో దూరముండదు. విశ్వం రోజూ నడిచే ఇంటికి వెడతాడు.

"అమ్మయ్య—నా పనీ పూర్తయింది. మనం వాడి కళ్ళ పడనూలేదు...." అంది రాధ తేలిగ్గా నిట్టూరుస్తూ. ప్రసాద్ కనబడకపోవడం ఆమెకు సంతోషంగానే ఉంది.

7

"నాకు ప్రసాద్ కనబడలేదు...." అంది రాధ.

జగన్నాధం ముఖం ఏదోలాగయిపోయింది. ప్రశ్నార్ధకంగా మోహనరావు వంక చూశాడు. మోహనరావు — కంగారుపడకుండా రాధ నింకా మాట్లాడనివ్వాల్సిందన్నట్లు ముఖభావాలతో సూచించాడు.

"చాలాసేపు ఎదురుచూశాను. గేటుదగ్గర ఎప్పటికీ ఎవ్వరూ రాలేదు. విశ్వం వెళ్ళిపోయాక కూడా ఇంకో అరగంట ఎదురుచూపి.... ఇంక లాభంలేదని ఆ స్థలం వదిలిపెట్టాను.''

"అయితే ఇంటికి బాగా ఆలశ్యంగా వచ్చావుగదా— ఏం చేస్తున్నావ్ — ఎక్కడికి కెళ్ళావ్?"— అన్నాడు జగన్నాధం.

"ఒక స్నేహితురాలెదురైతే ఇద్దరం కలిసి పార్కుకి వెళ్ళి కాసేపు గడిపివచ్చాం...." అంది రాధ తడబడుతూ.

"మనలో నిజంగానే ఎవరో దోషి ఉన్నారేమోనని అనుమానం ధృవపడుతోంది నాలో. అప్పుడే అబద్ధాలు చెప్పడం మొదలవుతోంది...." అన్నాడు జగన్నాధం.

"నేను నిజం చెబుతున్నాను...." అంది రాధ. కానీ ఆమె మాటలింకా తడబడుతూనే ఉన్నాయి.

"చూడు రాధా—ఒంటరిగా ఆడపిల్ల ఒక యువకుణ్ణి కలుసుకునేందుకు వెడుతోందంటే ఇంట్లో అందరికీ కంగారుగా ఉండడం సహజం. అందుకని నీకే అపాయమూ వాటిల్లకుండా ఉండడానికీ, నిన్ను వేయి కళ్ళతో కనిపెట్టి కాపాడడానికీ మోహనరావుని నియమించాను. నీ అన్న మోహనరావు ఈ సాయంత్రం చూపినదేమిటో నీ సమక్షంలోనే ఇప్పుడందరికీ తెలియబరుస్తాడు...." అన్నాడు జగన్నాథం.

రాధ ముఖంలో కంగారు స్పష్టంగా కనబడుతోంది. ఈ సంగతి తనూహించలేదు. అప్పటికీ చుట్టుపక్కల తను జాగ్రత్తగా గమనిస్తూనే ఉంది. తనకు దొరక్కుండా మోహనరావు వచ్చి తననీ ప్రకాష్‌నీ చూశాడన్నమాట. తన నేరం పట్టుబడబోతోంది. ఇదీ ఒకందుకు మంచిదే—ఎలా పరిష్కరించాలా అనుకుంటున్న సమస్య ఈ విధంగా పరిష్కరించబడుతుంది. రాధకు కాస్త ధైర్యం వచ్చింది. జరగబోయే దానికి సిద్ధపడి— "చెప్పరా—ఏం చూశావో అందరికీ చెప్పు—" అంది నిబ్బరంగా.

మోహనరావు గొంతు సవరించుకుని — "నిన్నూ, ప్రసాద్‌నీ కలిపి కబుర్లాడుతూండగా చూశాను. ఇద్దరూ స్కూలుగేటు వద్ద చాలాసేపు నిలబడ్డారు. ఆ తర్వాత పార్కుకి వెళ్ళారు. మీరిద్దరూ పార్కుకి కాకుండా అతని గదికి వెడితే నేనింకా నిన్ననుసరించి ఉండేవాడిని. కానీ పార్కుకు వెళ్ళడంతో ఆ అవసరం లేకపోయింది...." అన్నాడు.

రాధ ఉలిక్కిపడింది. మోహనరావంటున్నది ఏమిటి? అతననేమాటల అర్థమేమిటి?

"నువ్వేమిటి చూశావో — ఏం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?" అంది రాధ కాస్త తీవ్రంగా.

"రాధా—ఇంక వివాదాలనవసరం. ప్రసాద్ నీకేం చెప్పాడో చెప్పు. ఆ విషయాల మీద మన భవిష్యత్తాధార పడి ఉంది. మనింట్లో ఎవరూ ఏవిధమైన రహస్యాలూ దాచకూడదు...." అన్నాడు జగన్నాథం అనునయంగా.

రాధ క్షణం ఆలోచించి— "అయితే చెబుతున్నాను వినండి. అతను నాది స్టన్నింగ్ బ్యూటీ అన్నాడు. నేను లేకపోతే బ్రతకలేనన్నాడు. పెద్దల ముందుకువెళ్ళి అడిగే ధైర్యం తనకు లేక జాప్యం చేస్తున్నానన్నాడు. పార్కులో గడిపిన రెండుగంటలలోనూ అతను నా అందాన్ని వర్ణించినదే ఎక్కువ. ఆ వర్ణనలన్నీ వినాలని మీకుంటే నాక్కాస్త వ్యవధి ఇవ్వండి. గుర్తుచేసుకుని కాగితం మీద రాసుకుని చదువుతాను...." అంది.

"ఎంత ధైర్యం ఆ ప్రసాద్‌కి—" అంది సత్యవతి.

"అతను ప్రసాద్ కాదు...." అంది రాధ.

అందరూ ఉలిక్కిపడ్డారు. రాధ కొనసాగించింది — "అతని పేరు ప్రకాష్. హిస్టరీలో రీసెర్చి స్కాలరు. అతన్ని గురించిన పూర్తి వివరాలు తెలియవు కానీ ఏడాదిగా మనిషి మాత్రం తెలుసును. రోజూ యూనివర్శిటీలో ఏదో సమయంలో నన్ను కలుసుకుని ప్రేమకబుర్లతో బోరుకొడుతూంటాడు. అతను చేసేవన్నీ పొగడ్తలే కాబట్టి వినడానికి బాగానే ఉంటుంది. అతన్ని పెళ్ళి చేసుకోవాలని నేనేమీ తపించిపోవడం లేదు. అలాగని అత

నంటే విముఖతాలేదు. ఈరోజు కూడా ఎప్పటిలాగే వెంట తగిలాడు. స్కూలుగేటు దగ్గర. అన్నయ్య చూపింది. అతన్నీ, నన్నూ అయుంటుంది. యూనివర్సిటీ నుంచి స్కూలుకి మేమిద్దరమూ కలిసే వచ్చాం అక్కడ కాసేపు ఎదురు చూసి పార్కుకి వెళ్ళాం...."

వింటున్న అందరిలోకీ మోహనరావు కళ్ళలోనే ఆశ్చర్యం ఎక్కువగా కనిపిస్తోంది—"నేను నీ పక్కన ప్రసాద్‌ని చూశాను...." అన్నాడతను.

జగన్నాథం తండ్రివంక అదోలాచూసి—"స్వేచ్ఛను వీళ్ళుపయోగించుకుంటున్న తీరు ఇది...." అన్నాడు.

రాఘవరావు నెమ్మదిగా—"ప్రసాద్. ప్రకాష్-ఇద్దరూ ఒకరేనేమో ఆలోచించు—" అన్నాడు.

అందరూ మళ్ళీ ఉలిక్కి పడ్డారు. రాధ కంగారుగా—"అతను నాకు ఏడాదినుంచి తెలుసు. అతనిమీద నాకే దురభిప్రాయం లేదు...." అంది.

"ఏడాదిగా నీకు తెలుసునంటే నీనుంచి అతను ఒడుపుగా చాలా రహశ్యాలు లాగివుండాలి. ప్రేమమైకంలో ఒకోసారి మనమేం మాట్లాడుతున్నామో తెలియదు. ఆ రహశ్యాల ఆధారంతోనే అతనిప్పుడు మనమీద దాడి ప్రారంభించాడేమో...." అన్నాడు జగన్నాధం.

"అనవసరంగా నన్ననుమానించ వద్దన్నయ్యా. అతను నా దగ్గర అందాన్ని పొగడ్డం మినహా మరే మాటలూ చెప్పడు. నేను వినడం మినహా ఏమీ చెప్పను...."

"రాధా. ఒక మగవాడు ఆడపిల్ల దగ్గరకు వెళ్ళి అందాన్ని పొగిడి ప్రేమ కబుర్లు చెప్పాడంటే అందుకు చాలా ధైర్యం కావాలి. అందులో కొంతపాలు ఆడపిల్ల

వల్లనే లభిస్తుంది. మానసికంగా వాళ్ళు చాలా దగ్గరగా వచ్చారనే చెప్పాలి. బాగా ఆలోచించుకో. నువ్వను కుంటున్న ప్రకాష్-ప్రకాష్ కాదనీ అతనిపేరు ప్రసాద్ అనీ ఊహించుకుని-నీ జీవితంలో అతనితో అనుమానించ దగ్గ పరిస్థితు లేర్పడ్డాయేమో గుర్తుచేసుకునేందుకు ప్రయ త్నించు. ఈరోజు కాకపోయినా నెమ్మదిమీద ఆలోచించి-ఏమైనా ముఖ్య విషయాలున్నాయని తోస్తే చెప్పు...." అన్నాడు జగన్నాథం గంభీరంగా.

ప్రసాదూ, ప్రకాషూ ఒకరేనంటే రాధకు నమ్మకం కలగడంలేదు. కానీ ఆలోచన ఆమెకు భయంకరంగా వుంది. ఒకవేళ ఇద్దరూ ఒకటే అయితే తను పెద్ద ప్రమాదంలో ఇరుక్కున్నట్లే లెక్కవుతుంది. కాదను కుందామా అంటే నిన్ననే అన్నయ్య ప్రసాద్‌ని చూశాడు. కాబట్టి అతను పొరబడే అవకాశం తక్కువ."

"ఇద్దరూ ఒకటికాని పక్షంలో ఆ ప్రకాషెవరో వివ రాలు తెలుసుకుని పెళ్ళి కబుర్లు ఆడడం మంచిది...." అన్నాడు రాఘవరావు.

"అదిసరే కానీ-మన తదుపరి కర్తవ్యమేమిటి?"— అన్నాడు జగన్నాథం.

"ప్రసాద్‌ని కలుసుకోవడానికి యమునను పంపిం చండి—" అంది రాధ చిరాగ్గా.

"ఏమో-అతను రోజూ స్కూలు గేటు దగ్గరకు వస్తా డని గ్యారంటీ ఏమిటి?"—అన్నాడు మోహనరావు.

"ఇంతవరకూ వచ్చాడని నువ్వంటున్నావు గదా—" అంది రాధ.

"రాలేదని నువ్వంటున్నావు గదా—" అన్నాడు

అపరాధ పరిశోధన పోటీ-109[ఫలితాలు]

ఆగస్టు '77 నెల 'అపరాధ పరిశోధన పోటీ_109కి సరియైన సమాధానాలు :

1. సౌదీ అరేబియా.
2. చిత్ర నిర్మాణం.
3. నేరాలు.
4. బ్రతకనేర్చినవాడు.
5. దేవాలయం.

పై జవాబుల ప్రకారం ఒక్కరు మాత్రమే అల్ కరక్టుగా పంపారు. వీరికి అక్టోబరు '77 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత :

(1) శ్రీ యం. ఎస్. ప్రసాద్,
ఐ. సి. 7, ఎర్రమంజిల్ కాలనీ,
హైదరాబాదు_500 004.

(2) శ్రీ కె. రామలక్ష్మయ్య,
27/91, పేట,
కొత్త రోడ్డు,
కర్నూలు_518 001.

(3) శ్రీ యం. ఏ. సలీంఅక్తర్, బి.కాం.,
ఎమ్. ఎస్. సైకిల్ షాప్,
స్టేషన్ రోడ్,
మంచిర్యాల,
(ఆదిలాబాదు జిల్లా.)

మోహనరావు.

"వాదన లనవసరం. మనం కొ త్త రిస్కు తీసుకుందాం. ప్రసాద్ చుట్టూ మనం తిరగడం అనవసరం. మన మందరమూ కామ్‌గా ఊరుకుంటే అతనే మళ్ళీ ఏదో ప్రయత్నం చేస్తాడు...." అన్నాడు జగన్నాధం.

"అతని ప్రతి ప్రయత్నమూ మనలను హాని కలిగించ డానికే గదా-అందుకని మనజాగ్రత్తలో మనముండాలి...." అన్నాడు రాఘవరావు.

"కావచ్చు. కానీ ప్రస్తుతాని కింతకుమించి మనం చేయగలిగిన దేమీలేదు ..." అన్నాడు జగన్నాధం.

మర్నాడుదయం రాధ విశ్వాన్ని రహస్యంగా తన దగ్గరకు పిలిచి తన దగ్గరున్న ఫోటో చూపించి—"ఈయ నేనా-నువ్వు చూపిన ప్రసాద్!" అంది.

విశ్వం క్షణకాలం ఆ ఫోటోని పరీక్షగా చూపి-"ఛాఛా-మామయ్య ఇలాగుండడు. ఇంకా చాలా చాలా బాగుం టాడు. ఇది మామయ్య ఫోటో కాదు...." అన్నాడు. రాధ కొయ్యబారిపోయింది.

8

ఆఫీసు వదిలేటయిముకి—"సార్ మీకోసం ఎవరో ఆడపిల్ల వచ్చిందండి-" అన్నాడు ప్యూన్‌వచ్చి మోహన రావుతో.

మోహనరావు ఉత్సాహంగా లొట్టలు వేసుకున్నాడు. ఇదతనికి కొత్తకాదు. అతనికో బ్రోకరున్నాడు. అతను స్నేహం పేరిట మోహనరావు కోరినప్పుడల్లా ఒక అమ్మా యిని పంపిస్తూంటాడు.

మోహనరావుకి వేరేగది వుంది. అది ప్రత్యేకంగా

చెప్పుకోండి చూద్దాం?

1. న్యాయస్థానం ఒక నేరస్తుడికి కారాగార శిక్షతోపాటు, జుల్మానాకూడా విధించింది. ఆ నేరస్తుడు జైలుశిక్ష అనుభవించిన తర్వాత జుల్మానా కట్టడానికి కోర్టు ఒప్పుకుంటుందా?

2. 'సైనయిడ్' విషంతో మరణించిన వ్యక్తి కనురెప్పలు ఎలా వుంటాయి?

3. వురి తీయబడ్డ వ్యక్తి శరీరం పొడవుగా సాగుతుందా?

4. తుపాకి బారెల్‌కు ఒక పొడవాటి గొట్టం అమర్చి, పేల్చితే, అందులోని బుల్లెట్స్ అదే స్పీడులో దూసుకుపోతాయా?

5. మరణ దండనవల్ల మరణించిన నేరస్తుడి శవానికి అధికారులు, అతడి మతాచారం ప్రకారం అంత్యక్రియలు జరుపుతారా?

6. మనిషి వెంట్రుకనుబట్టి, అది మనిషిలోని ఏ భాగంలోనిదో తెలుసుకోవచ్చునా?

7. జడ్జికూడా సాక్ష్యం ఇవ్వవలసి వస్తే, కోర్టు బోనులో నిలుచోవాలా?

—కె. చందర్‌రావ్.

జవాబులు :

1. ఒప్పుకోరు. జుల్మానా ముందుగానే కట్టాలి.
2. నీలంగా వుంటాయి.
3. మూడునుండి అయిదు అంగుళాలు సాగుతుంది.
4. స్పీడు తగ్గుతుంది.
5. జరుపరు.
6. తెలుసుకోవచ్చును. 7. అవును.

తన వినోదంకోసం అద్దెకు తీసుకున్నాడు మోహనరావు. ఆ గదికి డూప్లికేట్ తాళం ఆ బ్రోకర్ దగ్గరుంటుంది. ఆ బ్రోకరు తాళాన్నో అమ్మాయికిచ్చి పంపిస్తాడు. అమ్మాయి వెళ్ళి గదిలో ఉంటుంది. మోహనరావు ఆఫీసునుంచి గదికి వెళ్ళి కొన్ని గంటలసేపు గడుపుతాడు. అతనికీ రకం అలవాటున్నట్లు ఇంట్లో చూచాయగా తెలుసును.

ఒకోసారి అమ్మాయి గదికి వెళ్ళదు. తిన్నగా ఆఫీసుకే వచ్చేస్తుంది. అంటే ఆపిల్ల చాలా అందమైనదై ఉండాలి. ఆమెకు ప్రత్యేకమైన కోర్కెలున్నాయన్నమాట. అందు గురించి మోహనరావుకు బజార్లో కొంత ఖర్చవుతుంది.

నెలజీతం కాక ప్రతిరోజూ మోహనరావుకు-లంచాల పేరుతో చాలా డబ్బు దొరుకుంది. అందుకని తన జల్సాల గురించి ఆస్తిని కరిగించాల్సిన అవసరంలేదనికి. ఎటొచ్చీ వచ్చే జీతంలో పైసాకూడా ఇంట్లో ఇవ్వడు. పెళ్ళిచేసుకుంటే ఎంతోకొంత ఇంటి బాధ్యతలు తప్పనిసరి అని అతనికి తెలుసు. అందుకే అతను పెళ్ళిచేసుకోవడంలేదు. ప్రస్తుతం అనుభవిస్తున్న జల్సాలు సామాన్యమైనవికావు. వాటిమీద అతనికింకా మోజుంది.

మోహనరావు ఉత్సాహంగా బయటకు వచ్చేడు. అతని కోసం ఎదురుచూస్తున్న ఆడపిల్లది అద్భుతమైన అందం. ఆ అందాన్ని చూస్తూనే అతని కళ్ళు చెదిరిపోయాయి.

బంగారు రంగు శరీరచ్ఛాయ, అప్సరసలను తలదన్నే ముఖం. గ్రీకు శిల్పాల అవయవ లావణ్యాలు—"నమస్కారమండీ-మీరే మోహనరావుగా రనుకుంటాను."

'కంఠం కూడా బాగుంది ...' అనుకున్నాడు మోహనరావు—"అవును నేనే? మిమ్మల్ని శేఖర్ పంపాడా?"—

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5_25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5_25 (అన్నిఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్.గా పంపబడతాయి. ఏ నెలలోనైనా మీరు కాపీలు తీసుకోక పోతే, వి. పి. తిరిగొస్తే మీ సభ్యత్వము రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకుంటే కొంత కన్సెషన్ కూడా లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునే వారు, ఏడాది పైకము రు. 60/-లు ముందుగా పంపితే వారికి కాపీలు 'రికార్డెడ్ డెలివరీ'లో పంపగలము. కాపీలు మీకు గ్యారంటీగా చేరుతాయి. ఖర్చులుకూడా కొంత తగ్గుతాయి.

నేడే మీరు సభ్యులుగా చేరండి!

అవునన్నట్లు తలాడించిందామె. మోహనరావు శరీరం గాలిలో తేలిపోయింది. ఇంత అందం ఎప్పుడో కానీ తగలదు. ఈరోజు కొ్స్త ఖర్చు పెరిగినట్లే అనుకున్నాడతను.

అతనామెను సమీపించి—"గదికి పోదామా—ఏమైనా సరదాలున్నాయా?" అన్నాడు.

"నాకు పెద్ద సరదాలేమీలేవు. మంచంమీదకు నడిచే ముందు నాచేతిల్తో ప్రియుడికి కోన్యాక్ ఇవ్వాలి. కోన్యాక్ తీసుకున్న పెదవులు, ఆ వాసన అంటే నాకు చాలా ఇష్టం...." అందామె.

'అందానికి తగ్గ కోరిక....' అనుకున్నాడు మోహనరావు—"నీ పేరు?"

"అందం...." నవ్విందామె.

"తగినపేరు...." అతనూ నవ్వాడు. ఇద్దరూ దగ్గర్లోని బ్రాందీ షాపుకు వెళ్ళారు.ఆమె కోరినది అతను కొన్నాడు. ఇద్దరూ గదిలోకి వెళ్ళారు.

అతను తలుపులు వేస్తూ—"వెళ్ళి స్నానం చేసిరా-" అన్నాడు.

"నువ్వూ వస్తావా?"—అందామె.

"వద్దు. అప్పుడు నేను తొందర పడిపోతాను. మన మిద్దరమూ మధుర పరిమళాలతో గుబాళించిపోయే సమయంలోనే మంచానికి పని ..." అతను నవ్వాడు.

ఆమె వెళ్ళింది. పదినిమిషాల్లో స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చింది. అక్కడ ఏమి సెంట్లున్నాయో కానీ ఆమె శరీరం ఘుమ ఘుమ లాడిపోతోంది. మోహనరావు ఉద్రేకాన్నణచుకుని బాత్రూముకు వెళ్ళి స్నానంచేసి బట్టలు

"సెప్టెంబరు '77 బ్యాలెట్ ఫలితాలు"

గత నెల నిర్వహించబడిన బ్యాలెట్‌లో ఈ క్రింది రచనలు ఉత్తమంగా నిర్ణయించబడ్డాయి.

1. ఆకలి చావు (ఉత్తమ నవల)
రచన: గీతారాణి.

2. పగ - ద్వేషం (ఉత్తమ కథ)
రచన: జొన్నలగడ్డ రామలక్ష్మి.

3. అన్వేషణ? (ఉత్తమ హాస్య రచన)
రచన: చాగాపురం నాగేశ్వరరావు.

ఉత్తమ నవలకు రు. 200/-లు, ఉత్తమ కథకు రు. 100/-లు, ఉత్తమ హాస్యరచనకు రు. 20/-లు బహుమతి త్వరలో ఆయా రచయిత(త్రు)లకు అందజేయబడుతుంది.

పై మూడు ఉత్తమ రచనలను సరిగా ఎన్నిక చేసిన యీ క్రింది పాఠకులకు ఒక్కొక్కరికి రు.10/-లు చొప్పున బహుమతి నగదు పంపగలము.

1. ఎన్. సుభద్ర, విద్యానగర్. 2. ఆర్. గోపాలక్రిష్ణ, విజయనగరం. 3. యు. చినరామకృష్ణ, విజయనగరం. 4. హైమవతి, గుంతకల్. 5. సి. హెచ్. నారాయణ, కంచిలి. 6. కె. నందయ్య, ఖమ్మం. 7. తొట్లూరు అప్పలస్వామి, గంజాం. 8. పి. స్వర్ణలతారెడ్డి, హన్మకొండ. 9 కోన రాజభూషణరావు, సిలిగురి జంక్షన్.

మార్చుకున్నాడు. చక్కని సెంటు రాసుకున్నాడు. అతనూ ఇప్పుడు ఘుమ ఘుమ లాడిపోతున్నాడు.

"నీలాంటిదాన్ని-ఇంతవరకూ ఎక్కడా చూడలేదు...." అన్నాడతనామెను గాఢంగా కౌగలించుకుంటూ.

"పోనీ-ఎప్పటికీ నీదాన్ని చేసుకుంటావా?" అందామె.

అతను సమాధానంగా ఆమె చుబుకం పైకెత్తి ముద్దాడబోయాడు. ఆమె రెండువేళ్ళూ అడ్డంపెట్టి— "కోన్యాక్ పుచ్చుకున్నాక ..." అంది.

"అయితే త్వరగా ఇవ్వు...." అన్నాడతను.

అతన్ని విడిపించుకుని ఆమె దూరంగా నిలిచింది. టేబుల్‌మీద వున్న చిన్న గ్లాసులో కోన్యాక్ పోస్తూనే ఒడుపుగా ఒక బిళ్ళ జారవిడిచింది. క్షణాలమీద ఆ బిళ్ళ ద్రవంలో కరిగిపోయింది. ఎంతో వయ్యారంగా నడుచుకుంటూ ఆమె అతన్ని సమీపించి, అతనిచేత కోన్యాక్ తాగించింది.

త్రాగడం పూర్తి కాగానే అతను గట్టిగా ఆమెను ముద్దు పెట్టుకున్నాడు. వేగంగా ఆమెను మంచంవైపుకి నడిపించి—మంచం మీదకు లాగేశాడు. అతనామెను కౌగలించుకోబోయాడు కానీ చేతులు పట్లులేవు. కళ్ళు తెరవబోతే తెరుచుకోలేదు.

అతనిప్పుడు కొత్తరకమైన మత్తులోవున్నాడు. ముఖంలో ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది.

"మిస్టర్ మోహనరావు—ఏం చేస్తున్నావ్" అందామె మంచం మీంచి లేచినిలబడి.

"స్వర్గం చూస్తున్నాను...." అన్నాడతను.

"చూస్తూండు. నేను వెళ్ళివస్తాను...." అందామె.

అపరాధ పరిశోధన పోటీ-111

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-10-'77 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు డిసెంబరు '77 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. ఈ రాజకీయనాయకున్ని యీ మధ్యనే అరెస్టు చేయడం జరిగింది__? (బన్సీలాల్, సంజయ్.)

2. ఆస్థిపరులకు ఇది భరించడం కష్టంగా వుంటుంది __? (ఆస్థిపన్ను, అపవాదు.)

3. ఈ మహా నాయకుడు రైతుబిడ్డ__? (జిమ్మీకార్టర్, నీలం సంజీవరెడ్డి.)

4. అన్ని దానాలలోకెల్ల యీ దానం శ్రేష్ఠమైనది __? (అన్నదానము, ప్రాణదానము.)

5. కొందరు యీ విధంగాకూడా డబ్బు సంపాదించాలని చూస్తారు__? (జూదం, లాటరీలు.)

"వెడితే వెళ్ళు. ఇప్పుడు నాకెవ్వరూ వద్దు...." అన్నాడు.

సరిగ్గా అప్పుడే అతని మంచం క్రిందనుంచి ఒకవ్యక్తి లేచివచ్చాడు. ఆమెను సమీపించి అభినందనపూర్వకంగా చూస్తూ-"వెరీ వెల్‌డన్"-అన్నాడు.

"ధ్యాంక్యూ" అందామె.

"నువ్వికవెళ్ళవచ్చు...." అన్నాడతను. ఆమె వెళ్ళిపోగానే తలుపులు గడియవేసి మోహనరావుని సమీపించాడతను. జేబులోంచి చిన్నపెట్టిలాంటిది తీశాడు. అది పాకెట్ కాసెట్టే రికార్డర్. ఏవో యడ్జస్ట్‌మెంట్సు చేసి—"మిస్టర్ మోహనరావ్-ఏం చేస్తున్నావ్—" అన్నాడతను.

"స్వర్గాని చూస్తున్నాను...."

"స్వర్గాన్ని చూడాలని అంత కోరికగావుంటే ప్రసాద్ దగ్గరకి వెళ్ళకూడదా...."

"ప్రసాదా—వాడెవడు—ఓహో సరస్వతి గురించి బెదిరిస్తున్నాడు—వాడా? బాగుందయ్యా—డబ్బు కలసొస్తుందని ఓ ఆడమనిషి ప్రాణాలు తీస్తే తీస్తాం. దానికంత హడావుడి చేయాలా — కావాలంటే లక్షరూపాయలు పట్టుకుపొమ్మను...."

"మొత్తం లక్షలన్నీ పట్టుకుపోవాలని పథకంలో ఉన్నాడేమో-నీ చెల్లెల్ని కూడా వలలో వేసుకున్నట్లున్నాడు కదా...."

"ఏడిశాడు. అలాంటి వెధవని నా చెల్లెలు చేరదీస్తుందేమిటీ—"

"ఎందుకు చేరనివ్వదూ—వాళ్ళిద్దరూ కలసి తిరుగుతుంటే నువ్వేకదా కళ్ళారా చూశావు...."

పాఠకుల అభిప్రాయాలు :

'శని రూపాయి' కథలో అసలు క్రైమ్ అనేదే లేదు. ఆ కథను ఎందుకు ప్రచురించారో తెలియదు. 'కైలాస నగరం' ముగింపు చాల బాగుంది.

—ఏ. ఇందిర, కాశీబుగ్గ.

'ఆకలి చావు' నాకు నచ్చిన నవల. కథలలో పగ-ద్వేషం, కత్తిపోటు, పులిబోను వెరైటీగా వున్నాయి. ముఖ చిత్రాలు ముగ్ధ మనోహరంగా ఉంటున్నాయి.

—ఎమ్. కృష్ణకుమార్, సికింద్రాబాదు.

'కైలాస నగరం' సీరియల్ ముగింపు ఊహకు అతీతంగా మలచబడింది. శ్యాంబాబుకు మా ధన్యవాదాలు, 'శాన్యోరా' మంచి సస్పెన్సుతో నడుస్తోంది.

—యం. జి. రామమూర్తి, కొత్తపేట.

ఈ మధ్య కాలంలో 'కైలాస నగరం' లాంటి హృదయానికి హత్తుకున్న ఇతివృత్తంగల సీరియల్ నేను చదవలేదు. రచయితకు నా ధన్యవాదాలు.

—ఎల్. సత్యం- కొత్తూరు.

'కైలాస నగరం' సీరియల్ ఎంత బాగుందంటే, నేనింతవరకు అంత థ్రిల్లింగ్ నవల చదవలేదంటే నమ్మండి, కాని నవల ట్రాజెడీగా ముగియటం నాకు బాధనిపించింది.

—వై. శశిరేఖాదేవి- బెంగుళూరు.

ఈ సంచికకు పులిబోను, ఎర్రఫైలు కథలు హైలైట్స్. 'కైలాస నగరం' సీరియల్‌ను శ్యాంబాబుగారు అద్భుతంగా ముగించారు. వారికి నా ధన్యవాదాలు.

—బి. మునిధర్&రమణ- కొత్తపల్లి.

"ఓహ్—అదా...." పకపక నవ్వాడు మోహనరావు—"అన్నయ్యేమో రాధ కాపలాక్కాయమన్నాడు. ఈలోగా నాకో బార్ పార్టీ తగిలింది. ఎలా వదులుకునేది? సరే—ఇదెలాగూ వాణ్ణి కలుసుకుని వుంటుంది గదా అని అబద్ధం చెప్పేస్తే అది పీకలమీదికి వచ్చేసింది. అయినా అప్పటికి బుకాయించేశాను. ఈవేళో రేపో ఎలాగూ నిజం తెలుస్తుంది. విషయం అప్పటికి పాతబడిపోతుంది కాబట్టి—ఎవరూ పట్టించుకోరు...."

"సరే అవన్నీ నాకెందుకుగానీ — నువ్వెప్పుడైనా హత్యచేశావా లేదా—చెప్పు!"

"ఎవరవయ్యా నువ్వు—నేనేదో సరదాలో ఉంటే పిచ్చి పిచ్చి ప్రసక్తి తీసుకు వస్తావు. అమ్మాయిల మధ్య నుండగా హత్యప్రసక్తి తీసుకురాకు దడుసుకుంటారు. ఇంకా విసిగించకు...." అంటూ అతను విసురుగా కాలూ, చేయీ కదల్చబోయాడు. ఏమీ కదలలేదు ముఖంలో మాత్రం ఏదో ఆనందం అలా వెలుగులు చిందిస్తూనే ఉంది.

ఆ వ్యక్తి ఇంకేమీ మాట్లాడలేదు. తన చేతిలో పాకెట్ రికార్డర్ని ఆఫ్ చేసి జేబులో పెట్టుకొని ఆ గదిలోంచి బయటకు వచ్చి తలుపులు దగ్గరగా వేశాడు.

9

"మేడమ్—నాకో టికెట్ తీసుకోగలరా?"

ఆమె డబ్బివ్వమన్నట్లుగా చేయి చాపింది. అతను అయిదురూపాయలనోటందించాడామెకు. మరో అయిదు నిమిషాల్లో రెండు టికెట్సుతీసుకుని—ఒకటతనికందించి చిల్లర కూడా ఇచ్చేసింది.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. పాం. క్ల. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) ఆగస్టు '77 నెల "అపరాధ పరిశోధన" మాసపత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందినవ్యాఖ్య:

ప్రేతాల దీవి!

ప్రాణాలు హరీ!!

పంపినవారు: శ్రీమతి ఎన్. సుభద్ర, ఎం.ఏ., విద్యానగర్, హైద్రాబాదు.

(2) సప్లిమెంటుకు బహుమతి పొందిన వ్యాఖ్య:

గుండుకు బలి!

గుండెపై చెలి!!

పంపినవారు: శ్రీబి. భాస్కరరావు, సత్యదేవా క్లాత్ మర్చంట్స్, గాంధీచౌక్ రోడ్, బెల్లంపల్లి-504 251.

"మేడమ్—అయితే మీ పక్కన కూర్చుని సినిమా చూసే భాగ్యం నాక్కలిగినట్లేగా...." అన్నాడతను.

ఆమె కాస్త కోపంగా చూసిందతని వంక.

"కోపంలో కూడా మీరు అందంగానే ఉంటారు మిస్ యమునా!" అన్నాడతను.

ఆమె ఉలిక్కిపడి-"నేనెవరో మీకు తెలుసా!"అంది.

"తెలుసా అంటారేమిటి—మీ ఫోటో కూడా నా దగ్గరుంటే—" అంటూ అతను జేబులోంచి ఒక ఫోటో తీసి ఆమెకిచ్చాడు.

ఆమె ఆశ్చర్యంగా దాన్ని చూసి—"ఇది మీ దగ్గర

అక్టోబరు '77 బ్యాలెట్

ఈ నెల ప్రచురించబడిన రచనలలో, మీకు అత్యుత్తమంగా తోచిన వాటి పేర్లు యీ క్రింద వ్రాసి, యీ నెల 10వ తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి.

1. ఉత్తమ నవల (   )
2. ఉత్తమ కథ (   )
3. ఉత్తమ జోక్ (   )

చిరునామా : ....

....

....

"జీవిత చందా"

(ప్రత్యేక బోనస్ రు. 30/—లు)

1. 'జీవిత చందా'కు మీరు చేయవలసిందల్లా, రు. 250/-లు (సుమారు ఆరున్నర సంవత్సరాల చందా) ఒకేసారి పంపటమే. లేదా, వాయిదాలలో కట్ట వచ్చును. మీ మొదటి వాయిదా పైకం చేరగానే మీరు కోరుకున్న రు. 30/-లు విలువగల "అపరాధ పరిశోధన" పాత కాపీలు బోనస్‌గా రిజిష్టరు పోస్టులో పంపగలం. 2. డబ్బు మాకు చేరిన తర్వాత నెలనుండి మొదలుపెట్టి మీకు "అపరాధ పరిశోధన" పత్రిక లేదా సప్లిమెంట్‌ను మీ జీవితకాలమంతా అంద జేస్తాము. 3. సభ్యులనుండి నయాపైస కూడా అద నంగా మళ్ళీ వసూలు చేయటం జరుగదు. 4. ఏ కారణం చేతనైనా మధ్యలో మీరు 'జీవిత చందా'ను విర మించుకోదలచినా, పత్రిక నిలిచి పోయినా అప్పటి వరకు మీకు పంపిన కాపీల ఖరీదు మినహాయించి, మిగతా పైకం త్రిప్పి పంపబడుతుంది.

5. మీరు 'జీవితచందా' ఒకేసారి కట్టలేనివారైతే, నెలసరి 12 వాయిదాలలో కూడా చెల్లించవచ్చును. మొదటి నెల రు. 30/-లు, ఆ తర్వాత వరుసగా 11 నెలలు రు. 20/-లు చొప్పున మణియార్డరు ద్వారా పంపాలి. వాయిదా పైకం ప్రతి నెలా 20 వ తేదీ లోపు పంపాలి. వాయిదాలు సక్రమంగా పంపకపోయినా, మధ్యలో నిలిపినా, సభ్యత్వము రద్దుచేసి అంతవరకు పంపిన డబ్బుకు వచ్చేంతవరకు పత్రికలు పంపబడును.

మీరు ఒక్కసారి ఖర్చుపెట్టండి! మీ జీవిత కాలమంతా మీకు "అపన" తోడుగా వుంటుంది!!

కెలా వచ్చింది?"—అంది.

"సరస్వతి ఇచ్చింది—" అన్నాడతను.

పక్కలో బాంబు పేలినట్లులిక్కిపడిందామె—

"మీరు.... మీరు...." అంది కంగారుగా.

"ఎస్, అయామ్ మిస్టర్ ప్రసాద్...." అన్నాడతను.

యమునకేం చేయాలో తోచలేదు. క్షణం ఆలోచించి అతన్ని బాగా పరిశీలించి చూసింది. పీలంరంగు బెల్ బాటమ్ మీద డార్క్ కలర్ పువ్వులషర్టు టక్ చేశాడు. మనిషిది పసిమిఛాయ. మనిషి చాలా అందంగా ఉన్నాడు. అందం కారణం వల్ల కాబోలు అతని కళ్లు చాలా ఆసూయకంగా ఉన్నాయి.

"మీ గురించి విన్నాను...." అంది యమున.

"కానీ మీలో ఏమీ చలనంకలగలేదు"అన్నాడుప్రసాద్.

"అంటే?"—అంది అదోలా చూస్తూ యమున.

"అబ్బ—మీ ఆడవాళ్ళు ఎంత అందంగా చూస్తారండీ"—అన్నాడతనామెను పరీక్షగా చూస్తూ.

యమున మాట్లాడలేదు.

"మీ ఆడవాళ్ళలో పెద్ద తమాషా ఉందండీ. నాకు పది పదిహేనేళ్ళప్పుడు నా ఈడు ఆడపిల్లలంతా నాకంటే చాలా చాలా పెద్దవాళ్ళలాగుండేవారు. ఇప్పుడు నాఈడు ఆడవాళ్ళంతా నాకంటే చాలా చాలా చిన్న వాళ్ళలాగున్నారు. బై దిబై—మనవయసెంత?"—అన్నాడతను.

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY, (phone: 36959) 3-4-554 Narayanaguda- Hyderabad-500029, and Printed at Kranti Press, Madras-600001.